సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ https://www.suryaepaper.com
ఆదివారం | 1 ఫిబ్రవరి 2026 | హైదరాబాద్

సంపుటి 19 | సంచిక 102
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, మాఘ మాసం శుక్ల పక్షం పౌర్ణమి తె.4.17, పుష్యమి రా.12.48, వర్జ్యం ఉ.9.27 నుంచి 10.59 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.21 నుంచి 5.06 వరకు

### ఏప్రిల్ 30 నాటికి అయోధ్య
## రామమందిర నిర్మాణం పూర్తి!



6లో

- రూ.1900 కోట్ల వ్యయం చేస్తున్నట్టు వెల్లడించిన కమిటీ చైర్మన్
- గడువు ముగిసే నాటికి పనులు, బిల్లుల చెల్లింపునకు ఆదేశాలు
- ఆలయానికి మూడేళ్లు వారంటీ ఇచ్చిన నిర్మాణ సంస్థలు ఎల్‌డిటీ, టాటా కన్సల్టెన్సీ

## అమెరికాలో మళ్లీ షట్‌డౌన్




6లో

- బిల్లులకు ఆమోదం తెలపని కాంగ్రెస్
- మూడొంతుల విభాగాలు ప్రభావితమైన తీరు
- వేతనం లేని సెలవుల్లోకి లక్షల మంది ఉద్యోగులు
- సోమవారం ఎగువసభలో సమావేశం తిరిగి ప్రారంభం

అమెరికాలో మరోసారి షట్‌డౌన్ మొదలైంది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువులోపు కాంగ్రెస్ ఆమోదించలేదు. దీంతో ప్రభుత్వం పాక్షికంగా షడ్ డౌన్ అయింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది.2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు ముగియడంతో ఫెడరల్ ప్రభుత్వంలో మూడొంతుల విభాగాలు ప్రభావితమయ్యాయి.

## నేడే కేంద్ర బడ్జెట్

- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం
- పద్దు కోసం సామాన్యుల ఎదురుచూపులు
- ప్రధాని మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్
- నిర్మలా సీతారామన్‌కు 9వది

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు.

వివరాలు-8లో



### ద్వైపాక్షిక సంబంధాల్లో
## నవశకం!



6లో

- వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్జ్‌తో ప్రధాని మోడీ చర్చలు ఔషధ పరిశ్రమ, గనులు, ఆటోమొబైల్ రంగం, పర్యాటకం వంటి వ్యూహాత్మక అంశాలపై చర్చ
- భారత్ - వెనెజువెలా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం
- 2026 లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన

భారత ప్రధాని నరేంద్ర మోడీ వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఫోన్‌లో సంభాషించారు. రానున్న కాలంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఇద్దరు నేతలు నిర్ణయించారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడంపై చర్చ జరిగింది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న తర్వాత, భారత్-వెనెజువెలా అగ్రనేతల మధ్య జరిగిన మొదటి ఫోన్ కాల్ ఇదే కావడం గమనార్హం.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### బెంగాల్లో టీఎంసీ సర్కార్ ఉంటే
## దేశానికే ముప్పు

- బరాక్పుర్ సభలో హోంమంత్రి అమిత్ షా
- ఓట్ల కోసం దేశ భద్రతను తాకట్టు పెడుతున్నారని ఆరోపణ
- కోర్టు చెప్పినా బీఎస్ఎఫ్‌కు భూమి ఇవ్వడం లేదు
- అవినీతి మంత్రులకు టికెట్లు ఇవ్వొద్దని మమతకు సవాల్

బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బంగాల్లో టీఎంసీ ప్రభుత్వం 'చొరబాటుదారులకు ఆశ్రయం' కల్పిస్తోందని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతనే పణంగా పెడుతోందని ఆయన మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్పుర్లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు.



6లో

### హార్వర్డ్ విద్యార్థుల తో
## రేవంత్ రెడ్డి భేటీ



వివరాలు-2లో

అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ లో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. తన అధికారిక కార్యక్రమాల చివరి రోజు సందర్భంగా ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు.

### 'మహా' ఉపముఖ్యమంత్రిగా సునేత్ర
## ప్రమాణస్వీకారం



2లో

- తొలి మహిళ డిప్యూటీ సీఎంగా రికార్డు
- శుభాకాంక్షలు తెలియజేస్తూ మోడీ ట్వీట్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్ర ఇన్చార్జ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందేతో పాటు ఎన్సీపీకి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

### అంతా ఇంతే!




ఈ బడ్జెట్‌ను బట్టే వెజ్ ఆర్ నాన్‌వెజ్ డిసైడ్ చేద్దామండీ !

### సిట్ నోటీసులపై
## కేసీఆర్ అభ్యంతరం

- జూబ్లీహిల్స్ ఏసీపీకి సంచలన లేఖ
- ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండోసారి సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులు
- దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందన
- నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కేటీఆర్ పిలుపు

:ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండోసారి సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు శనివారం జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు. నాకు ఇచ్చిన నోటీసు అక్రమం. నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు. ఇంటి గోడలకు నోటీసులు అంటించడం ఏంటి. ఇది సరైన పద్ధతి కాదు. చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నా విచారణకు సహకరిస్తా. రేపు నందినగర్ నివాసంలో విచారణకు హాజరవుతా అని లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు.



2లో

### మున్సిపల్ ఎన్నికలు
## మా పాలనకు రిఫరెండం

- పురపాలక ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాం
- పదేళ్ల దొరలపాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
- ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో విస్తృత ప్రచారం
- తొర్రూరు మున్సిపాల్టీని దత్తత తీసుకుంటా
- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పురపాలక ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్స్‌గా భావిస్తోందని, ఈ ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శనివారం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు.



2లో




# హార్వర్డ్‌లో చివరి రోజు.. విద్యార్థుల బృందాలతో రేవంత్ రెడ్డి భేటీ

## పలువురు విద్యార్థుల బృందాలతో సమావేశమయ్యారు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ లో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వెంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు. తన అధికారిక కార్యక్రమాల చివరి రోజు సందర్భంగా ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో పాటు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , కొలంబియా విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు, అలుమ్నీలతోనూ సీఎం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఈ సమావేశాల్లో నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు--మహిళలు--యువతకు సంక్షేమ విధానాలు వంటి అంశాలపై విస్తృత చర్చించారు.

**ఆ పాత్ర నేను ధరించదలుచుకోలేదు**

ముఖ్యమంత్రి పరిపాలనపై తన దృక్పథాన్ని మార్పు దిశగా నాయకత్వం వహించడంలో ఉన్న సవాళ్లతో పాటు తన దీర్ఘకాలిక విజన్ రైజింగ్ తెలంగాణ 2047 కోర్ పిల్లర్లను వివరించారు. సమగ్ర వృద్ధి, భాగస్వామ్య భాగస్వామ్యం (స్టేక్‌హోల్డర్ పార్టిసిపేషన్), శక్తివంతీకరణ ఆధారిత అభివృద్ధికి ఈ విజన్ కల్పించే అవకాశాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థుల బృందం తమకు నాయకత్వం గురించి బోధించాలని కోరగా అందుకు హార్వర్డ్ ప్రొఫెసర్లే ఉత్తములు అని ఈ విషయంలో తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను ధరించదలుచుకోలేదని సీఎం రేవంత్ సరదాగా వ్యాఖ్యానించారు. పరస్పర సంభాషణ, అనుభవాల పంచుకోవడం, పరస్పర అధ్యయనం ఆధారంగా జరిగే సార్థక ద్విముఖ చర్చలకే తాను ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు.

**తెలంగాణ రైజింగ్ బ్రాండ్‌అంబాసిడర్లుగా మారండిఆ**

దేశభవిష్యత్తుకు తెలంగాణ, హైదరాబాద్ ఆదర్శంగా నిలుస్తోందని భారతదేశంతో



అనుసంధానం పెంచుకొని పనిచేయాలని విద్యార్థులకు సీఎం పిలుపునిచ్చారు. "తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి" అని విద్యార్థులకు ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు. సీఎం పిలుపుపై సానుకూలంగా స్పందించిన విద్యార్థులు తెలంగాణ అభివృద్ధి పథంలో తమ నైపుణ్యాన్ని, శక్తిసామర్థ్యాన్ని వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర గ్లోబల్ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలు మా ప్రభుత్వ పాలనకు రిఫరెండం

● పురపాలక ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాం ● పదేళ్ల దొరలపాలనలో పేదలకు ఒరిగింది శూన్యం
● ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో విస్తృత ప్రచారం ● తొర్రూరు మున్సిపాల్టీని దత్తత తీసుకుంటా
● మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పురపాలక ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్స్‌గా భావిస్తోందని, ఈ ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శనివారం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం నుంచి ప్రారంభించి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వర్ధన్నపేట జనగాం మున్సిపాలిటీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.గతంలో పంచాయితీ రాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఆధిక్యత వచ్చిందని, అదే ఫలితం ఇప్పుడు పురపాలికల్లో కూడా పునరావృతం కాబోతోందని అన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకమై పనిచేసే వారికే కాంగ్రెస్ టిక్కెట్లు ఇస్తున్నామని అన్నారు. తమతో కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు ప్రతి ఎన్నికను ప్రభుత్వ పనితీరుకు రిఫరెండం అని ప్రకటించి భంగపడ్డారని, ప్రతి ఎన్నికలలోను ప్రజలు వారిని తిరస్కరించారని గుర్తు చేశారు. ఈసారి కూడా ఆ దొరవారు భంగపడితే ఏం చేస్తారో చెప్పాలని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, ?500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సంస్కరణలు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన



డ్రైనేజీ వ్యవస్థ, పౌర సేవలను వేగవంతం చేయడం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఈ ఎన్నికల్లో పార్టీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని జోస్యం చెప్పారు.

**తొర్రూరు మున్సిపాల్టీని దత్తత తీసుకుంటా:** ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొర్రూరు మున్సిపాల్టీ పరిధిలో పర్యటిస్తూ ఈ తొర్రూరు మున్సిపాల్టీని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న తాను తన నియోజకవర్గంతో సమానంగా ఈ మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నిసంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీతో సహా అందరూ కాంగ్రెస్ వారేనని తొర్రూరు పురపాలికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రగతి పథకాల అమలు మరింత సులువు అవుతుందన్నారు. ప్రభుత్వం పేదల పక్షపాతి అనే విషయం గడచిన రెండేళ్లలో అమలు చేస్న?న్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు వివిధ పథకాలు స్పష్టం చేస్తున్నాయని చెబుతూ కాంగ్రెస్ అభ్యర్థి శ్రవణ్‌ను గెలిపించాలని మంత్రి పొంగులేటి కోరారు.



# సిట్ నోటీసులపై కేసీఆర్ అభ్యంతరం

● జూబ్లీహిల్స్ ఏసీపీకి సంచలన లేఖ ● ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండోసారి సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులు
● దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందన ● నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కేటీఆర్ పిలుపు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి :ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండోసారి సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు శనివారం జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు. నాకు ఇచ్చిన నోటీసు అక్రమం. నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు. ఇంటి గోడలకు నోటీసులు అంటించడం ఏంటి. ఇది సరైన పద్ధతి కాదు. చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నా విచారణకు సహకరిస్తా. రేపు నందినగర్ నివాసంలో విచారణకు హాజరవుతా అని లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు.

**ఇకనుంచి వచ్చే నోటీసులన్నీ ఎర్రవల్లికే రావాలి**

65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని ఈ సందర్భంగా సిట్ అధికారులకు కేసీఆర్ చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదనీ లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు. 'నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారు. ఎన్నికల అఫిడవిట్‌లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదు. ప్రస్తుతం నివసిస్తున్న చోటే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోంది. హరీష్ రావు నోటీసుల విషయంలో పోలీసులు డబుల్ స్టాండర్డ్స్ పాటిస్తున్నారు. పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తా. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధం. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటా. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చు. కానీ నేను ఆపని చేయడం లేదు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచన చేస్తున్నాను. పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయి' అని లేఖలో కేసీఆర్ ఆవేదన చెందారు. అంతేకాదు.. ఏపీ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు.

**నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కేటీఆర్ పిలుపు**

తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారంలో ఇప్పటికే అధికారులతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను విచారించిన సిట్ అధికారులు తాజాగా మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్ఎస్ నేతలు, న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కేసీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో సిట్ విచారణపై స్పందించారు.

అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసనలకు పిలుపునిచ్చారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ నోటీసులు జారీ చేశారని మండిపడ్డ కేటీఆర్, ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

ప్రతి మున్సిపల్ వార్డు, నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించాలని, నల్ల జెండాలతో నిరసన తెలపాలని కేటీఆర్ సూచించారు. అలాగే నగరాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు. ఇతర బీఆర్ఎస్ సీనియర్ నేతలు ప్రత్యక్షంగా పాల్గొని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. అలాగే ఈ నిరసన కార్యక్రమాలన్నీ అత్యంత శాంతియుతంగా జరగాలని, ఎక్కడ పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని పార్టీ శ్రేణులకు కేటీఆర్ స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను గట్టిగా వినిపించాలని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ విచారణకు అంగీకరించిన తరుణంలోనే పార్టీ క్యాడర్ ఈ స్థాయిలో రోడ్లపైకి రానుండటంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉంది.

# అభివృద్ధిపై దృష్టి పెట్టండి

● ప్రభుత్వ శాఖల పనితీరుపై సిఎస్ సమీక్ష ● అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా
● రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, రవాణా, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై వివరాల సేకరణ
● ఆయా పనుల్లో పురోగతి కనబర్చాలని ఆదేశం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం నాడు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

**దేవాదాయ, చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి శాఖ** : దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం (యాదగిరిగుట్ట), వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలెట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు.

వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు.

**రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ** : భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసెస్, శాఖ: క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి



ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు. రవాణా, రోడ్లు భవనాలు శాఖ : సమావేశంలో రాష్ట్ర రహదారుల నిర్మాణం, నిర్వహణ, ప్రభుత్వ భవనాల నిర్మాణ పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల సామర్థ్యం తదితర అంశాలపై ప్రధాన కార్యదర్శి సమగ్రంగా సమీక్షించారు. రహదారుల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి కీలకమని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే రహదారుల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో చేపట్టిన పలు ప్రభుత్వ ఆసుపత్రులు వరంగల్, ఎల్.బి.నగర్, ఆల్వాల్, సనత్ నగర్, న్యూ ఉస్మానియా, హైకోర్టు నూతన భవనం, భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించాలని, వాహనాల నమోదు, డ్రైవింగ్ లైసెన్సులు, రహదారి భద్రత చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.

**పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ :** పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, సెర్ప్, మిషన్ భగీరథ శాఖల పనితీరు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామ పంచాయతీల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం అమలు పురోగతి, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మహిళ సంఘాల బ్యాంక్ లింకేజ్, తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. పథకాల అమలులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పారదర్శకతను పాటించాలని అన్నారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్. శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ వీసీ ఎండీ సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ – ఇన్ చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# గద్దర్‌కు ఘన నివాళి

● విప్లవ గాయకుడు గద్దర్ ఆశయాలు చిరస్మరణీయం
● టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రజా గాయకుడు, విప్లవ కవి, సామాజిక చైతన్యానికి ప్రతీక అయిన గద్దర్ జయంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గద్దర్ పోరాట జీవితం, ప్రజల పక్షాన నిలిచిన ఆయన కళా ప్రయాణం దేశానికి శాశ్వత ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. "గద్దర్ తన గళంతో, తన పాటలతో అణగారిన వర్గాల ఆర్తిని దేశం ముందుకు తీసుకొచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది" అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం నిలబడిన కళాకారుడిగా గద్దర్ గారి ప్రతి పాట ఒక ఉద్యమమని, ప్రతి మాట ఒక మేల్కొలుపుగా మారిందని ఆయన కొనియాడారు. తెలంగాణ ఉద్యమ కాలంలో గద్దర్ పాటలు కోట్లాది ప్రజలకు ధైర్యం, భరోసా నింపాయని, ప్రజా ఉద్యమాలకు సాంస్కృతిక శక్తి ఎంత అవసరమో ఆయన తన జీవితంతో నిరూపించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే స్వరం ఎంత కీలకమో గద్దర్ తన జీవితం ద్వారా చూపించారని, ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడిన వారిని గౌరవిస్తుందని, సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం వంటి విలువలను కాపాడేందుకు నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, సీపీఐ మధ్య కుదరని పొత్తు?

● భట్టి, పొంగులేటి ఇలాఖాలోనూ ఇదే పరిస్థితి
● మున్సిపల్ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికలను రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ సీరియస్‌గా తీసుకున్నాయి. ఎలాగైనా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జెండా పాతాలని వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలోనే గెలిచే అవకాశాలు ఉన్న ప్రతీచోట పొత్తులతో ముందుకు వెళ్తున్నాయి. అయితే.. అసెంబ్లీ ఎన్నికల నుంచి మిత్రపక్షాలుగా కొనసాగుతున్న కాంగ్రెస్, సీపీఐలు.. మునిసిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా మారుతాయని తెలుస్తోంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రాతినిధ్యం వహిస్తున్న భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పొరేషన్లో ఈ పార్టీల మధ్య పొత్తు కుదరకపోవటంతో ఇతర చోట్ల కూడా ఎవరికి వారే నామినేషన్లు వేశారు. 60 డివిజన్లు ఉన్న కొత్తగూడెంలో సీపీఐ 30 డివిజన్లు ఇవ్వాలని కోరగా, కాంగ్రెస్ 20 మాత్రమే ఇచ్చేందుకు సుముఖత వ్యక్తంచేసింది. చివరకు 25 డివిజన్లు అయినా ఇవ్వాలని సీపీఐ కోరినా.. కాంగ్రెస్ ఒప్పుకోలేదు. దీంతో శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావటంతో సీపీఐ అభ్యర్థులు మొత్తం 60 డివిజన్లలోనూ నామినేషన్లు వేశారు. కొందరు టీడీపీ సానుభూతిపరులు కూడా సీపీఐ తరపున నామినేషన్లు వేసినట్టు తెలిసింది.

భట్టి, పొంగులేటి ఇలాఖాలోనూ ఇదే పరిస్థితి

అంతేకాదు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులుండగా, 15 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు, మొత్తం 32 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. దీంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర మున్సిపాలిటీలో 22 వార్డులుండగా.. పొత్తు కుదరకపోవడంతో సీపీఐ ఐదు చోట్ల నామినేషన్ వెయ్యగా మొత్తం అన్ని చోట్లా కాంగ్రెస్ నేతలు నామినేషన్లు వేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్, సీపీఐ సొంతంగానే పోటీ చేస్తున్నాయి. దీంతో ఈ రెండు పార్టీల మధ్య భవిష్యత్తు ఎలా ఉండబోతోందని చర్చ మొదలైంది.

# తెలంగాణపై ప్రధానికి చిన్నచూపు తగదు

## ఈసారైనా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి : మంత్రి పొన్నం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్ర భాజపా ఎంపీలు కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు ఏం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణపై ప్రధాని మోదీ చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పుట్టుకనే ప్రధాని మోదీ అవమానించారని విమర్శించారు. ఆర్ఆర్ఆర్, మెట్రోకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. "కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారంగా మాట్లాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రంతో సయోధ్య కోరుకుంటోంది. బడ్జెట్‌లో మా ప్రతిపాదనలను కేంద్రం అంగీకరించాల్సిందే. తెలంగాణ ఎంపీలు రాష్ట్రం కోసం పోరాడాలి. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలి. రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలి" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువ పనులు వేగవంతం

● భూ సేకరణకు త్వరలో రూ.54.55 కోట్లు
● మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో డి4 కాలువ పనులు ముమ్మరం

తెలంగాణ బ్యూరోప్రతినిధిః కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, సైదాపూర్ మండలాల పరిధిలోని 15,631 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కీలకమైన గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువ (డి4) పనులు వేగవంతమయ్యాయి. ఈ కాలువ నిర్మాణానికి భూసేకరణ కొలిక్కి వచ్చింది. భూ సేకరణకు కావలసిన నిధులు త్వరలో మంజూరు కానున్నాయి. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల పరిధిలోని 15,631 ఎకరాలకు సాగునీరు అందించేందుకు గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువ ఞ4 ఎంతో కీలకమైనది. ఈ కాలువ నిర్మాణానికి కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాల పరిధిలో 260 ఎకరాల భూమి అవసరంగా గుర్తించారు. భూ సేకరణలో ఎదురైన సమస్యలు, రైతుల అభ్యంతరాలు, పరిహారం చెల్లింపులో జాప్యం వంటి అంశాల్లో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో తరచూ సమీక్షిస్తూ భూ సేకరణ కోసం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా న్యాయమైన పరిహారం పారదర్శకంగా చెల్లించాలన్న సంకల్పంతో ముందుకెళ్లారు. ఫలితంగా భూ సేకరణ వేగవంతమైంది. భూ సేకరణకు 54.55 కోట్ల రూపాయల నిధుల విడుదలకు ట్రెజరీ శాఖలో టోకెన్ జనరేట్ అయింది. పరిహారం చెల్లింపుగాను ఈ నిధులు త్వరలో విడుదల కానున్నాయి. దీంతో గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణ పనుల్లో వేగం పుంజుకోనుంది. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే చిగురుమామిడి, సైదాపూర్ మండలాల పరిధిలోని రైతులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగనుంది. వ్యవసాయ ఉత్పాదకత పెరిగి రైతులు రైతు కూలీల జీవనోపాధికి ఈ కాలువ ఎంతో ఉపకరిస్తుంది.




## ఒప్పందం చేసుకున్న ప్రతీ ప్రాజెక్టుపైనా ప్రత్యేక శ్రద్ధ

- సరైన సమయంలో పరిశ్రమలు పూర్తైతేనే అందరికీ ప్రయోజనం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు
- కుప్పంలో రూ.7,684 కోట్ల పెట్టుబడితో 21 పరిశ్రమల ఏర్పాటు
- ఆరు కొత్త పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు ఎంఓయూలు
- కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో పరిశ్రమల పురోగతిపై సీఎం చంద్రబాబు సమావేశం



కుప్పం, జనవరి 31: రాష్ట్రంలో ఒప్పందం చేసుకున్న ప్రతీ ప్రాజెక్టుపైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎంఓయూ చేసుకుంటే అది ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా పూర్తి అయ్యేందుకు పూర్తిగా సహకరిస్తామని వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలోనే అనుమతులు మంజూరు చేసి ప్రాజెక్టు సాకారమయ్యేలా చూస్తామని పారిశ్రామిక వేత్తలకు సీఎం భరోసా ఇచ్చారు. శనివారం కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని పరిశ్రమల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్షించారు. యూనిట్‌లను ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. కుప్పంలో కొత్త పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమల పురోగతి తదితర అంశాల గురించి చర్చించారు. సరైన సమయంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే అందరికీ ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఆలస్యమైతే అందరికీ నష్టమేనని.. పెట్టుబడి వ్యయం పెరగటంతో పాటు వయబిలిటీ అంశంలోనూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. నిర్దేశిత గడువులోగానే ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. కుప్పంలో రూ. 7684 కోట్ల విలువైన పెట్టుబడులతో 21 పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని ఆయన తెలిపారు. వీటి ద్వారా 35,545 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా మరో 44,584 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమలకు అనువైన ఎకో సిస్టంను తయారు చేశామని.. పెట్టుబడులకు అత్యుత్తమ ప్రాంతంగా మారిందని అన్నారు. తయారైన ఉత్పత్తుల రవాణాకు వీలుగా తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలు కూడా అతి దగ్గరగానే ఉన్నాయని అన్నారు. కుప్పం నుంచి వివిధ ప్రాంతాలను కలిపేలా మంచి రహదారి నెట్వర్క్ ఉందన్నారు. కృష్ణగిరి-పలమనేరు, చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారులతో పాటు కొత్తగా బెంగుళూరు నుంచి కేజీఎఫ్ మీదుగా చెన్నైకి మరో రహదారి రానుందని తెలిపారు. రైలు కనెక్టివిటీ కూడా ఈ ప్రాంతానికి ఉందని వివరించారు. చిత్తూరు- కుప్పం మధ్య కొత్త రైలు మార్గం ప్రతిపాదన కూడా ఉందన్నారు. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులను కూడా లింక్ చేస్తామని త్వరలోనే విమానాశ్రయ నిర్మాణం కూడా చేపడతామని సీఎం తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి నీటి సరఫరా జరిగేలా హంద్రీనీవా కాలువలు ఉన్నాయని అన్నారు.

## శ్రీ వారి వైద్య సేవపై టిటిడి జెఈఓ (హెచ్‌ఈ) సమీక్ష



తిరుపతి, 2026, జనవరి 31: శ్రీ వారి వైద్య సేవపై టిటిడి ఆరోగ్యం మరియు విద్య విభాగాల జెఈఓ డా. శరత్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం శనివారం జెఈఓ (హెచ్ & ఈ) కార్యాలయ ఛాంబర్లలో జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ ఆసుపత్రుల్లో అవసరమైన నిపుణులు లేదా వైద్యుల సంఖ్యపై నివేదిక రూపొందించాలని సంబంధిత విభాగాధిపతులను ఆయన ఆదేశించారు. అలాగే శ్రీ వారి వైద్య సేవ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన యాప్‌లో అవసరమైతే మార్పులు చేయాలని జీఎం ఐటీ ఫణికుమార్ నాయుడును జెఈఓ సూచించారు. ఈ సమావేశంలో స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్.వి. కుమార్, శ్రీ పద్మావతీ చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డా. శ్రీనాథ్ రెడ్డి, టీటీడీ సీఎంఓ డా. కుసుమ కుమారి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డా. రేణు దీక్షిత్, బర్డ్ మెడికల్ సూపరింటెండెంట్ డా. వెంకట రెడ్డి, ఎస్ఈ మనోహరం, చీఫ్ పీఆర్వో డా. రవి తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెట్ జ్యోతి యర్రాజీకి గ్రూప్-1 ఉద్యోగం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విశాఖపట్నానికి చెందిన ప్రముఖ అథ్లెట్ జ్యోతి యర్రాజీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత గౌరవం అందించింది. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 ఆఫీసర్ ఉద్యోగాన్ని మంజూరు చేసింది. క్రీడల్లో ఆమె సాధించిన అసాధారణ విజయాలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు సృష్టించిన జ్యోతి యర్రాజీ ఆసియా, అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరపున పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. కఠినమైన సాధన, అంకితభావంతో అగ్రస్థాయికి ఎదిగిన ఆమె యువతకు ఆదర్శంగా నిలిచారు. విశాఖపట్నం నుంచి అంతర్జాతీయ క్రీడా వేదికల వరకూ సాగిన ఆమె ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలో క్రీడా రంగానికి మరింత ఉత్సాహం నింపనుందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు. గ్రూప్-1 ఉద్యోగం మంజూరుతో జ్యోతి యర్రాజీకి పరిపాలనా సేవల్లోనూ అవకాశం లభించనుండగా, అదే సమయంలో క్రీడల్లో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలనే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచిన జ్యోతి యర్రాజీకి ఈ గౌరవం అందడం విశాఖపట్నం ప్రజల్లో ఆనందాన్ని నింపింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ఇలాంటి ప్రోత్సాహం ఇవ్వడం భవిష్యత్ తరాలకు బలమైన సందేశంగా నిలుస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సభ్య సమాజం సిగ్గుపడేలా అంబటి వ్యాఖ్యలు



అమరావతి, జనవరి 31 : గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ఆ పార్టీ నేతల్లో ఎలాంటి మార్పురాలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మండిపడ్డారు. శనివారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ....ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. సభ్య సమాజం సిగ్గుపడేలా చంద్రబాబుపై అంబటి జుగుప్సాకర వ్యాఖ్యలు హేయం. గత ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ఆ పార్టీ నేతల్లో ఎలాంటి మార్పు లేదు. కమిషన్లకు కక్కుర్తి పడి పరమ పవిత్రమైన శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయడమే వైసీపీ నేతలు ఇంకా సిగ్గు లేకుండా బుకాయిస్తున్నారు. అల్లర్లు రాజేసి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారు. ఆ కుట్రలో భాగంగానే అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి, లేకుంటే ప్రజలే తరిమి కొడతారని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు.

# ఈ-సైకిళ్ల పంపిణీలో కుప్పం గిన్నిస్ రికార్డు

- శివపురం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిళ్ల ర్యాలీ
- స్వయంగా సైకిల్ తొక్కుకుంటూ వేదిక వద్దకు చేరుకున్న సిఎం
- ఆర్థిక అసమానతలు తగ్గేలా కూటమి ప్రభుత్వ విధానాలు
- పేదలు ఎదగాలి... పారిశ్రామికవేత్తలు కావాలి
- ఎంఎస్ఎంఈలు స్థాపించే డ్వాక్రా మహిళలకు బ్యాంకర్ల సహకారం అవసరం
- వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమావేశంలో సీఎం చంద్రబాబు



కుప్పం, జనవరి 31: పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు.. వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వ విధానాలు ఉంటాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గంలో చరిత్ర సృష్టించినట్లు ప్రకటించారు. ఒకే రోజు 5,555 ఈ-సైకిళ్ల పంపిణీ చేపట్టి గిన్నిస్ రికార్డు సాధించింది చిత్తూరు జిల్లా. 'పేదల సేవలో ప్రజావేదిక' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పేదలకు 5,555 ఈ-సైకిళ్లను సీఎం చంద్రబాబు పంపిణీ చేశారు. ప్రజలు సైకిల్‌కు ఓటు వేశారని, అభివృద్ధి అంటే ఏంటో తాము చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. అంతకు ముందు శివపురం నుంచి ప్రజావేదిక వరకు ఈ-సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి పాల్గొని ఈ-సైకిల్‌పైనే స్వయంగా సైకిల్ తొక్కుకుండూ వేదిక వద్దకు చేరుకున్నారు. కాగా, ఒకే రోజు 5,555 ఈ-సైకిళ్ల పంపిణీ చేపట్టి గిన్నిస్ రికార్డును సాధించినట్లు గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రకటించారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ అందుకున్నారు. కుప్పం నియోజకవర్గాన్ని కాలుష్య రహితంగా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5,555 ఈ-సైకిళ్ల పంపిణి చేశారు. ఈ-మోటరాడ్ అనే సంస్థ.. కుప్పంలోనే ఈ సైకిళ్లను అసెంబుల్ చేసి, జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. పథకాల లబ్దిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ అయ్యారు. పీ4 పథకంలోని



బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ప్రతినిధులతో సీఎం సమావేశం నిర్వహించారు. అలాగే వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ పథకంలోని లబ్దిదారులతో సంభాషించారు. అలాగే ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. టెక్నాలజీ వినియోగంతో వాతావరణం అంచనాలు, రియల్ టైమ్ డేటా ఎనలిటిక్స్ వంటి అంశాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వైద్య సేవలను ప్రజల్లోకి మరింత అందించడం.. స్క్రీనింగ్ టెస్టులకు సంబంధించిన స్టాల్స్ సందర్శించారు. ఈ ఏడాదిలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. డ్వాక్రా మహిళల ద్వారా పశుపోషణ చేపట్టి సాధికారత సాధించేలా కార్యక్రమం చేపడుతున్న స్టాల్ సందర్శించిన ముఖ్యమంత్రి అక్కడ పలువురు పాడి రైతులతో సంభాషించారు. ఆధార్ మాదిరిగా పశువుల కోసం రూపొందించిన గోధార్ ప్రాజెక్టు ప్రగతి ఎంత వరకు వచ్చిందని సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. పాడి రైతులకు తక్కువ ధరలో దాణా లభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పుట్టిన దూడలను తాము వెంటనే అమ్మేస్తామని సీఎంకు పాడి రైతులు చెప్పారు. పుట్టిన దూడలను వెంటనే అమ్మేసుకోకుండా ప్రత్యామ్నాయ విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. దాణాకు ఇబ్బంది లేకుండా గడ్డి పండించాలని సీఎం పాడి రైతులకు సూచించారు. ఇప్పుడు కుప్పంలో నీటికి ఇబ్బంది లేదు కాబట్టి... గడ్డి పెంపకం మీద దృష్టి పెడతామని పాడి రైతులు చెప్పారు.

**బంగారు మిత్రలతో బంగారు కుటుంబాలకు అవగాహన**

కుప్పం నియోజకవర్గంలోని పీ4 పథకంలో భాగంగా ఎంపికైన బంగారు కుటుంబాలు-మార్గదర్శులతో సీఎం సమావేశమయ్యారు. కుప్పంలోని మూడు మండలాలను దత్తత తీసుకున్న మెఘా ఇంజనీరింగ్, అదానీ ఫౌండేషన్, టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. రామకుప్పం మండలంలో ప్రస్తుతానికి 100 కుటుంబాలకు జీవనోపాధి చూపించామని మెఘా ఇంజనీరింగ్ ప్రతినిధి తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి వారికి మెఘా ఇంజనీరింగ్ సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. బంగారు కుటుంబాలకు ఆదాయం పెంచేలా చర్యలు చేపడుతున్నామని ఎంఈఐఎల్ ప్రతినిధి వెల్లడించారు. ప్రతి వంద కుటుంబాలకు ఓ బంగారు మిత్రను నియమించుకున్నామని... వారి ద్వారా బంగారు కుటుంబాలకు అవగాహన కల్పిస్తున్నామని మెఘా ఇంజనీరింగ్ ప్రతినిధి వివరించారు. ప్రస్తుతానికి 30 కుటుంబాలను గుర్తించి వారికి చేయూత ఇచ్చామని టీవీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. మరికొంత మంది బంగారు కుటుంబాలను అడాప్ట్ చేసుకుంటామని టీవీఎస్ తెలిపారు. తమ ప్లాంట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పీ4 పథకం తెచ్చినందుకు సీఎం చంద్రబాబుకు బంగారు కుటుంబాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. తల్లిని వదిలి ఉపాధి కోసం వేరే ప్రాంతానికి వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా ఉపాధి పొందుతున్నామని లబ్దిదారులు సీఎంకు వివరించారు. పీ4 పథకంతో తమ జీవితాలు బాగుపడుతున్నాయని లబ్దిదారులు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."బంగారు కుటుంబాలకు అహగాహన కల్పించేలా బంగారు మిత్రలను నియమించుకోవడం మంచి పరిణామం. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఏ మేరకు వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయొచ్చో చూడండి. దశలవారీగా పేద కుటుంబాలను వృద్ధిలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి. ఆర్థికంగా ఆదుకోవటంతో పాటు అక్షరాస్యత పెంచేలా చూడాలి, ఉపాధి కల్పించాలి. ఉద్యాన, డైరీ, సెరీ కల్చర్ లాంటి వివిధ రకాల ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి. భూమిలేని వారికి పశువుల పెంపకం లాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపండి. 500-700 కుటుంబాలను క్లస్టర్ గా మార్చి పర్యవేక్షణ చేపడితే మార్పు కనిపిస్తుంది. సమాజంలో అసమానతలను తగ్గించే ఉద్దేశ్యంతో పీ4 అమలు చేస్తున్నాం. ఆదాయార్జనకు వివిధ రకాల మోడళ్లను అమలు చేయటం ద్వారా పేదల సంపద పెంచొచ్చు. మల్టిపుల్ అప్రోచ్ విధానంలో బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను కూడా ఇంటిగ్రేట్ చేసుకోండి. త్వరలోనే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో పేద, ధనికా తేడా లేకుండా 2.50 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందేలా ప్రణాళిక చేశాం. కుప్పంలో ఏర్పాటు కాబోయే పరిశ్రమలతో 40 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

**దళారుల ఇబ్బందులు తప్పాయి...**

మరో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూయర్ కార్యక్రమ లబ్దిదారులతో, వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఎంఎస్ఎంఈ సంస్థలు చేస్తున్న కార్యకలాపాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రభుత్వం ప్రారంభించిన వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానంతో తమకు లాభం చేకూరిందని పలువురు లబ్దిదారులు సీఎంకు వివరించారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న తాము చేస్తున్న వ్యాపారాలను ఈ పథకం ద్వారా విస్తరించుకుంటున్నామని లబ్దిదారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంలో తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించాల్సి వచ్చేదని... ఇప్పుడు వన్ ఫ్యామ్లీ వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానం ద్వారా పారిశ్రామికవేత్తగా మారిన తర్వాత దళారుల బారిన పడకుండా తమ ఉత్పత్తులను తామే అమ్ముకోగలుగుతున్నామని పలువురు మహిళలు సీఎంకు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఎంఎస్ఎంఈలకు 95 శాతం మేర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి గ్యారెంటీ ఇస్తున్నాం. డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాల్ని చెల్లించటంలో ముందున్నాయి. డ్వాక్రా రుణాల్లో కేవలం కేవలం 2 శాతమే నిరర్థక ఆస్తులుగా మారుతున్నాయి. ఎంఎంస్ఎంఈలు స్థాపిస్తున్న డ్వాక్రా మహిళలకు బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలి. అరకు కాఫీని కూడా ప్రమోట్ చేసేలా కార్యక్రమాలు చేపట్టాలి. టీ స్టాల్ చైన్స్ ఏర్పాటుకు సహకారం అందిస్తాం. ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండ్ ప్రమోషన్, క్వాలిటీ, ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ పై లబ్దిదారులు దృష్టి పెట్టాలి. అందరి ఆదాయం పెరగాలి... సంపద అందరికీ దక్కాలి. ఆర్థిక అసమానతలను రూపుమాపేలా వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానం ద్వారా కృషి చేస్తున్నాం." అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# బీసీలకు అన్యాయం చేస్తే సహించం

- కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- వచ్చే ఆర్థిక సంవత్సరం బీసీల బడ్జెట్ 25వేల కోట్లు కేటాయించాలి
- బీసీ కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించాలి
- అర్హులైన ప్రతీ బీసీ కుటుంబానికి రూ.10లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి
- బీసీ సంఘం సమావేశంలో బీసీ జేఏసీ ఛైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు రూ.25వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ జేఏసీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. శనివారం బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డా.ర్యాగ అరుణ్ బాబు జరిగిన సమావేశంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, తెలంగాణ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ సంఘం అధ్యక్షుడు జి అనంతయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, సి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ఖజానా ఖాళీ అని బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలను నిలిపివేశారని, కార్పొరేషన్ కార్యాలయాలను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ధ్వజమెత్తారు. అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని అధికారంలోకి వచ్చాక బీసీలను మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల కోటాలో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బీసీల 42% రిజర్వేషన్ల అంశం హై కోర్టులో కేసు ఉండగా..బలమైన వాదనలు వినిపించకుండా వాయిదాలు కోరడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో బీసీలకు పార్టీల పరంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ వ్యతిరేక పార్టీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు తాము సిద్దంగా ఉన్నామని కృష్ణయ్య హెచ్చరించారు.

# 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'గా తెలంగాణ యువత...

- స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ఆర్థిక వ్యవస్థను శాసించేది మూలధనం కాదు.. నైపుణ్యమే
- 'ఫీస్టా 2026' సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ యువతను ప్రస్తుత అంతర్జాతీయ స్థాయి అవసరాలకు అనుగుణంగా 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ దిశగా యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శుక్రవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఇంటెలిజెంట్ అండ్ ఎవాల్వ్ స్ట్రాటజీస్ ఇన్ టాలెంట్ అక్విజిషన్(ఫీస్టా) 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించేది మూలధనం కాదని, నైపుణ్యం మాత్రమేనన్నారు. నిరంతరం నేర్చుకునే తత్వం ఉన్న చోటే ప్రతిభ నిలుస్తుందని, అదే వృద్ధికి అసలైన ప్రాతిపదిక అన్నారు. భారత వృద్ధి రేటు సుమారు 7 శాతం వరకు ఉండొచ్చని తాజాగా విడుదలైన కేంద్ర ఆర్థిక సర్వే అంచనా వేసిందన్నారు. ఇది శుభపరిణామని, అయితే... ఈ వృద్ధిని నిలబెట్టుకోవాలంటే కేవలం బడ్జెట్ కేటాయింపులు సరిపోవని, సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. కృత్రిమ మేధపై ఆధారపడటం కంటే, దానిని సమర్థవంతంగా వాడుకునేలా సంస్థలు రూపాంతరం చెందాలని, లేకపోతే... దీర్ఘకాలంలో సవాళ్లు ఎదురయ్యే ప్రమాదముందన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే రాష్ట్రంగానే కాకుండా, పరిశ్రమలకు భవిష్యత్తు భాగస్వామిగా మార్చేలా తెలంగాణను తీర్చి దిద్దుతున్నామన్నారు. అత్యుత్తమ మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణను నిలపడంలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, ఐకాం, లైఫ్ సైన్సెస్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటర్నేషన్ స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ టెక్ కంపెనీలకు చెందిన హెచ్ ఆర్ హెడ్స్, సోషల్ టాలెంట్ ఫౌండర్ జానీ క్యాంప్ బెల్, క్యారలాన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండీ పవన్ సచ్ దేవా, క్రౌడ్ స్ట్రైక్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ మీనన్, ప్రముఖ నటి, రచయిత్రి మందిరాబేడీ, ఫీస్టా 2026 ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు హరికృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్లు, వారి వెనుక ఉన్న కింగ్‌పిన్లపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా అక్రమ రవాణాను పూర్తిగా అణిచివేయడానికి కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అరెస్టు చేసింది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించి, బెంగళూరు మీదుగా చైనాకు ఎగుమతి చేస్తున్న ప్రధాన కింగ్‌పిన్‌గా ముజామిల్ గుర్తింపు పొందాడు. లైసెన్సుల పేరుతో అక్రమ రవాణా సాగించినట్లు దర్యాప్తులో తేలింది. ముజామిల్‌పై ఇప్పటికే అనేక కేసులు నమోదై ఉండగా, వాటిలో 87 శాతం కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయి. శిక్షల నుంచి తప్పించుకునేందుకు కొంతకాలంగా పరారీలో ఉన్న అతడిని శనివారం ఉదయం చిత్తూరు -- నాయుడుపేట జాతీయ రహదారిపై అదనపు ఎస్పీ కులశేఖర్ నేతృత్వంలోని బృందం అరెస్టు చేసింది. విచారణలో ముజామిల్‌కు చైనాకు చెందిన జైమెన్ టాంగాంగ్ ఫాంగ్ ట్రేడ్ కంపెనీతో సంబంధాలు ఉన్నట్టు వెల్లడైంది. ఈ నెట్‌వర్క్ ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణా సాగినట్లు అధికారులు నిర్ధారించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై నిర్దయగా చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల చిత్తూరు జిల్లా పర్యటనలో హెచ్చరించారు. కింగ్‌పిన్లు ఎక్కడ దాగి ఉన్నా పట్టుకుంటామని స్పష్టం చేశారు. ఆ హెచ్చరికలతోనే యాంటీ రెడ్ శాండర్స్ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించి తొలి విజయాన్ని సాధించింది.

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్ 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.36/EE/GHMC/CIR-48/2025-26, తేది: 31-01-2026

రూ. 2.20 లక్షల అంచనా వ్యయంతో కూడిన (03) పనుల కోసం, నెం. 36/EE/GHMC/CIR-48/2025-26 (ఐటెం నెం. 01 నుండి 03) తేదీ: 31.01.2026 న 'ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించబడ్డాయి. బిడ్ల అమ్మకం 31.01.2026న మ॥ 2.00 గంటల నుండి 'ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో ప్రారంభమవుతుంది మరియు బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ 03.02.2026న మ॥ 2.00 గంటలు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందుగా ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్, GHMC

DIPR.RO.No.14791-PP/CL/Advt/1/2025-26 , Dt: 31-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్** GHMC

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్:GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నెం.49/EE/CIR-49/SLPZ/GHMC/1/2025-26, తేది: 31-01-2026

**పని పేరు:** ఇతర పనులు. **అంచనా వ్యయం (రూ. లక్షలలో) : 2.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది మరియు సమయం :** 31-01-2026 ఉ॥ 11.45 గం॥లకు. **బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 03-02-2026 ఉ॥ 11.45 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ - 49, ఎస్ఎల్‌పి జోన్, GHMC, సెల్: 9000115410.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, GHMC

DIPR.RO.No.14815-PP/CL/Advt/1/2025-26 , Dt: 31-01-2026

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## బంధాల మధ్య అగాధం

ప్రస్తుత ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు, ముఖ్యంగా స్త్రీ పురుషుల మధ్య అనుబంధాలు రోజురోజుకూ క్షీణిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఒకప్పుడు నమ్మకం, గౌరవం, ఓపిక పునాదులుగా సాగిన బంధాలు, నేడు అహాలు, అనుమానాలు, తాత్కాలిక ఆకర్షణల వల్ల కుప్పకూలుతున్నాయి. మారుతున్న జీవనశైలి, సామాజిక మార్పులు, సోషల్ మీడియా ప్రభావం వల్ల వ్యక్తుల మధ్య ఆత్మీయత తగ్గి, యాంత్రికత పెరుగుతోంది. కుటుంబ వ్యవస్థలో కీలకమైన భార్యాభర్తల బంధం గతంలో ఎన్నడూ లేనంత క్లిష్టంగా మారుతోంది.

జనసేన పార్టీకి చెందిన అరవ శ్రీధర్ ఉదంతం, సామాజికంగా వెలుగులోకి వస్తున్న అనేక ఇతర ఘటనలు నేటి సమాజంలో మానవ సంబంధాలు ఎంతటి దారుణమైన స్థితికి చేరుకున్నాయో తెలియజేస్తున్నాయి. బాధితురాలు మీడియా ముందు పెట్టిన ఆధారాలు, పదేపదే అబార్షన్లు చేయించడం వంటి ఆరోపణలు వింటుంటే సమాజంలో నైతికత ఏ స్థాయిలో పతనమైందో అర్థమవుతోంది. కేవలం ఈ ఒక్క ఘటనే కాకుండా, నేటి కాలంలో స్త్రీ పురుషుల మధ్య పెరుగుతున్న విపరీత ధోరణులను విశ్లేషిస్తే భయంకరమైన వాస్తవాలు కనిపిస్తాయి.

సమాజంలో రాజకీయ నాయకులు లేదా సెలబ్రిటీలు యువతకు రోల్ మోడల్స్‌గా ఉంటారు. అలాంటి స్థానాల్లో ఉన్నవారు ఇటువంటి అనైతిక పనులకు పాల్పడినప్పుడు, సామాన్యుల్లో అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అనే తప్పుడు భావన బలపడుతుంది. ఇది సమాజంలో నైతిక విలువల పతనానికి దారితీస్తుంది. బంధాలకు ఇచ్చే గౌరవం తగ్గి, కేవలం వాడుకుని వదిలేసే వస్తువులుగా మనుషులను చూసే ప్రమాదకరమైన ధోరణి పెరుగుతుంది.

ముందుగా పురుషుల వైపు నుంచి జరుగుతున్న తప్పిదాలను చూస్తే, ప్రేమ లేదా పెళ్లి పేరుతో నమ్మించి మోసం చేయడం ఒక వ్యసనంగా మారుతోంది. అరవ శ్రీధర్ కేసులో బాధితురాలు ఆరోపించినట్లుగా, శారీరక వాంఛల కోసం ఒక మహిళ జీవితాన్ని పణంగా పెట్టడం, గర్భవతి అని తెలిసినా బాధ్యత తీసుకోకుండా బలవంతంగా అబార్షన్లు చేయించడం అమానుషం. అధికారం లేదా రాజకీయ బలం ఉందనే అహంకారంతో మహిళలను ఒక వస్తువులా చూడటం, వారి భావోద్వేగాలతో ఆడుకోవడం వల్ల సామాజిక వ్యవస్థ కుప్పకూలుతోంది. వివాహేతర సంబంధాల మోజులో కట్టుకున్న భార్యను, పిల్లలను అడ్డు తొలగించుకోవడానికి హత్యలకు కూడా వెనుకాడకపోవడం మృగప్రవృత్తికి పరాకాష్ట.

అదే సమయంలో, మహిళల వైపు నుంచి జరుగుతున్న పొరపాట్లను కూడా విస్మరించలేం. డేటింగ్, సహజీవనం (లివ్-ఇన్ రిలేషన్ షిప్) వంటి పాశ్చాత్య ధోరణుల పట్ల ఆకర్షితులై, ఎదుటి వ్యక్తి గుణగణాలను పూర్తిగా తెలుసుకోకుండానే లోతైన బంధాల్లోకి వెళ్లడం ప్రమాదాలకు దారితీస్తోంది. కొంతమంది మహిళలు ఆర్థిక ప్రయోజనాల కోసం లేదా విలాసవంతమైన జీవితం కోసం వివాహేతర సంబంధాలను పెట్టుకోవడం, అడ్డుగా ఉన్న భర్తను ప్రియుడితో కలిసి అంతమొందించడం వంటి ఘటనలు ప్రతిరోజూ వార్తల్లో చూస్తున్నాం. క్షణికానందం కోసం కన్న బిడ్డలను, తల్లిదండ్రులను వదిలేయడం లేదా వారిని హింసించడం వంటివి మాతృత్వానికి, మానవత్వానికే మచ్చగా మారుతున్నాయి.

ప్రస్తుత సమాజంలో వివాహేతర సంబంధాలు ఒక మహమ్మారిలా విస్తరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వ్యక్తులతో ఏర్పడే అక్రమ సంబంధాలు పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్నాయి. ఈ క్రమంలో జరిగే హత్యలు, ఆత్మహత్యలు కేవలం ఆ వ్యక్తులతోనే ఆగిపోవడం లేదు; వారిపై ఆధారపడిన తల్లిదండ్రులు, పిల్లల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. తల్లిదండ్రులే నేరస్థులుగా మారుతుంటే, ఆ పిల్లలు ఎలాంటి సంస్కారంతో పెరుగుతారనేది ఒక పెద్ద ప్రశ్న. పవిత్రమైన పెళ్లి బంధం నేడు కేవలం ఒక ఒప్పందంగా మారిపోవడం, చిన్న గొడవలకు కూడా ఒకరిని ఒకరు చంపుకునే స్థాయికి చేరుకోవడం ఆందోళనకరం.

ఇలాంటి ఘటనలు స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన సహజమైన నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. నిజాయిసామాజిక మాధ్యమాల అతి వినియోగం కూడా ఈ క్షీణతకు ఒక ప్రధాన కారణం. ఇంట్లో వారితో సమయం గడపడం కంటే, బయటి ప్రపంచానికి తమ జీవితం అద్భుతంగా ఉందని ప్రదర్శించుకోవడానికే ప్రజలు ప్రాధాన్యత ఇస్తున్నారు. వర్చువల్ ప్రపంచంలో దొరికే కృత్రిమమైన ఆనందం కోసం రక్తం పంచుకున్న బంధాలను, కట్టుకున్న భాగస్వామిని దూరం చేసుకుంటున్నారు. నైతిక విలువలు కనుమరుగవుతున్న తరుణంలో, మనిషి ఒంటరితనం పెరిగిపోతోంది. సంబంధాలను నిలబెట్టుకోవడానికి అవసరమైన సహనం, త్యాగం అనే గుణాలు నేటి తరంలో లోపించడం వల్ల మానవత్వం ప్రశ్నార్థకంగా మారుతోంది.

మళ్ళీ పాత రోజుల్లో లాంటి ఆరోగ్యకరమైన సంబంధాలు ఏర్పడాలంటే వ్యక్తుల్లో ఆలోచనా దృక్పథం మారాలి. బంధం అనేది ఒక బాధ్యత అని, అది కేవలం తీసుకోవడం మాత్రమే కాదు ఇవ్వడం కూడా అని గుర్తించాలి. పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం, కష్టాల్లో ఒకరికొకరు అండగా నిలబడటం వంటి ప్రాథమిక సూత్రాలను పాటిస్తేనే మనిషి మనిషిగా మనగలుగుతాడు. లేదంటే, సాంకేతికంగా ఎంత ఎదిగినా, మానసిక ప్రశాంతత లేని సమాజంలో మనం మిగిలిపోతాం.

ఈ పరిస్థితి మారాలంటే కేవలం చట్టాలు మాత్రమే సరిపోవు. పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలు, స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన పరస్పర గౌరవం గురించి బోధించాలి. సోషల్ మీడియా వాడకంలో విజ్ఞత పాటించడం, ఏదైనా సమస్య వచ్చినప్పుడు చట్టపరంగా లేదా కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించుకోవడం అలవాటు చేసుకోవాలి. రాజకీయ పార్టీలు కూడా నేర చరిత్ర, అనైతిక ప్రవర్తన ఉన్నవారికి చోటు ఇవ్వకుండా కఠినంగా వ్యవహరించాలి.

నేటి సమాజంలో వేగంగా క్షీణిస్తున్న మానవ సంబంధాలను, నైతిక విలువలను తిరిగి నిలబెట్టుకోవడానికి బహుముఖ వ్యూహం అవసరం. ముందుగా విద్యాలయాల్లో మార్పు రావాలి. కేవలం మార్కుల కోసమే కాకుండా, తోటి మనిషిని గౌరవించడం, నైతికత, మానవీయ విలువల గురించి ప్రత్యేక పాఠ్యాంశాలను బోధించాలి. చిన్నతనం నుంచే స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన ఆరోగ్యకరమైన సరిహద్దుల గురించి అవగాహన కల్పించాలి. దీనితో పాటు, వివాహ బంధంలో సమస్యలు తలెత్తినప్పుడు లేదా మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. ప్రతి నియోజకవర్గంలో లేదా పని ప్రదేశాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా అనేక నేరాలను ప్రాథమిక దశలోనే ఆపవచ్చు. సాంకేతికత వాడకంలో కూడా మనం విజ్ఞతను పాటించాలి. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. వర్చువల్ ప్రపంచంలో పరిచయమయ్యే వ్యక్తుల నిజస్వరూపాన్ని తెలుసుకోకుండా వ్యక్తిగత వివరాలను, భావోద్వేగాలను పంచుకోకూడదు. సాంకేతికతను బంధాలను కలుపుకోవడానికి వాడాలే తప్ప, విచ్ఛిన్నం చేయడానికి కాదని గుర్తించాలి. అలాగే, అరవ శ్రీధర్ వంటి ప్రజా ప్రతినిధులపై ఆరోపణలు వచ్చినప్పుడు రాజకీయ పార్టీలు వెనువెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారంలో ఉన్నవారు తప్పు చేస్తే చట్టం మరింత వేగంగా స్పందిస్తుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలి. బంధాల్లో సమస్యలు ఎదురైనప్పుడు బాధితులు మౌనంగా భరించకుండా తమ కుటుంబ సభ్యులకు లేదా స్నేహితులకు చెప్పుకునే వాతావరణం ఉండాలి.

మనిషి ఎంతటి సాంకేతిక ప్రగతిని సాధించినా, తోటి మనిషితో ఉన్న అనుబంధాలే జీవితానికి అసలైన అర్థాన్నిస్తాయి. అరవ శ్రీధర్ ఉదంతం మనకు ఒక బలమైన హెచ్చరిక. అధికారం, అహంకారం, క్షణికావేశం అనేవి జీవితాలను ఎలా బుగ్గిపాలు చేస్తాయో ఈ ఘటనలు మనకు కళ్లకు కడుతున్నాయి. స్త్రీ పురుష సంబంధాలు కేవలం శరీరానికి లేదా అవసరానికి పరిమితం కాకూడదు; అవి గౌరవం, బాధ్యత, నమ్మకం అనే పునాదులపై ఉండాలి. ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడాలంటే మనం మళ్ళీ మనిషిని మనిషిగా ప్రేమించే సంస్కృతిని అలవరుచుకోవాలి.

వివాహ వ్యవస్థలోని పవిత్రతను కాపాడుకుంటూనే, అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా నిలబడే చైతన్యాన్ని యువతలో పెంపొందించుకోవాలి. నేడు మనం తీసుకునే నైతిక నిర్ణయాలే రేపటి తరం భవిష్యత్తును, సమాజ శ్రేయస్సును నిర్ణయిస్తాయి. మానవత్వం పరిమళించే సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తించినప్పుడే ఇలాంటి వికృత ఘటనలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుంది. మనిషి తనలోని విచక్షణను మేల్కొలిపి, బంధాలకు విలువనిచ్చినప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుంది.

# ఈక్విటీ వర్సెస్ ఈక్వాలిటీ యూజీసీ వివాదం!




- ఈక్విటీ రెగ్యులేషన్స్-2026 దేశవ్యాప్తంగా నిరసనలు
- ఉన్నత విద్యా సంస్థలలో వివక్షను అరికట్టేందుకు సవరణలు
- కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించడంలో సర్వత్రా చర్చ
- పాత నిబంధనలు సరిపోవని, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని గతంలో ఆదేశించిన సుప్రీం
- జనరల్ కేటగిరీ విద్యార్థులకు వ్యతిరేకంగా జరిగే వివక్షను ఇందులో చేర్చకపోవడం అన్యాయం
- కొత్త మార్గదర్శకలతో మరింత వివక్ష రేగే అవకాశాలున్నాయంటున్న నిపుణులు

తేజస్విని
హైదరాబాద్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల ప్రకటించిన ఈక్విటీ రెగ్యులేషన్స్-2026 దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు, వివాదానికి దారితీసింది. ఉన్నత విద్యా సంస్థలలో వివక్షను అరికట్టేందుకు తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో ఈ అంశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

**నేపథ్యం:** ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్ష కారణంగా రోహిత్ వేముల, డాక్టర్ పాయల్ తడ్వి వంటి విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు దేశాన్ని కుదిపేశాయి. ఈ నేపథ్యంలో, క్యాంపస్‌లలో కుల వివక్షను అరికట్టేందుకు కఠినమైన నిబంధనలు రూపొందించాలని కోరుతూ వారి తల్లులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం, 2012 నాటి పాత నిబంధనలు సరిపోవని, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని యూజీసీని ఆదేశించింది. దీని ఫలితంగానే జనవరి 13, 2026న యూజీసీ ఈ కొత్త ఈక్విటీ నిబంధనలను నోటిఫై చేసింది.

**వివాదానికి ప్రధాన కారణాలు** యూజీసీ తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధనలపై ప్రధానంగా అగ్రవర్ణ విద్యార్థులు, కొన్ని విద్యా సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.ద

**వివాదానికి ప్రధాన కారణాలు ఇవి:**

**నిర్వచనంపై అభ్యంతరం:** నిబంధనలలోని సెక్షన్ 3(1)(సి) ప్రకారం, కుల వివక్ష అంటే కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగే చర్యలుగానే పేర్కొన్నారు. జనరల్ కేటగిరీ విద్యార్థులకు వ్యతిరేకంగా జరిగే వివక్షను ఇందులో చేర్చకపోవడం రాజ్యాంగంలోని సమానత్వ హక్కుకు విరుద్ధమని పిటిషనర్లు వాదిస్తున్నారు.

**ఓబీసీల చేరిక:** గతంలో ఈ నిబంధనలు కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే వర్తించేవి. అయితే ఇప్పుడు ఓబీసీలను కూడా చేర్చడం వల్ల జనరల్ కేటగిరీ విద్యార్థులపై తప్పుడు కేసులు పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

**దుర్వినియోగం అయ్యే అవకాశం:** ఈ నిబంధనల ప్రకారం ఫిర్యాదు అందిన 24 గంటల్లోపు కమిటీ సమావేశం కావాలి, 15 రోజుల్లో విచారణ ముగించాలి. తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపై స్పష్టత లేకపోవడం వల్ల ఇవి దుర్వినియోగం అవుతాయని వాదనలు వినిపిస్తున్నాయి.

**ప్రత్యేక వసతి గృహాల ప్రతిపాదన:** హాస్టళ్లలో, తరగతి గదుల్లో కుల ప్రాతిపదికన కేటాయింపులు ఉండకూడదని చెబుతూనే, కొన్ని నిబంధనలు పరోక్షంగా విభజనకు దారితీసేలా ఉన్నాయని విమర్శలు వచ్చాయి.

**సుప్రీంకోర్టు స్టే, వ్యాఖ్యలు**

ఈ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం జనవరి 29, 2026న ఈ నిబంధనల అమలుపై స్టే విధించింది.

**కోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు ఇవే:** అస్పష్టమైన భాష: యూజీసీ రూపొందించిన నిబంధనలు చాలా అస్పష్టంగా ఉన్నాయని, ఇవి సమాజంలో చీలిక తెచ్చే ప్రమాదం ఉందని కోర్టు అభిప్రాయపడింది.

**వెనక్కి వెళ్తున్నామా?:** స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా మనం కులరహిత సమాజం వైపు వెళ్లాల్సింది పోయి, ఇలాంటి నిబంధనలతో మళ్లీ వెనక్కి వెళుతున్నామా? అని సీజేఐ ప్రశ్నించారు.

**దుర్వినియోగం:** నిబంధనలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని, కేవలం కొన్ని వర్గాలకే రక్షణ కల్పించడం సరికాదని కోర్టు పేర్కొంది.

**పాత నిబంధనల పునరుద్ధరణ:** తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2026 నిబంధనలు నిలిపివేయబడతాయని, అప్పటి వరకు 2012 నాటి పాత మార్గదర్శకాలే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది.

**2012 నాటి యూజీసీ మార్గదర్శకాలు (పాత నిబంధనలు)**

**2012 నిబంధనలు ప్రధానంగా రక్షణ కవచంలా పనిచేస్తాయి. వీటి గురించి మరిన్ని వివరాలు:**

**పర్యవేక్షణ యంత్రాంగం:** ప్రతి కళాశాల తప్పనిసరిగా యాంటీ-డిస్క్రిమినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇందులో కనీసం ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందిన సభ్యులు ఉండాలి.

**ఫిర్యాదుల రిజిస్టర్:** వివక్షకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి ఒక ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలి. బాధితులు తమ గుర్తింపును వెల్లడించకుండానే ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలి.

**ప్రచార కార్యక్రమాలు:** వివక్ష వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించేలా సెమినార్లు నిర్వహించడం సంస్థల బాధ్యత.

నిధుల కోత: ఈ నిబంధనలను పాటించని యూనివర్సిటీలకు కేంద్ర ప్రభుత్వం నుండి అందే గ్రాంట్లు లేదా ఆర్థిక సాయాన్ని యూజీసీ పూర్తిగా నిలిపివేయవచ్చు.

**తాజా చట్టపరమైన సమస్యలు**

**కోర్టు విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన లోతైన రాజ్యాంగపరమైన అంశాలు ఇవి:**

**రివర్స్ డిస్క్రిమినేషన్ (వ్యతిరేక వివక్ష):** ఒక వర్గాన్ని రక్షించే క్రమంలో మరో వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదిస్తున్నారు. అందరికీ సమాన న్యాయం అందించే యూనివర్సల్ ఈక్విటీని పాటించాలని కోరుతున్నారు.

**ప్రాథమిక హక్కుల ఉల్లంఘన:** ఆర్టికల్ 15 ప్రకారం మతం, జాతి, కులం, లింగం లేదా పుట్టిన స్థలం ఆధారంగా ఎవరినీ వివక్షకు గురిచేయకూడదు. కొత్త నిబంధనలు కేవలం కొన్ని కులాలకే పరిమితం కావడం వల్ల మిగిలిన వారి ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని వాదన.

**శిక్షాస్మృతితో వైరుధ్యం:** యూజీసీ నిబంధనలు కొన్ని సందర్భాల్లో భారతీయ న్యాయ సంహిత (గతంలో ఐపీసీ) నిబంధనలను అతిక్రమిస్తున్నాయని, సివిల్ చట్టం పరిధిని దాటి క్రిమినల్ శిక్షల వైపు వెళ్తున్నాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

**విద్యా స్వేచ్ఛ:** కఠినమైన నిబంధనల వల్ల అధ్యాపకులు విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి భయపడుతున్నారని, ఇది విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కీలక అంశాలు :**

రాబోయే విచారణల్లో ఈ క్రింది అంశాలు కీలకం కానున్నాయి:

సవరించిన నోటిఫికేషన్: సుప్రీంకోర్టు సూచనల మేరకు కుల వివక్ష అనే పదానికి యూజీసీ మరింత స్పష్టమైన, అందరికీ వర్తించే నిర్వచనాన్ని ఇచ్చే అవకాశం ఉంది.

**సాంకేతిక పరిష్కారాలు:** ఫిర్యాదుల నమోదు కోసం ఒక జాతీయ స్థాయి పోర్టల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

కౌన్సిలింగ్ కేంద్రాలు: కేవలం శిక్షల మీదనే కాకుండా, విద్యార్థుల మధ్య సామరస్యాన్ని పెంచేందుకు క్యాంపస్‌లలో ప్రొఫెషనల్ కౌన్సిలింగ్ కేంద్రాలను తప్పనిసరి చేయవచ్చు.

కోర్టు తుది తీర్పు: మార్చి 19న జరిగే విచారణలో, రాజ్యాంగ ధర్మాసనం ఈ నిబంధనల మనుగడపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

2012 నాటి పాత నిబంధనల అమలులో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ముఖ్యంగా నిర్దిష్టమైన ఆధారాలు లేకుండానే కేవలం మౌఖిక ఆరోపణల ఆధారంగా ప్రొఫెసర్లపై, సిబ్బందిపై కేసులు నమోదైన సందర్భాలు ఉన్నాయి. దీనిపై గతంలో పలు హైకోర్టులు స్పందిస్తూ, తగిన సాక్ష్యాధారాలు లేకుండా కేవలం ఆరోపణల మీదనే కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నాయి. అలాగే ప్రతి ఫిర్యాదును ముందుగా అంతర్గత కమిటీ నిష్పక్షపాతంగా విచారించాలని, ఆ ప్రక్రియలో పారదర్శకత లేకపోతే అటువంటి విచారణలు చెల్లవని కోర్టులు స్పష్టం చేశాయి.

తాజా చట్టపరమైన వివాదాల్లో దుర్వినియోగం గురించి పిటిషనర్లు గట్టిగా వాదిస్తున్నారు. విద్యాపరమైన ఒత్తిడిని తట్టుకోలేక లేదా వ్యక్తిగత కక్షలతో విద్యార్థులు ఈ నిబంధనలను ఒక అస్త్రంగా మార్చుకుని ఉపాధ్యాయులపై తప్పుడు కేసులు పెట్టే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం విచారణ చాలా వేగంగా జరగాల్సి ఉండటంతో, నిందితుడికి తన వాదనను వినిపించుకునే తగిన సమయం దక్కకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు పేర్కొంటున్నారు. సాధారణంగా నేరం చేసినట్లు ప్రాసిక్యూషన్ నిరూపించాలి, కానీ ఈ నిబంధనలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే తాము నిర్దోషులమని నిరూపించుకోవాల్సిన వింత పరిస్థితిని కల్పిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ నిబంధనలను సమర్థిస్తున్న విద్యార్థి సంఘాల ప్రకారం, ఉన్నత విద్యా సంస్థల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న వివక్షకు ఇవి ఒక ముగింపు పలుకుతాయని వారు భావిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు క్యాంపస్‌లలో ఎదుర్కొంటున్న మానసిక వేధింపులు, వివక్షాపూరిత వ్యాఖ్యలు, మార్కుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి కఠినమైన చట్టం అవసరమని వారు వాదిస్తున్నారు. ముఖ్యంగా రోహిత్ వేముల వంటి ఘటనలు పునరావృతం కాకూడదంటే, కేవలం పాత మార్గదర్శకాలు సరిపోవని, బాధ్యులను శిక్షించే అధికారం ఉన్న కొత్త నిబంధనలే సరైనవని వీరి అభిప్రాయం. సామాజిక న్యాయం జరగాలంటే కొన్ని వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించడంలో తప్పులేదని వీరు బలంగా నమ్ముతున్నారు.

మరోవైపు, ఈ నిబంధనలను వ్యతిరేకిస్తున్న వర్గాలు వీటిని విభజన రాజకీయాలుగా అభివర్ణిస్తున్నాయి. విద్యార్థుల మధ్య కుల ప్రాతిపదికన విభజన పెంచడం వల్ల క్యాంపస్‌లలో సామరస్యం దెబ్బతింటుందని వీరు హెచ్చరిస్తున్నారు. కేవలం కొన్ని వర్గాలకే ఫిర్యాదు చేసే హక్కు కల్పించడం వల్ల ఇతర వర్గాల విద్యార్థులు వివక్షకు గురైతే ఎవరికి చెప్పుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతిభ ఆధారంగా విద్య సాగాల్సిన చోట ఇలాంటి నిబంధనలు భయాందోళనలను సృష్టిస్తాయని, ముఖ్యంగా ఓబీసీలను కూడా ఈ పరిధిలోకి చేర్చడం వల్ల జనరల్ కేటగిరీ విద్యార్థులపై తప్పుడు ఫిర్యాదుల ముప్పు పెరుగుతుందని వీరి ప్రధాన ఆందోళన.

విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయం ప్రకారం, సమస్య చట్టం రూపకల్పనలో కాకుండా దాని అమలులో ఉందనేది స్పష్టమవుతోంది. విద్యా సంస్థలు రాజకీయ వేదికలుగా మారకుండా, విద్యార్థులందరికీ సమాన హక్కులు కల్పించేలా ఒక సమగ్రమైన విధానం రావాలని వారు సూచిస్తున్నారు. కేవలం శిక్షల మీదనే దృష్టి పెట్టకుండా, కుల రహిత సమాజం పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా పాఠ్యాంశాల్లో మార్పులు రావాలని, అధ్యాపకులకు సున్నితత్వ శిక్షణ (సెన్సిటివిటీ ట్రైనింగ్) ఇవ్వాలని వారు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కేవలం ఈ నిబంధనలకే పరిమితం కాకుండా, భారత విద్యా వ్యవస్థలో సమానత్వానికి ఒక కొత్త నిర్వచనాన్ని ఇస్తుందని అందరూ ఆశిస్తున్నారు.

రాబోయే రోజుల్లో ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, యూజీసీ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోకుండా, అందులో ప్రాథమికంగా వాస్తవం ఉందో లేదో తనిఖీ చేసే ఒక ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం ఒక పరిష్కారంగా కనిపిస్తోంది. అలాగే ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై జరిమానా లేదా క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా నిబంధనలను సవరించవచ్చు. క్యాంపస్‌లలో పారదర్శకత కోసం విచారణలను రికార్డ్ చేయడం, చిన్న చిన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకునేలా సయోధ్య కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా ఒక సమతుల్యమైన వ్యవస్థను తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో సమర్పించబోయే అఫిడవిట్‌లో ప్రధానంగా నిబంధనల ఉద్దేశాన్ని సమర్థించే అవకాశం ఉంది. ఉన్నత విద్యా సంస్థల్లో అట్టడుగు వర్గాలకు భద్రతా భావాన్ని కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా క్యాంపస్‌లలో సమానత్వాన్ని తీసుకురావడమే ఈ నిబంధనల వెనుక ఉన్న అసలు లక్ష్యమని కేంద్రం వివరించనుంది. అయితే, సుప్రీంకోర్టు లేవనెత్తిన అభ్యంతరాల దృష్ట్యా, నిబంధనల్లోని భాషను సరళతరం చేస్తామని, ఎవరికీ అన్యాయం జరగకుండా తగిన సవరణలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చే అవకాశం ఉంది. నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ నిబంధనల్లో కొన్ని సాంకేతిక మార్పులు చోటుచేసుకోవచ్చు. ముఖ్యంగా వివక్ష అనే పదానికి మరింత స్పష్టమైన నిర్వచనాన్ని ఇస్తూ, అది కేవలం కొన్ని వర్గాలకే కాకుండా సాధ్యమైనంత వరకు అందరికీ వర్తించేలా మార్పులు చేసే అవకాశం ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ మొదలుపెట్టే ముందు, అందులో వాస్తవం ఉందో లేదో ప్రాథమికంగా పరిశీలించే ఒక స్వతంత్ర విచారణ వ్యవస్థను ప్రతిపాదించవచ్చు. దీనివల్ల తప్పుడు కేసులు నమోదు కాకుండా అడ్డుకోవచ్చని, తద్వారా అధ్యాపకులు మరియు విద్యార్థుల మధ్య నమ్మకం దెబ్బతినకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఈ వివాదం ముగింపు కేవలం చట్టం మీదనే కాకుండా, విద్యా సంస్థల నిర్వహణ తీరుపై కూడా ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో ప్రతి యూనివర్సిటీలో ఈక్విటీ పోర్టల్‌ను ఏర్పాటు చేసి, ప్రతి ఫిర్యాదును యూజీసీ నేరుగా పర్యవేక్షించేలా డిజిటల్ వ్యవస్థను తీసుకురావాలని యోచిస్తున్నారు. చట్టం అనేది ఎవరినీ భయపెట్టడానికి కాకుండా, అందరినీ గౌరవంగా బతికేలా చేసేదిగా ఉండాలన్నదే ఈ మొత్తం ప్రక్రియ యొక్క సారాంశం. మార్చి 19న సుప్రీంకోర్టు ఇచ్చే మార్గదర్శకాలు భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయి.

# శాస్త్రీయ దృష్టికోణం - విద్యారంగం పాత్ర...

అశోక్ గుంటుక
9908144099

ప్రపంచం ఆధునికంగా కనిపిస్తుందంటే, మరింత ముందుకు దూసుకు పోతుందంటే, దీనికి ప్రధాన కారణం విజ్ఞాన ఆవిష్కరణలు తప్ప మరేదీ కాదు. ఇది మాత్రమే కాకుండా, సమాజ అభివృద్ధికి అత్యవసరమైన మరో ముఖ్య అంశం శాస్త్రీయ దృష్టికోణం (సైంటిఫిక్ టెంపర్మెంట్). ఇది కేవలం విజ్ఞాన శాస్త్రాలను చదవడం మాత్రమే కాదు, చదివిన సమాచారాన్ని ఆలోచించడం, ప్రశ్నించడం, విశ్లేషించడం, ఆధారాలు (సాక్ష్యాలు) కోరడం, తార్కికంగా (లాజికల్‌గా) నిర్ణయాలు తీసుకోవడం వంటి సమగ్ర ప్రక్రియలను కలిగి ఉంటుంది.

భారత రాజ్యాంగంలోని 51ఏ (హెచ్) ప్రకారం, ప్రతి పౌరుడు శాస్త్రీయ దృష్టిని అలవాటు చేసుకోవడం ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొనబడింది. ఈ దృష్టికోణం సమాజాన్ని అజ్ఞానం, మూఢనమ్మకాల నుండి విముక్తి చేసి, సమస్యల పరిష్కారాల వైపు మరియు కొత్త ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) వైపు ముందుకు నడిపిస్తుంది. విద్యారంగం ఇక్కడ చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే విద్యార్థులు లేదా యువతను ఈ దృక్పథానికి అలవాటు చేయడం ద్వారా మాత్రమే దేశం ఆధునిక సవాళ్లను ఎదుర్కోగలదు. ఉదాహరణకు, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), డిజిటల్ మిస్‌ఇన్ఫర్మేషన్ (తప్పుడు సమాచారం) వంటి సమస్యలు తార్కిక ఆలోచన లేకుండా పరిష్కరించలేము. 2026 లో, భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, ఈ దృక్పథం లేకపోతే, సాంకేతిక పురోగతిని (టెక్నాలజికల్ అడ్వాన్స్ మెంట్) కూడా సమర్థవంతంగా ఉపయోగించలేము.

**శాస్త్రీయ దృష్టికోణం (సైంటిఫిక్ టెంపర్మెంట్) అంటే ఏమిటి? :** శాస్త్రీయ దృష్టికోణం అనేది మూఢ విశ్వాసాలకు బదులుగా తార్కికతను (లాజిక్) ఆధారంగా చేసుకుని ఆలోచించడం. వదంతులు, అబద్ధ ప్రచారాలను (రూమర్స్, ఫేక్ న్యూస్) నమ్మేముందు సాక్ష్యాలను ఆధారాలను (ఎవిడెన్స్) తనిఖీ చేయడం. సమస్యలను విచారణాత్మకంగా (ఇన్వెస్టిగేటివ్‌గా) పరిశీలించి పరిష్కారాలు అన్వేషించడం. కొత్త ఆలోచనలను ఆహ్వానించే మరియు పరిశీలించే వ్యక్తిత్వం (పర్సనాలిటీ) కలిగి ఉండడం, బేధాభిప్రాయాలపై (డిఫరెంట్ ఒపీనియన్స్) సామరస్యంగా చర్చించే ధోరణి (అటిట్యూడ్) వంటివి

**దీని ముఖ్య లక్షణాలు. :** క్లుప్తంగా చెప్పాలంటే, సత్యం, ఆధారాలతో (ఎవిడెన్స్‌తో) నిరూపించగలిగిందే అని అర్థం చేసుకొని, సైంటిఫిక్ మెథడ్ లో ఆలోచించడమే శాస్త్రీయ దృష్టికోణం. అందరూ ఈ మనస్తత్వం, జీవన విధానం (లైఫ్‌స్టైల్) అలవరచుకుని, ప్రపంచాన్ని ప్రశ్నించడం, తప్పుల నుండి నేర్చుకోవడం (లెర్నింగ్ ఫ్రం మిస్టేక్స్) అనే స్వభావాన్ని కలిగి ఉండడం. ఎందుకంటే ఇది సమాజాన్ని మూఢత్వం (సూపర్‌స్టిషన్స్) నుండి దూరంగా ఉంచుతూ, ఆలోచనాత్మక (క్రిటికల్ థింకింగ్) వైఖరితో ఉంచుతుంది. ఉదాహరణకు, ఒక సాధారణవ్యక్తి ఒక వార్తను చదివినప్పుడు, దాని మూలాన్ని, ఆధారాలను తనిఖీ చేస్తూ, వివిధ మూలాల నుండి ధృవీకరించడం ద్వారా మాత్రమే సత్యాన్ని గుర్తించగలడు.

**శాస్త్రీయ దృష్టికోణం ఇపుడు ఎందుకు అత్యవసరం? :** ఆధునికసమాజం శాస్త్రీయ దృష్టికోణం లేకుండా నిలబడలేదు. సామాజిక మాధ్యమాలు, సందేశాల ఫార్వర్డింగ్ సంస్కృతి వల్ల తప్పుడు సమాచారం ఇపుడు క్షణాల్లోనే అంతటా వ్యాపిస్తోంది. డీప్‌ఫేక్ , ఏఐ ఫాబ్రికేషన్స్, తప్పుడు వైద్య సలహాలు వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగు తున్నాయి. 2025 చివరి నాటికి భారత దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య సుమారు 103 కోట్లు (సుమారు 70 శాతం జనాభా), సామాజిక మాధ్యమాల వినియోగదారులు సుమారు 50 కోట్లు (34 శాతం జనాభా). ఇది తప్పుడు సమాచార వ్యాప్తికి కూడా అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో, వ్యూస్ కోసం కొందరు తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేస్తున్నారు. చూసే వారికి ఇది ఒక వ్యసనంలా మారి, చూసిన ప్రతీదీ నిజమేనన్న భ్రమలో పడుతున్నారు. ఈ మిస్‌ఇన్ఫర్మేషన్ ఆరోగ్యాన్ని, కుటుంబ జీవితాలను, సామాజిక స్థిరత్వాన్ని మరియు ఎన్నికలను కూడా ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో సమాచార నిజానిజాలను గుర్తించడానికి శాస్త్రీయ దృష్టికోణం తప్పనిసరి. ఎందుకంటే ఇది వాస్తవాలను ఆధారాలతో పరిశీలించే అలవాటును పెంచుతుంది.

**పర్యావరణ సంక్షోభం (ఎన్విరాన్‌మెంటల్ క్రైసిస్),** వాతావరణ మార్పులు, ప్రజా ఆరోగ్యం, డిజిటల్ సెక్యూరిటీ వంటివి శాస్త్రీయ అవగాహనతోనే పరిష్కరించగలవు. ఉదాహరణకు, ఇంటర్ గవర్న్‌మెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ రిపోర్టులు డేటా ఆధారంగా వాతావరణ మార్పును వివరిస్తాయి. ఇక్కడ తార్కిక దృష్టి లేకపోతే, మూఢనమ్మకాలు సమస్యను మరింత తీవ్రతరం చేసి ప్రజల్లో ఆందోళన కలిగిస్తాయి. టీకాలు (వ్యాక్సినేషన్), ఔషధాల విషయంలో అపోహలు (మిథ్స్) నేటికీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి. కోవిడ్-19 మహమ్మారి తర్వాత, ఫేక్ మెడికల్ అడ్వైస్ వల్ల ప్రాణాలు కోల్పోయిన సంఖ్య లక్షల్లో ఉంది. ఆధునిక మెడిసిన్ పట్ల అపనమ్మకాలు లేదా మాయలు మంత్రాలపై అతిగా నమ్మకం వల్ల ప్రాణహాని సంభవిస్తుంది. శాస్త్రీయ దృష్టి మాత్రమే ఆరోగ్య విధానాలను బలోపేతం చేస్తుంది. భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఉంది. 2025 చివరి నాటికి 2 లక్షలకు పైగా డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉన్నాయి. ఇవి 21 లక్షలకు పైగా ఉద్యోగాలు సృష్టించాయి. ఇందులో ఆలోచన, పరిశోధన, ప్రయోగం అనే శాస్త్రీయ ధోరణి కీలకం. ఇది కృత్రిమ మేధస్సు (ఏఐ), పర్యావరణ అనుకూల సాంకేతికత (గ్రీన్ టెక్ ) వంటి రంగాల్లో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది.

**విద్యారంగం పాత్ర :** శాస్త్రీయ దృష్టికోణాన్ని అందరిలో పెంచడంలో విద్యారంగం పాత్ర అత్యంత ముఖ్యం. జాతీయ విద్యా విధానం 2020 (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020)లో, ఎంక్వైరీ బేస్డ్ లెర్నింగ్ (పరిశోధన ఆధారిత నేర్చుకోవడం), క్రిటికల్ థింకింగ్ (విమర్శనాత్మక ఆలోచన), విజ్ఞాన పరిశోధన (సైంటిఫిక్ ఇన్క్వైరీ) మొదలగిన పద్ధతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

2026 నాటికి 5+3+3+4 పాఠ్యాంశ నిర్మాణం దేశవ్యాప్తంగా దశలవారీగా అమలవుతోంది. ఇది విద్యార్థులను పాఠం నేర్చుకోవడం, ఆలోచించడం, ప్రశ్నించడం, ప్రయోగించడం వైపు నడిపిస్తుంది. భౌతికశాస్త్ర పాఠాల్లో నిజసమయ ప్రయోగాలు (రియల్-టైమ్ ఎక్స్‌పెరిమెంట్లు), వర్చువల్ ల్యాబ్‌లు జోడించడం ద్వారా తార్కికత పెరుగుతుంది. ఉపాధ్యాయులు కేవలం పుస్తకం చదివించడమే కాకుండా, ప్రయోగాలు చేయించడం, విద్యార్థులచే ప్రశ్నలు వేయించడం, సమస్యలకు విజ్ఞాన పరమైన సమాధానాలు (సైంటిఫిక్ సొల్యూషన్స్) కనుగొనేందుకు అవకాశాలు కల్పించడం ద్వారా మార్గదర్శక పాత్ర పోషించాలి. విద్యార్థుల్లో స్వాభావిక కుతూహలాన్ని (క్యూరియాసిటీ) రేకెత్తించేందుకు ఉపాధ్యాయులు ఫెసిలిటేటర్స్ గా మారాలి. సైన్స్ ల్యాబ్‌లు, రోబోటిక్స్ క్లబ్‌లు, మేకర్ స్పేస్‌లు, సైన్స్ ఫెయిర్స్ వంటివి విద్యార్థుల్లో పరిశోధనా శక్తిని (రీసెర్చ్ స్కిల్స్) పెంచుతాయి. 2025 జులై నాటికి, దేశవ్యాప్తంగా దాదాపు 26-27 సైన్స్ సెంటర్లు, సైన్స్ సిటీలు స్థాపించబడ్డాయి. ఇవి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులకు ఇంటరాక్టివ్ లెర్నింగ్ అనుభవాలు అందిస్తున్నాయి. విద్యాసంస్థలు నేడు విద్యార్థులకు కేవలం విజ్ఞానాన్ని



బోధించడమే కాదు, తప్పుడు వార్తలను (ఫేక్ న్యూస్) గుర్తించడం, వాస్తవాలను పరిశీలించడం, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం (రెస్పాన్సిబుల్ సోషల్ మీడియా యూస్) వంటి అంశాలను కూడా బోధించాలి. వాతావరణ మార్పులు, నీటి సంరక్షణ (వాటర్ కన్జర్వేషన్), ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాల్లో విద్యార్థుల భాగస్వామ్యం వారిలో తార్కిక ఆలోచనను పెంచుతుంది. ఉదాహరణకు, స్కూల్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు స్థానిక పర్యావరణ సమస్యలను సర్వే చేసి, డేటా ఆధారంగా సొల్యూషన్స్ సూచించవచ్చు. పరీక్షలకు బట్టి పట్టి చదువుకునే విధానానికి బదులుగా, అర్థం చేసుకుని అన్వయించుకునే (అప్లైయింగ్) విధానం ఇపుడు అవసరం. ఎన్ఈపీ 2020 రోట్ లెర్నింగ్‌ను తగ్గించి, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, క్రిటికల్ థింకింగ్, డిస్కషన్-బేస్డ్ లెర్నింగ్ వంటివాటిపై ఎక్కువ దృష్టి సారించాలని సూచిస్తుంది. ఈ మార్పులు 2025 నాటికి ప్రధాన కరిక్యులమ్ రిఫారమ్స్‌లో భాగంగా అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నాయి. ఈ పద్ధతి విద్యార్థుల్లో సృజనాత్మకతను (క్రియేటివిటీ) పెంచుతుంది. విద్యార్థి దశ నుంచే ప్రయోగాత్మక శిక్షణ (ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్), ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ అవసరం. ఉదాహరణకు, ప్రైమరీ స్కూళ్లలో సింపుల్ సైన్స్ కిట్స్ ఉపయోగించడం ద్వారా ఆసక్తి పెరుగుతుంది. నిజానికి, నిజ జీవితానికి (రియల్ లైఫ్) దగ్గరగా ఉండే విద్యా పద్ధతి (ప్రాక్టికల్ ఎడ్యుకేషన్) మాత్రమే శాస్త్రీయ దృష్టికోణాన్ని బలోపేతం చేస్తుంది. సైన్స్ పుస్తకాలు కథలు (సైన్స్ స్టోరీ బుక్స్), శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు (బయోగ్రఫీస్ ఆఫ్ సైంటిస్ట్స్, ఉదా., ఏ.పి.జె. అబ్దుల్ కలాం), పరిశోధన ఆధారిత రచను రీసెర్చ్ బేస్డ్ రైటింగ్) విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుతాయి. విద్యాసంస్థలు తల్లిదండ్రులకు కూడా శాస్త్రీయ దృష్టి అవసరాన్ని తెలియజేయాలి. పిల్లల ఎందుకు? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ఒక కుటుంబ సంస్కృతిగా (ఫ్యామిలీ కల్చర్) మారాలి. వర్క్‌షాప్‌లు, పేరెంట్ ట్రైనింగ్ సెషన్ల ద్వారా ఇది సాధ్యమే.

ఇది ఎన్ఈపీ 2020లోని కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ లో భాగం. ముక్తాయింపుగా, శాస్త్రీయ దృష్టికోణం అనేది ఆధునిక సమాజం అభివృద్ధికి ప్రాణాధారం. మారుతున్న ప్రపంచం సవాళ్లను ఎదుర్కోవడానికి పౌరులందరికీ తార్కిక ఆలోచన, విచారణా దృష్టి (ఇన్వెస్టిగేటివ్ వ్యూ), పరిశోధనా శక్తి (రీసెర్చ్ అబిలిటీ) అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో విద్యారంగం పాత్ర అత్యంత కీలకం. జ్ఞానం ప్రశ్నతోనే ప్రారంభమౌతుంది. ఆ ప్రశ్నలకు శాస్త్రీయ దృష్టికోణమే సరైన దారి చూపుతుంది. విద్యారంగం ఈ దిశగా ముందుకు సాగితే, భారతదేశం శాస్త్రీయ ఆలోచనలతో (సైంటిఫిక్ థింకింగ్) మరింత ఆధునికంగా, స్థిరంగా మారుతుంది.

# బిజినెస్

## టెక్నోస్పోర్ట్ బ్లూ ఒరిజిన్ కార్యక్రమం

### చిన్న పట్టణ రిటైల్ వ్యాపారాల అభివృద్ధి




టెక్నోస్పోర్ట్ కంపెనీ, బ్లూ ఒరిజిన్ కార్యక్రమం ద్వారా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని చిన్న పట్టణ రిటైల్ వ్యాపారాలను మెరుగుపరుస్తోంది. ఈ కార్యక్రమం, స్థానిక వ్యాపారులకు ఉత్పత్తుల రకం, నిల్వ, మరియు మార్కెటింగ్ అంశాల్లో సహాయపడుతుంది. రిటైలర్లు తమ వ్యాపారాన్ని సుస్థిరంగా పెంచుకోవడానికి, ఆర్థిక సహాయం కాకుండా, సప్లై, స్టోర్ ప్రెజెంటేషన్, మరియు వినియోగదారు నమ్మకాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుంది. మహలక్ష్మి స్పోర్ట్స్ మరియు న్యూ సచిన్ స్పోర్ట్స్ వంటి కుటుంబ వ్యాపారాల నుంచి వచ్చిన అనుభవాలు, ఉత్పత్తి అందుబాటులో, నమ్మకమైన సరఫరా, మరియు తిరిగి వస్తున్న కస్టమర్ల ద్వారా వ్యాపారాల పురోగతిని సూచిస్తున్నాయి.

## తెలంగాణలో ఎంఎస్ఎంఇలు కోసం గ్రీనింగ్ కార్యక్రమం



తెలంగాణలో ఎంఎస్ఎంఇలు (స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) గ్రీనింగ్ ఆధ్వర్యంలో, 30 జనవరి 2026న హైదరాబాద్‌లో నిర్వహించిన వర్క్షాప్‌లో, వనరుల సమర్థత మరియు శుభ్రమైన ఉత్పత్తి విధానాలపై అవగాహన పెంచడం లక్ష్యంగా పని చేయబడింది. ఈ వర్క్షాప్‌లో 55 ఎంఎస్ఎంఇ ప్రతినిధులు పాల్గొని, ఉత్పత్తి సామర్థ్యం పెరిగే విధానాలు, శక్తి సామర్థ్యం, మరియు వాతావరణ మార్పులపై అనుకూల పరిష్కారాలపై అవగాహన పొందారు. అలాగే, సిడ్బి నుండి ఆర్థిక మద్దతు, రుణ సాయాలు, మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు అందించబడ్డాయి. ఎంఎస్ఎంఇలుకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలు మరియు చెల్లింపుల సమస్యలపై సమర్థవంతమైన పరిష్కారాలు చర్చించబడ్డాయి.

## జీప్ ఇండియా పట్ల కమిట్‌మెంట్‌ను స్ట్రెంగ్తెన్ చేస్తోంది



భారతదేశంలో జీప్ తన జీప్ 2.0 వ్యూహంతో వృద్ధి, నూతనత, మరియు లోకలైజేషన్ పై దృష్టి సారించింది. ఈ వ్యూహంలో 90% లోకలైజేషన్ లక్ష్యంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం, దేశీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో దాని ఉనికిని బలపరచడం ఉన్నాయి. జీప్ భారతదేశం నుండి జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు ఎగుమతులను పెంచుకోవాలని ఉద్దేశించింది. జీప్ ఉత్పత్తులు, సేవలు, మరియు కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడానికి కొత్త కార్యక్రమాలు, జీప్ అషర్డ్ బైబ్యాక్ ప్రోగ్రామ్ మరియు ప్రీ-మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ మొదలైనవి తీసుకొచ్చింది. మరింతగా, జీప్ తన పట్ల విశ్వాసం కలిగిన వృద్ధి చెందుతున్న యజమానుల సమూహాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఐఎస్‌బి యువ నేతల ఇంటర్న్ విజయాలు

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పీజీపీ వైఎల్ తొలి బ్యాచ్ విద్యార్థులం వందశాతం వేసవి ఇంటర్న్‌షిప్ నియామకాలను సాధించి విశేష విజయాన్ని నమోదు చేశారు. కన్సల్టింగ్, ఫైనాన్స్, వినియోగ వస్తువులు, సాంకేతికత, తయారీ తదితర రంగాల నుంచి ముప్పై ఎనిమిది సంస్థలు కలిసి నూరెబ్బై ఐదుకి పైగా ఆఫర్‌లు అందించగా, సగటు స్టైపెండ్ మూడు పాయింట్ రెండు లక్షలు, అత్యధికంగా ఏడు పాయింట్ మూడు లక్షలు లభించాయి. విస్తృత రంగాల భాగస్వామ్యం, విధుల నాణ్యత, అలాగే ఆచరణాత్మక బోధనా విధానం ఈ కార్యక్రమ బలాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. యువ నాయకులను వాస్తవ వ్యాపార సవాళ్లకు సిద్ధం చేసేలా రూపొందించిన ఈ ఇరవై నెలల కార్యక్రమం, భవిష్యత్‌లో ప్రభావవంతమైన నాయకత్వానికి పునాది వేస్తోంది.

## భారత వుడ్ ఫర్నిచర్ పరిశ్రమకు గ్లోబల్ వేదిక

బెంగళూరులో జరగనున్న ఈ అంతర్జాతీయ ప్రదర్శన భారత వుడ్ వర్కింగ్ మరియు ఫర్నిచర్ తయారీ రంగానికి ప్రపంచ స్థాయి ప్రాధాన్యతను మరింత పెంచుతోంది. అనేక దేశాల నుంచి భారీ సంఖ్యలో సంస్థలు, నిపుణులు పాల్గొనడం ద్వారా భారత తయారీ సామర్థ్యాలపై గ్లోబల్ విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఆధునిక యంత్రాలు, స్వయంచాలక తయారీ విధానాలు, సుస్థిర పదార్థాలు, బాధ్యతాయుత ఉత్పత్తి పద్ధతులు ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. యూరోప్‌తో వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో ఎగుమతులు, సాంకేతిక మార్పిడి, పరిశ్రమ సహకారం మరింత బలపడే అవకాశాలు ఉన్నాయి. నైపుణ్యాభివృద్ధి, రూపకల్పన--తయారీ సమన్వయం, దేశీయ తయారీ ప్రోత్సాహంతో ఈ వేదిక భారత ఆర్థిక వృద్ధికి కీలక పాత్ర పోషించనుంది.

## ఎస్‌బిఐ జనరల్: పరిశ్రమ కంటే వేగంగా వృద్ధి

ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ 9 నెలల ఆర్థిక సంవత్సరం 2026లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ పరిశ్రమ కంటే 1.7 రెట్లు వేగంగా వృద్ధిని సాధించింది. కంపెనీ రూ. 10,769 కోట్ల స్థూల ప్రత్యక్ష ప్రీమియం నమోదు చేసి 14.5% వృద్ధిని సాధించగా, పరిశ్రమ వృద్ధి 8.7% మాత్రమే ఉంది. ఆరోగ్యం, వ్యక్తిగత ప్రమాద బీమా, మోటార్ మరియు అగ్ని బీమా విభాగాలలో స్థిరమైన వృద్ధి, నష్ట నిష్పత్తి 84.3% నుండి 78.5%కి మెరుగుదల, మరియు ద్రావణీయత నిష్పత్తి 2.12 రెట్లు ఉన్నవి కంపెనీ పటిష్ట ఆర్థిక పునాదిని ప్రతిబింబిస్తున్నాయి. వాదీ× జనరల్ ఇన్సూరెన్స్ టెక్నాలజీ, ఉత్పత్తి ఆవిష్కరణ, కస్టమర్ అనుభవంపై దృష్టి సారిస్తూ, స్థిరమైన లాభదాయక వృద్ధి మరియు మార్కెట్ విస్తరణను కొనసాగిస్తోంది.మెరుగైన అండర్ రైటింగ్, మెరుగైన రిస్క్ ఎంపిక, మెరుగైన క్లెయిమ్‌ల నిర్వహణ మరియు పెరిగిన కార్యాచరణ సామర్థ్యానికి ఇది నిదర్శనం. స్థిరమైన లాభదాయక వృద్ధి, మూలధన సామర్థ్యాన్ని బలోపేతం చేయడం మరియు డైనమిక్ మార్కెట్ వాతావరణంలో అన్ని వాటాదారులకు దీర్ఘకాలిక విలువను అందించే ఆర్థికంగా బలమైన సంస్థను నిర్మించడంపై మా దృష్టి కొనసాగుతోంది.

# మెరుగైన ఆర్థిక సన్నద్ధతతో హైదరాబాద్‌వాసులు

హైదరాబాద్: ఆర్థిక ఒత్తిళ్లు, ఆరోగ్యపరమైన సవాళ్లు, డిజిటల్ రిస్కులు, విస్తృత సామాజికాంశాల కారణంగా భారత్‌లో అనిశ్చితి అధిక స్థాయిలో కొనసాగుతోంది. ఆర్థిక ప్రగతి సాధిస్తున్నప్పటికీ ఆర్థిక సన్నద్ధత, వ్యక్తిగత భద్రత, ఆరోగ్య సంరక్షణ వ్యయాలు, దీర్ఘకాలిక స్థిరత్వానికి సంబంధించిన ఆందోళనలు కొనసాగుతుండటాన్ని జాతీయ ఇండెక్స్ 79 స్థాయిలో ఉండటం సూచిస్తుంది.

హైదరాబాద్ ఇండెక్స్ 76గా నమోదైంది. జాతీయ సగటు కన్నా ఇది తక్కువే అయినప్పటికీ దక్షిణాది జోన్ బెంచ్‌మార్క్ అయిన 71 కన్నా అధికం కావడం గమనార్హం. డిజిటల్ భద్రత అనేది నగరంలో అనిశ్చితిని ఎగదోస్తున్న కీలక థీమ్‌గా నిలుస్తోంది. వ్యక్తిగత డేటా భద్రత, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల భద్రత, ఆన్‌లైన్ స్కాముల బారిన పడే అవకాశాల్లాంటివి ఆందోళన కలిగిస్తున్న టాప్ మూడు అంశాలుగా స్థానికులు పేర్కొన్నారు. క్రైమ్ రేట్ పెరగడం, కాలుష్య స్థాయి పెరుగుతుండటం, జీవన వ్యయాలపై ప్రభుత్వ టారిఫ్‌ల ప్రభావాలపై గల ఆందోళనలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.మౌలిక సదుపాయాలపరమైన ఆందోళనలు కూడా ప్రముఖంగా ఉన్నాయి. వేగంగా పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా నగర వ్యవస్థలు విస్తరించగలవా అనే అంశంపైనా సందేహాలు ఉన్నాయి. వీటికి తోడు వర్క్‌ప్లేస్ ఒత్తిళ్లు, మానసిక ఆరోగ్య సమస్యలు, ధరలపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావాల్లాంటివి బహుళ అంచెల అనిశ్చితికి దారి తీస్తున్నాయి.నగరాల స్థాయి డేటా చూస్తే ఆర్థిక భద్రత మరియు ఆత్మవిశ్వాసానికి మధ్య పటిష్టమైన బంధం ఉన్నట్లు తెలుస్తోంది. బీమా కవరేజీ పెరిగే కొద్దీ అనిశ్చితి క్రమంగా తగ్గుతోంది. ఒకటి లేదా రెండు పాలసీలు ఉన్న వారికి సంబంధించి అనిశ్చితి స్థాయి 77గా ఉండగా నాలుగు లేదా అంతకు మించి ఉన్నవారికి సంబంధించి ఇది 64గా ఉంది. ఇన్వెస్ట్‌మెంట్ ఓనర్‌షిప్‌లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఏదో ఒకటే పెట్టుబడి ఉన్న వారితో (ఇండెక్స్: 69) పోలిస్తే నాలుగుకి పైగా ఉన్న వారిలో (ఇండెక్స్: 67) అనిశ్చితి తక్కువగా ఉంది.సామాజిక-ఆర్థిక సెగ్మెంటేషన్ విశిష్టమైన వ్యత్యాసాలను సూచిస్తోంది.

ఎస్ఈసీ ఎ (64) తో పోలిస్తే ఎస్ఈసీ బి (82) మరియు ఎస్ఈసి సి (83) రెస్పాండెంట్లు, గణనీయంగా అధిక అనిశ్చితి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సమృద్ధి, వనరుల లభ్యత, సన్నద్ధత ప్రాధాన్యతని ఇది తెలియజేస్తోంది.డెమోగ్రాఫిక్స్‌వ్యాప్తంగా చూస్తే విస్తృతంగా అనిశ్చితి స్థాయిలు నిలకడగా కొనసాగుతున్నాయి.

పురుషులతో పోలిస్తే మహిళల్లో కొంత ఎక్కువ ఆందోళన ఉంటోంది. మిలీనియల్స్ మరియు జెన్ జెడ్‌తో పోలిస్తే పెద్దవారిలో-- ముఖ్యంగా బేబీ బూమర్స్ మరియు జెన్ ఎక్స్ తరం వారిలో అధిక అనిశ్చితి కనిపిస్తోంది. ప్రొఫెషనల్‌గా చూస్తే బిజినెస్ ఓనర్లు మరియు వేతన జీవులు దాదాపు ఒకే తరహా అనిశ్చితి ఉన్నట్లు తెలిపారు. జీవిత దశలపరంగా చూస్తే సింగిల్‌గా ఉన్నవారు లేదా పిల్లలు లేని వివాహితులతో పోలిస్తే పిల్లలున్న వివాహితుల్లో కొంత ఎక్కువ ఆందోళన ఉంటోంది.

## 30 విమానాల కొనుగోలుకు బోయింగ్‌తో ఎయిర్ ఇండియా ఎంఓయూ



టాటా గ్రూపులోని ఎయిర్ ఇండియా ఏకంగా 30 విమానాలను కొనుగోలు చేయడానికి బోయింగ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో జరుగుతోన్న వింగ్స్ ఇండియా ప్రదర్శనలో భారీగా ఒప్పందాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో తాజాగా ఎయిర్ ఇండియా ఎంఓయూ మార్చుకుంది. ఈ మేరకు 20 737-8 మరియు 10 737-10 విమానాలతో సహా మొత్తం 30 అదనపు బోయింగ్ విమానాలను కొనుగోలు చేయడానికి ఆర్డర్ ఇచ్చినట్లు ప్రకటించింది. ఈ 30 సింగిల్-ఐసిల్ విమానాలు 2023లో ఎయిర్ ఇండియా బోయింగ్‌తో చేసిన 220 విమానాల తో కలిపి బోయింగ్‌తో చేసిన మొత్తం విమాన ఆర్డర్‌ల సంఖ్య 250కి చేరుకుంది. వింగ్స్ ఇండియా 2026లో ఎయిర్ ఇండియా ఈ ప్రకటన చేసింది. తాజా ఆర్డర్లతో ఎయిర్ ఇండియాకు బోయింగ్ నుండి మొత్తం 198 కొత్త విమానాలు వస్తున్నాయి. 2023లో ఆర్డర్ చేసిన 220 విమానాలలో ఇప్పటి వరకు 52 విమానాలను ఎయిర్‌లైన్ అందుకుంది.

ఎయిర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ కాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ "30 బోయింగ్ 737 విమానాల కోసం ఈ అదనపు ఆర్డర్ ఇచ్చాం. భవిష్యత్తులో ఎయిర్ ఇండియాను భారతదేశం ప్రపంచ స్థాయి గ్లోబల్ క్యారియర్‌గా ఉంచాలన్నది మా వ్యూహంలో భాగం అని తెలిపారు. "ఎయిర్ ఇండియా మరిన్ని 737 మాక్స్ జెట్‌ల కోసం ఆర్డర్ ఇవ్వడం వలన వారి ప్రస్తుత 737-8 విమానాల బలమైన పనితీరు స్పష్టమవుతుందని ఎందుకంటే వారు భారతదేశం మరియు దక్షిణాసియా ప్రాంతం అంతటా కనెక్టివిటీని విస్తరిస్తూనే ఉన్నారని దక్షిణాసియాలోని బోయింగ్ వాణిజ్య అమ్మకాలు మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పాల్ రిఫి అన్నారు.

## ఎన్టీటీ డేటా మరియు ఏడబ్ల్యూఎస్ కలిసి ఏఐ, క్లౌడ్ విస్తరణ

ఎన్టీటీ డేటా మరియు అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) మధ్య మల్టీ-యియర్ వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రకటించబడింది, దీని ద్వారా సంస్థలు పాత సిస్టమ్‌లను ఆధునీకరించి, ఏజెంటిక్ ఏఐని బాధ్యతాయుతంగా స్వీకరించవచ్చు. ఈ భాగస్వామ్యం పరిశ్రమల వ్యాప్తంగా నూతన వ్యాపార నమూనాలు మరియు మెరుగైన కార్యకలాపాల కోసం మిషన్-క్రిటికల్ వర్క్‌లోడ్‌లను ఆధునీకరించడం, సురక్షితమైన క్లౌడ్ మౌలిక వ్యవస్థలను నిర్మించడం, మరియు కొలిచే ఫలితాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం నాలుగు ప్రధాన ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉంది: ఏఐ ఆధారిత పెద్ద-పరిమాణ క్లౌడ్ వలస, మార్పిడి, వరిశ్రమం-స్పష్టమైన క్లౌడ్ పరిష్కారాలు, ఆధునిక నిర్వహిత సేవల కోసం ఏఐ మరియు డేటా ఆవిష్కరణ, మరియు యూరోపియన్ సార్వభౌమ క్లౌడ్‌లో డిజిటల్ స్వరాజ్యం మరియు నియంత్రిత క్లౌడ్ పరిష్కారాలు. ఎన్టీటీ డేటా ఏడబ్ల్యూఎస్తో కలిసి 500 పైగా వ్యాపార భాగాలు మరియు ఏఐ ఏజెంట్లతో పరిశ్రమల ప్రత్యేక పరిష్కారాలను అందిస్తుంది.

భాగస్వామ్యం ద్వారా ఎన్టీటీ డేటా ఏడబ్ల్యూఎస్ వ్యాపార సమూహంని ఏర్పాటు చేసింది, ఇందులో 11,000 సర్టిఫైడ్ నిపుణులు ఉన్నారు మరియు వచ్చే మూడు సంవత్సరాల్లో 10,000 మందిని మరింత సర్టిఫై చేయడం లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా క్లయింట్‌లు ఏఐ ఆధారిత క్లౌడ్ పరిష్కారాలను వేగంగా, సురక్షితంగా, నమ్మకంతో స్వీకరించగలుగుతారు. హోండా ట్రేడింగ్ ఆసియా వంటి సంస్థలు ఇప్పటికే ఏడబ్ల్యూఎస్ క్లౌడ్‌కు మార్పిడి చేసి ఏఐ ఆధారిత వినూత్నతను పెంచడానికి ఎన్టీటీ డేటా సాయం పొందాయి. ఎన్టీటీ డేటా మరియు ఏడబ్ల్యూఎస్ కలసి ఆర్థిక సేవలు, ఆరోగ్యం, జీవశాస్త్రం, ఉత్పత్తి, ప్రజా రంగం, రిటైల్, ఎనర్జీ వంటి పరిశ్రమలలో ఏఐ ఆధారిత క్లౌడ్ పరిష్కారాలను అభివృద్ధి చేస్తాయి. సాండ్‌బాక్స్‌లు మరియు ప్రత్యేక వినూత్నతా ల్యాబ్‌లలో పరిష్కారాలను పరీక్షించి, తేలికగా విస్తరించవచ్చు.

ఈ భాగస్వామ్యం ద్వారా, వ్యాపారాలు ఏడబ్ల్యూఎస్ సాంకేతికతను వేగంగా, సురక్షితంగా మరియు నమ్మకంతో స్వీకరించి, వ్యాపారంలో కొలవగల విలువను సృష్టించగలవు.

## వెల్త్ కంపెనీ ప్రారంభించింది డైనమిక్ ఆస్తి కేటాయింపు ఫండ్




వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను ప్రారంభించింది, ఇది ఓపెన్-ఎండ్ డైనమిక్ ఆస్తి కేటాయింపు నిధి. ఈ ఫండ్ ఈక్విటీ మరియు రుణ పెట్టుబడుల సమతుల్య మిశ్రమం ద్వారా దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకుంది. మార్కెట్ పరిస్థితులు, విలువలు మరియు రిస్క్ సూచికల ఆధారంగా ఈక్విటీ మరియు రుణ మధ్య డైనమిక్ ఎక్స్‌పోజర్ నిర్వహించడం ఫండ్ ప్రధాన లక్ష్యం. ఈక్విటీలో కనీసం 65 శాతం పెట్టుబడి, రుణ మరియు మనీ మార్కెట్ సాధనాల్లో 35 శాతం వరకు కేటాయించడం ద్వారా అస్థిరతను తగ్గిస్తూ వృద్ధి అవకాశాలను అందిస్తుంది.

న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 27, 2026 నుండి ఫిబ్రవరి 10, 2026 వరకు ప్రారంభమై, ఫిబ్రవరి 19, 2026 నుండి నిరంతర అమ్మకానికి తిరిగి తెరవబడుతుంది. ఫండ్ ద్వారా పెట్టుబడిదారులు మార్కెట్ చక్రాలను క్రమశిక్షణతో నావిగేట్ చేసుకోవచ్చు. ఎండి ఉ సీఈఓ శ్రీమతి మధు లునావత్ ప్రకారం, డైనమిక్ ఆస్తి కేటాయింపు మరియు వివేకవంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్ కలిపి మార్కెట్ అస్థిరతను సమర్థంగా నిర్వహిస్తూ దీర్ఘకాలిక సంపద సృష్టికి ఈ ఫండ్ సహాయపడుతుంది.

ఫండ్ క్రియాశీల ఈక్విటీ భాగాన్ని సిఐఓ శ్రీమతి అపర్ణ శంకర్, రుణ భాగాన్ని అనుభవజ్ఞులైన నిపుణులు శ్రీ ఉమేష్ శర్మ మరియు శ్రీ వరుణ్ నానావతి సంయుక్తంగా నిర్వహిస్తారు. ఫండ్ మిశ్రమ విధానానికి క్రిసిల్ హైబ్రిడ్ 50ం50 మోడరేట్ ఇండెక్స్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ ఆధారంగా బెంచ్‌మార్క్ చేయబడుతుంది. పెట్టుబడిదారులకు స్థిరమైన, రిస్క్ సర్దుబాటు చేసిన రాబడిని అందించడానికి వ్యూహాత్మకంగా వైవిధ్యీకృత పోర్ట్‌ఫోలియో నిర్మించడం ఫండ్ లక్ష్యం.

వెల్త్ కంపెనీ పాంటోమత్ గ్రూప్‌లో భాగంగా, లోతైన పరిశోధన, నాణ్యత, క్రమశిక్షణ మరియు తెలివైన ఉత్పత్తి రూపకల్పన ద్వారా విలువ సృష్టించడంలో నమ్మకం కలిగి ఉంది. కంపెనీ యుఎన్ పిఆర్ఐకు సంతకం చేసి, ఇ.ఎస్.జి. సూత్రాలను పెట్టుబడి విధానంలో అనుసరిస్తుంది. ఈ ఫండ్ ద్వారా పెట్టుబడిదారులు బాధ్యతాయుతమైన పెట్టుబడులు, మార్కెట్ ఆధారిత వ్యూహాలు మరియు దీర్ఘకాలిక ఆర్థిక విలువను పొందవచ్చు.

## హెచ్డీఎఫ్సీ మ్యూచువల్ ఫండ్ మహిళల పెట్టుబడి అవగాహన




హెచ్డీఎఫ్సీ మ్యూచువల్ ఫండ్, మాగ్ మేళా 2026లో, మహిళల ఆర్థిక సాక్షరతను పెంచుతూ, దీర్ఘకాలిక, క్రమపద్ధతిగా పెట్టుబడులు చేయడానికి ప్రేరేపించే అవగాహన శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ ప్రచారం 'బర్నీ సే ఆజాదీ' కార్యక్రమంలో భాగంగా, సంప్రదాయ స్థలాల్లో నగదు లేదా బర్నీలో నిల్వ చేయబడే డబ్బు విలువను తగ్గించకుండా, క్రమబద్ధమైన పెట్టుబడి ప్రణాళిక (ఎస్ఐపి) ద్వారా పెట్టుబడికి మార్గదర్శనం చేయడమే లక్ష్యం. ప్రచారం జనవరి 12 నుండి ఫిబ్రవరి 15, 2026 వరకు, మాగ్ మేళా గరిష్ట సందర్శకుల సమయంలో నిర్వహించబడుతోంది. హెచ్డీఎఫ్సీ ఎఎంసి ఎండీ ఉ సీఈఓ శ్రీ నవనీత్ మునోట్ ప్రకారం, ఆర్థిక స్వాతంత్ర్యం అవగాహనతో ప్రారంభమవుతుంది. మహిళలు సంప్రదాయంగా కుటుంబ పొదుపు పరిరక్షకులు, బర్నీ సే ఆజాదీ కార్యక్రమం ద్వారా వారిని నిర్విరామమైన, లక్ష్యంతో పెట్టుబడులకు ప్రేరేపించడం లక్ష్యం. సమాజ మాధ్యమాల్లో అవగాహన ను తీసుకురావడం ద్వారా, పెద్ద సంఖ్యలో ప్రజలకు పెట్టుబడి సూత్రాలు, దీర్ఘకాలిక లాభాల ముఖ్యతను చేరువ చేస్తారు.

మాగ్ మేళాలో ప్రకటనల కింద బర్నీ ప్రతిమ, నుక్కడ్ నాటకాలు, ఏఐ ఫోటో బూత్, మాఘి పౌర్ణిమా నాటి దీపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ విధానం ద్వారా పెద్ద సమాజాలను చేరుకుని, వినియోగదారులకు పెట్టుబడి అవగాహన అందించడం హెచ్డీఎఫ్సీ మ్యూచువల్ ఫండ్ యొక్క ప్రధాన లక్ష్యం.

ఎస్ఐపి ద్వారా పెట్టుబడిదారులు మార్కెట్ సమయానికి బంధించబడకుండా, క్రమపద్ధతిగా మరియు దీర్ఘకాలికంగా సంపదను సృష్టించగలరు. హెచ్డీఎఫ్సీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులకు, నమోదు చేసిన నిధుల ద్వారా మాత్రమే వ్యవహరించవలసిన సూచనలతో, సెబీ వెబ్‌సైట్ ద్వారా ధృవీకరణ సాధనాలను అందిస్తుంది. స్కోర్స్ మరియు స్మార్ట్ ఓడీఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది.

## వోల్టాస్ నిలకడగా అగ్రస్థానంలో క్యూ3లో నిలిచింది




వోల్టాస్ లిమిటెడ్, టాటా గ్రూప్ లో భాగమైన ప్రముఖ ఎయిర్ కండిషనింగ్ సంస్థ, 2025 డిసెంబరు 31 వరకు ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. క్యూ3లో, కంపెనీ స్థిరమైన ఆదాయం మరియు లాభంతో నిలిచింది, అయితే మొత్తం ఆదాయం ₹3,120 కోట్లుగా, పన్ను అనంతర లాభం ₹84 కోట్లుగా నమోదయ్యాయి. తొమ్మిది నెలల్లో, మొత్తం ఆదాయం ₹9,552 కోట్లకు, పన్ను అనంతర లాభం ₹257 కోట్లకు చేరింది, గత సంవత్సరం యొక్క ప్రదర్శనతో పోలిస్తే కొంత తగ్గుదల కనిపించింది.

కూలింగ్ విభాగంలో, ముఖ్యంగా రూం ఎయిర్ కండీషనర్ వ్యాపారం క్యూ3లో స్థిరమైన ప్రదర్శన ఇచ్చింది. జీఎస్టీ రేటు తగ్గింపు మరియు బీఈఈ స్టార్ లేబుల్ మార్పుకు ముందు ముందస్తు కొనుగోలు ప్రేరణతో చానెల్ గమనింపు మెరుగై, అమ్మకాలు పెరిగాయి. కంపెనీ ప్రస్తుత మరియు భవిష్యత్తు మార్కెట్ స్థితిని బలోపేతం చేయడానికి, ఉత్పత్తి మిశ్రమాన్ని మెరుగుపరచడం, ఖర్చు నియంత్రణ, మరియు విస్తృత నెట్‌వర్క్ వ్యూహాన్ని అనుసరిస్తుంది.

వోల్ట్‌బెక్ హోమ్ అప్లయిన్స్ విభాగం, ముఖ్యంగా వాషింగ్ మిషీన్లు, రిఫ్రిజిరేటర్లు మరియు చిన్న గృహ ఉపకరణాల విభాగం, సేల్స్ మరియు మార్కెట్ భాగస్వామ్యం పెరుగుదలతో క్యూ3లో బలమైన ప్రదర్శన చూపింది. వాషింగ్ మిషీన్ లో పూర్తి ఆటోమేటిక్ శ్రేణి, అమ్మకాలను ప్రేరేపించింది. కంపెనీ బ్రాండ్ వృద్ధి, శక్తి సామర్థ్యం గల ఉత్పత్తుల విస్తరణ, మరియు హోమ్ అప్లయిన్స్ ప్లాట్‌ఫారమ్ ద్వారా దీర్ఘకాలిక వృద్ధిని కొనసాగించనుంది.

ఎలక్ట్రో-మెకానికల్ ప్రాజెక్ట్స్, ఇండస్ట్రియల్ మరియు ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లు, మైనింగ్ మరియు కన్స్ట్రక్షన్ యంత్రాంగం, మరియు టెక్స్టైల్ యంత్రాంగం విభాగాలు స్థిరమైన మరియు విశ్వసనీయ పనితీరును అందించాయి. ఎండి శ్రీ ముకుందన్ మెనన్ ప్రకారం, కంపెనీ రూం ఎయిర్ కండీషనర్ వ్యాపారంపై ఆధారపడుతూ, చానెల్ గమనింపు, ఉత్పత్తి మిశ్రమం, ఖర్చు నియంత్రణతో భవిష్యత్తు సీజన్ కోసం సన్నద్ధమవుతోంది. ఈ పునాదిపై, వోల్టాస్ కూలింగ్‌లో ఆధిపత్యాన్ని పెంచుతూ, హోమ్ అప్లయిన్స్ మరియు ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ పరిష్కారాల విభాగాలను వేగవంతం చేస్తుంది.

వోల్టాస్ విభాగాల విస్తృత పోర్ట్‌ఫోలియో, ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌లు మరియు హోమ్ అప్లయిన్స్‌లో సాధించిన స్థిరమైన ఫలితాలు, కంపెనీ వ్యాపార దృఢతను బలోపేతం చేస్తున్నాయి.

## డా. అగర్వాల్ స్టెరాయిడ్-గ్లూకోమా హెచ్చరిక




డా. అగర్వాల్ ఐ హాస్పిటల్ హెచ్చరిస్తోంది, అనియంత్రితంగా మరియు ఎక్కువ కాలం స్టెరాయిడ్ వాడకం రెండవ గ్లూకోమా ప్రమాదాన్ని పెంచే ప్రధాన కారణంగా మారిందని. అలెర్జీలు, చర్మ, శ్వాస సంబంధ వ్యాధుల కోసం ఉపయోగించే స్టెరాయిడ్ మందులు లేదా కంటి డ్రాప్స్ అధిక కంటి పీడనాన్ని కలిగించవచ్చు, దీర్ఘకాలిక ఆప్టిక్ నర్వ్ నష్టం కలిగించగలవు. భారత్‌లో గ్లూకోమా ఉన్నవారి సంఖ్య 12--13 మిలియన్లకు చేరిక, అయితే 85--90% కేసులు నిర్ధారణ కానివి. దీర్ఘకాలిక వాడకం వల్ల రోగి ప్రారంభంలో లక్షణాలు గమనించకపోవడం వల్ల గమనించకముందే దృష్టి కోల్పోవచ్చు. ఈ సమస్య నివారణకు 40 ఏళ్ల పైబడినవారికి ప్రతి ఒకటి--రెండు సంవత్సరాలకోసారి కంటి పీడన, ఆప్టిక్ నర్వ్ ఆరోగ్యం పరీక్షలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. డయాబెటిస్ ఉన్నవారు, అధిక మైయోపియా, గుండె, థైరాయిడ్ సమస్యలున్నవారు మరియు గత కంటి గాయపాట్లున్నవారు ముఖ్యంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లాభం 48% పెరుగుదల




ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ క్యూ3ఎఫ్‌వై26లో 503 కోట్లు నికర లాభం సాధించింది, ఇది గత సంవత్సరం కన్నా 48% అధికం. ఖాతాదారుల వ్యాపారం 5,62,090 కోట్లు చేరింది, లోన్లు 2,79,428 కోట్లు, డిపాజిట్లు 2,82,662 కోట్లు పెరిగాయి. కాసా నిష్పత్తి 51.64%కి చేరడం, సౌకర్యవంతమైన డిజిటల్ మరియు సామాజిక లాభాల కార్యక్రమాలు బ్యాంక్ వృద్ధికి దోహదం చేశాయి. మూలధన సరిపోతుంది 16.22%, లోన్ నాణ్యత మెరుగుపడి, స్థిరమైన ఆర్ఓఈ 16%ం లక్ష్యంగా ఉంది. ఎండి ఉ సీఈఓ శ్రీ వి. వైద్యనాథన్ ప్రకారం, బిల్డింగ్, డిపాజిట్లు, వెల్త్ మేనేజ్‌మెంట్, ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్ అన్ని రంగాల్లో బలమైన వ్యాపార ప్రగతి కొనసాగుతోంది.

## పిఎంజె జ్యువెల్స్: అద్భుత ఆభరణ ప్రదర్శన హైదరాబాద్



హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో పిఎంజె జ్యువెల్స్ వారి అద్భుతమైన ఆభరణాల ప్రదర్శనను నిర్వహిస్తోంది. 60 ఏళ్లకు పైగా వారసత్వం గల ఈ సౌత్ ఇండియన్ బ్రాండ్ వివాహాలు, అర్ధసారీ వేడుకలు, ఇతర ప్రత్యేక సందర్భాల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన 10,000 కి పైగా ఆభరణాలను ప్రదర్శిస్తోంది. ప్రదర్శనలో వ్యక్తిగత శైలీ సలహాలు, వాస్తవ వజ్రాలు తనిఖీ చేసే ప్రత్యేక జోన్, మరియు పిల్లల ఫ్యాషన్ షో వంటి ఆకర్షణీయ కార్యక్రమాలు ఉంటాయి. సంప్రదాయ కళ మరియు ఆధునిక రూపకళ కలిసిన సిరీస్‌లు, భగవానుల రూపాల్లో ఆభరణాలు, ప్రకృతి మరియు బ్రహ్మాండం ప్రేరణతో రూపొందించిన అర్ధసారీ సిరీస్‌లు సందర్శకులకు అందుబాటులో ఉంటాయి. పిఎంజె జ్యువెల్స్ ప్రతి కుటుంబ జీవిత ఘట్టాల్లో విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతూ, పౌరాణికతను ఆధునికత్వంతో మేళవించిన అనుభవాన్ని అందిస్తుంది.

## హిందాల్కో కుప్పం యువ శిక్షణ కేంద్రం



ఆంధ్రప్రదేశ్ కుప్పంలో హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ మరియు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఖాడా) కలసి ఆధునిక బహుళ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రతివార్షం 500 పైగా యువతకు ఉద్యోగాలకు అనుగుణంగా, పరిశ్రమ-సంబంధిత శిక్షణ అందిస్తుంది. 22,500 చదరపు అడుగుల ప్రాంగణంలో స్మార్ట్ క్లాసులు, ప్రాక్టికల్ ల్యాబ్స్, డిజిటల్ ల్యాబ్స్ మరియు కెరీర్ మార్గదర్శక సౌకర్యాలు ఉన్నాయి. ఏఐ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫాం స్థానిక భాషల్లో శిక్షణ అందించి, యువతకు జీవితకాల నైపుణ్యాల అభివృద్ధి అవకాశాలను కల్పిస్తుంది. ఈ కేంద్రం ద్వారా 875 మందికి పైగా యువత శిక్షణ పొందగా, 600 ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయి, అలాగే సమాజంలోని లక్షల కుటుంబాలకు పరోక్ష లాభాలు కలుగుతాయి.హిందాల్కో యూనివర్సల్ నైపుణ్య అభివృద్ధి లక్ష్యంతో ఈ మోడల్‌ను ఇతర రాష్ట్రాల్లో కూడా విస్తరించనుంది.

## ఆర్థ భారత్ సువర్ణం ఆధునిక పెట్టుబడి మార్గం

ఆర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ద్వారా, భారతీయులు సాంప్రదాయంగా చేసిన సువర్ణ పొదుపును ఆధునిక పెట్టుబడి రూపంలో మార్చవచ్చు. గ్లోబల్ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా సువర్ణం రికార్డు స్థాయిలకు చేరడం, దీన్ని అస్థిరత నుండి రక్షణగా నిలిపే ఆస్తిగా చేస్తుంది. జిఐఎఫ్టీ సిటీ లో యూఎస్ డాలర్ రూపంలోని నిధులు మరియు భౌతిక సువర్ణ నిధుల ద్వారా వ్యవస్థాత్మక పెట్టుబడులు, మార్కెట్ మార్పులను సున్నితంగా నిర్వహించి, కరెన్సీ విభజన అందిస్తాయి మరియు దీర్ఘకాలిక సంపదను సంరక్షిస్తాయి. ఈ విధానం పాత సంప్రదాయాన్ని సమకాలీన, వ్యూహాత్మక పెట్టుబడిగా మార్చి, పెట్టుబడిదారులకు స్థిరమైన లాభాన్ని అందిస్తుంది.

## ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ పర్యావరణ బడ్జెట్ అవకాశాలు



ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యవస్థాపకుడు సంజయ్ అగర్వాల్ ప్రకారం, ఈ ఏడాది బడ్జెట్ పర్యావరణ సుస్థిరతను భారత్ వృద్ధి కథలో బలపర్చే అవకాశాన్ని అందిస్తున్నది. వాతావరణ సమస్యలు భూభాగంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి కాబట్టి, శుద్ధ ఇంధనం, మన్నికైన మౌలిక సదుపాయాలు, వాతావరణ సంబంధ జీవితోపాధి రంగాలకు నిధులు ప్రవహించే విధంగా స్థిరమైన విధాన సూచనలు అవసరం. రాష్ట్రాల పర్యావరణ అనుకూలతా ప్రణాళికపై స్పష్టత కూడా ముఖ్యంగా కావాలి, ఎందుకంటే వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇప్పటికే అనుభవిస్తున్న సముదాయాలు, రంగాలకు ఇది అవసరం. వాతావరణ చర్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలు మరియు సుశాసనాన్ని సమీకరించే బడ్జెట్, మరింత మన్నికైన మరియు సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో గణనీయ పాత్ర పోషిస్తుంది.

## మలబార్ గోల్డ్ & డైమండ్స్: అనంతపురం కొత్త షోరూమ్



మలబార్ గోల్డ్ & డైమండ్స్ తన అనంతపురం షోరూమ్‌ను కొత్త స్థలంలో ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌లో ఆమె సొంత మార్కెట్ ప్రాధాన్యతను బలపర్చింది. సుబాష్ రోడ్, సప్తగిరి సర్కిల్ సమీపంలో 12,518 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడిన షోరూమ్‌లో, గోల్డ్, డైమండ్, ప్లాటినం, రత్న ఆభరణాల విస్తృత శ్రేణి, ప్రత్యేక ప్రదర్శన ప్రాంతం, వ్యక్తిగత సేవల కోసం సీటింగ్ సౌకర్యాలు ఉన్నాయి. కొత్త షోరూమ్ ద్వారా ఖాతాదారులు సంప్రదాయ మరియు ఆధునిక రూపకళ కలిగిన వివాహ, పండుగ, రోజువారీ మరియు ఆధునిక డిజైన్‌లను సౌకర్యంగా పరిశీలించవచ్చు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక రాయితీలు, బిఐఎస్ హాల్‌మార్క్ గోల్డ్ మరియు సర్టిఫైడ్ డైమండ్లతో నాణ్యతా భరోసా, సుదీర్ఘ సంబంధాలను ప్రోత్సహించే విధంగా షోరూమ్ సేవలు అందుబాటులో ఉన్నాయి.కొత్తగా మార్చబడిన ఈ షోరూమ్‌తో, మలబార్ గోల్డ్ ఉ డైమండ్స్ ఆంధ్రప్రదేశ్ అంతటా తన విస్తరణను బలోపేతం చేస్తూనే ఉంది, స్థానిక కమ్యూనిటీలు మరియు ప్రాంతీయ మార్కెట్లతో సన్నిహితంగా అనుసంధానించబడి ఉంటూనే స్థిరమైన, అధిక-నాణ్యత రిటైల్ అనుభవాలను అందిస్తోంది.



# ద్వైపాక్షిక సంబంధాల్లో నవశకం!

● వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్జ్తో ప్రధాని మోడీ చర్చలు ఔషధ పరిశ్రమ, గనులు, ఆటోమొబైల్ రంగం, పర్యాటకం వంటి వ్యూహాత్మక అంశాలపై చర్చ ● భారత్-వెనెజువెలా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయం ● 2026 లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన

న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీ వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్తో ఫోన్లో సంభాషించారు. రానున్న కాలంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఇద్దరు నేతలు నిర్ణయించారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడంపై చర్చ జరిగింది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న తర్వాత, భారత్-వెనెజువెలా అగ్రనేతల మధ్య జరిగిన మొదటి ఫోన్ కాల్ ఇదే కావడం గమనార్హం.వెనెజువెలా అధ్యక్షురాలిపై మాట్లాడినట్లు ప్రధాని మోదీ ఎక్స్లో పోస్ట్ చేశారు. "వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు శ్రీమతి డెల్సీ రోడ్రిగ్జ్తో మాట్లాడాను. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవడానికి మేం అంగీకరించాం. రానున్న సంవత్సరాల్లో భారత్-వెనెజువెలా సంబంధాలను మరింత ఉన్నత స్థితికి చేర్చాలనే ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగుతాం." అని ప్రధాని మోదీ ఎక్స్లో రాసుకొచ్చారు.

2026 లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక : డెల్సీ ఫోన్ సంభాషణ అనంతరం డెల్సీ రోడ్రిగ్జ్ ఎక్స్లో పోస్ట్ చేశారు. భారత్తో పలు రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశంపై చర్చించినట్లు తెలిపారు. ఇంధనం, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఔషధ పరిశ్రమ, గనులు, ఆటోమొబైల్ రంగం, పర్యటకం వంటి రంగాల్లో సహకారం పెంపొందించుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించినట్లు చెప్పారు. 'ఇంధనం, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, గనులు, ఆటోమొబైల్ రంగం, పర్యటకం వంటి వ్యూహాత్మక అంశాలపై చర్చించాం. 2026లో ద్వైపాక్షిక సంబంధాలను పునఃప్రారంభించేందుకు ఒక సాధారణ ప్రణాళికపై ముందుకు సాగాలని నిర్ణయించాం' అని ఎక్స్లో పేర్కొన్నారు.

ప్రధాని కార్యాలయం (పీఎంవో) విడుదల చేసిన ప్రకటన ప్రకారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగం, డిజిటల్ టెక్నాలజీ, ఆరోగ్యం, వ్యవసాయం సహా ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు నిశ్చయించుకున్నారు. ప్రాంతీయ, ప్రపంచ రాజకీయ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్న నేతలు, 'గ్లోబల్ సౌత్' ప్రయోజనాల కోసం ఇరు దేశాల మధ్య సన్నిహిత సహకారం అత్యంత ఆవశ్యకమని నొక్కి చెప్పారు.

# 'మహా' ఉపముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణస్వీకారం

● తొలి మహిళ డిప్యూటీ సీఎంగా రికార్డు ● శుభాకాంక్షలు తెలియజేస్తూ మోదీ ట్వీట్



ముంబై : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ శుక్రవారం (జనవరి 31)న ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్ర ఇన్చార్జ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందేతో పాటు ఎన్సీపీకి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. దివంగత అజిత్ పవార్ ఆకస్మిక మృతితో ఖాళీ అయిన ఉప ముఖ్యమంత్రి పదవికి ఆయన భార్య సునేత్రా పవార్ను ఎంపిక చేశారు. దీంతో ఆమె మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. సునేత్ర మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు, ఎన్సీపీ నాయకులు 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది.

సునేత్రకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మోదీ ట్వీట్ : మరోవైపు, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సునేత్ర పవార్కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎన్నికైన సునేత్ర పవార్కు శుభాకాంక్షలు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ కావడం విశేషం. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా కృషి చేస్తారని, దివంగత అజిత్దాదా పవార్ ఆశయాలను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని మోదీ ఎక్స్లో పోస్ట్ చేశారు.

ప్రభుత్వ స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం : అయితే, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు విధానభవన్లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సునేత్రా పవార్ను ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ నాయకత్వం తీసుకున్న నిర్ణయం అనంతరం సాయంత్రం 5 గంటలకు రాజ్భవన్లో ఆమె ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించగా, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. దివంగత అజిత్ పవార్ మరణానంతరం ఏర్పడిన రాజకీయ పరిస్థితుల్లో పార్టీ ఐక్యతను కాపాడుతూ, ప్రభుత్వ స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్సీపీ నేతలు తెలిపారు. సునేత్రా పవార్కు రాజకీయ అనుభవం ఉన్న కుటుంబ నేపథ్యం ఉండటంతో పాటు, పార్టీ కార్యకలాపాల్లో కూడా ఆమె చురుకుగా పాల్గొంటూ వచ్చారు.

అనేక ప్రచారాలకు నాయకత్వం వహించిన సునేత్ర : సునేత్రా పవార్ 2024 లోక్సభ ఎన్నికల్లో తొలిసారిగా రాజకీయ బరిలోకి దిగారు. ఆమె పెద్ద కుమారుడు పార్థ్ పవార్ 2019 లోక్సభ ఎన్నికల్లో మావల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్నారు. చిన్న కుమారుడు జయ్ వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా, 2010లో సునేత్రా 'ఎన్విరాన్మెంట్ ఫోరం ఆఫ్ ఇండియా' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, ఎకో విలేజ్ మోడల్ అమలు వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, కరవు నివారణపై అనేక ప్రచారాలకు నాయకత్వం వహించారు.అదే విధంగా శరద్ పవార్ స్థాపించిన విద్యా సంస్థ 'విద్యా ప్రతిష్ఠాన్'కు ట్రస్టీగా కూడా ఆమె సేవలందిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సస్టెయినబిలిటీ, సామాజిక ఆవిష్కరణలపై భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. బారామతి హైటెక్ టెక్స్టైల్ పార్క్ చైర్పర్సన్గా వ్యవహరిస్తూ 15 వేలకుపైగా గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించారు. అలాగే నిర్మల్ గ్రామ పథకం ద్వారా 86 గ్రామాల్లో స్వయం సహాయక బృందాల ఉద్యమానికి నేతృత్వం వహించారు.

కాగా ఇప్పుడు సునేత్రా పవార్ ఇప్పుడు ఎన్సీపీని ఏకతాటిపై నిలబెట్టే సవాలును ఎదుర్కొంటున్నారు. బీజేపీ, ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో సమన్వయం కొనసాగిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆమెపై ఉంది.

# బెంగాల్లో టీఎంసీ సర్కార్ ఉంటే దేశానికే ముప్పు

● బరాక్పూర్ సభలో హోంమంత్రి అమిత్ షా ● ఓట్ల కోసం దేశ భద్రతను తాకట్టు పెడుతున్నారని ఆరోపణ ● కోర్టు చెప్పినా బిఎస్ఎఫ్కు భూమి ఇవ్వడం లేదు ● అవినీతి మంత్రులకు టికెట్లు ఇవ్వొద్దని మమతకు సవాల్



కోల్కతా : బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బంగాల్లో టీఎంసీ ప్రభుత్వం 'చొరబాటుదారులకు ఆశ్రయం' కల్పిస్తోందని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతనే పణంగా పెడుతోందని ఆయన మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్పుర్లో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మా, మట్టి, మనుష్' (అమ్మ, మట్టి, మనిషి) నినాదంతో అధికారంలోకి వచ్చిన మమత పాలనలో, నేడు ఆ మూడూ ప్రమాదంలో పడ్డాయని ఆయన ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మమత ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, దేశ రక్షణ కోసం బంగాల్లో బీజేపీ జెండా ఎగరడం అత్యవసరమని అమిత్ షా తేల్చిచెప్పారు.

'మా, మట్టి, మనుష్', అన్నీ ప్రమాదంలోనే!

మమత బెనర్జీ స్లోగన్ను ఉదహరిస్తూ అమిత్ షా విశ్లేషించారు. "మమత దీదీ 'మా, మట్టి, మనుష్' నినాదంతో అధికారంలోకి వచ్చారు. కానీ నేడు బంగాల్లో ఈ మూడూ సురక్షితంగా లేవు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు. వారికి భద్రత కరవైంది. బంగాల్ నేలను చొరబాటుదారులు మింగేస్తున్నారు. ఇక్కడి సామాన్య ప్రజలు మమత సిండికేట్ ఆగడాలతో, దోపిడీలతో నలిగిపోతున్నారు" అని షా విమర్శించారు.

అమిత్ షా తన ప్రసంగంలో చొరబాట్ల అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. ఇది కేవలం రాష్ట్ర సమస్య కాదని స్పష్టం చేశారు."బంగాల్లో చొరబాటుదారులు యథేచ్ఛగా వస్తున్నారు. ఇది ఇప్పుడు కేవలం బంగాల్ సమస్య కాదు, మొత్తం దేశ భద్రతకే ముప్పుగా మారింది. సరిహద్దుల్లో కంచె వేయడానికి భూమి ఇవ్వాలని కోర్టులు ఆదేశించాయి. అయినా సరే మమత ప్రభుత్వం సరిహద్దు భద్రతా దళానికి భూమి ఇవ్వడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారు. ఎందుకంటే ఆ చొరబాటుదారులు టీఎంసీకి ఓటు బ్యాంకుగా మారారు" అని అన్నారు. "రాష్ట్రంలోని పోలీసులు, అధికారులు అక్రమ వలసదారులను అడ్డుకోవడం లేదు. నకిలీ పత్రాలు సృష్టించి వారిని దేశమంతటా పంపిస్తున్నారు. దీనివల్ల దేశంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి." అని ఆరోపించారు.

రావణుడిలా అహంకారం : మమత బెనర్జీ తీరును రామాయణంలోని రావణుడితో పోల్చుతూ షా వ్యాఖ్యలు చేశారు. "రాముడు సముద్రంపై వారధి కడుతున్నప్పుడు, ఈ భూమ్మీద నన్ను ఓడించేవారే లేరని రావణుడు అహంకరించి అనుకున్నాడు. కానీ ఏం జరిగిందో అందరికీ తెలుసు. మమత జీ, మీరు కూడా అలాగే అనుకుంటున్నారు. కానీ ఈసారి బీజేపీ సునామీని ఆపలేరు. వచ్చే ఎన్నికల్లో మాకు 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయి. భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది" అని జోస్యం చెప్పారు. "కేంద్ర ప్రభుత్వం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరపాలని నిర్ణయించింది. కానీ పార్లమెంటులో దీనిపై చర్చను టీఎంసీ ఎంపీలు అడ్డుకున్నారు. కేవలం చొరబాటుదారులను సంతోషపెట్టడానికే మమత ఇలా చేస్తున్నారు. వందేమాతరాన్ని వ్యతిరేకించడం అంటే మోదీని వ్యతిరేకించడం కాదు, బంగాల్ను, భారతదేశ గౌరవాన్ని అవమానించడమే" అని మండిపడ్డారు.

అవినీతి మంటలు : బంగాల్లో అవినీతి ఏ స్థాయికి చేరిందో చెప్పడానికి ఇటీవలి అగ్నిప్రమాదాన్ని షా ఉదహరించారు. "ఇటీవల ఆనందాపుర్లోని మోమో ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగింది. అది ప్రమాదం కాదు, మమత సర్కార్ అవినీతి ఫలితం. ఆ ఫ్యాక్టరీ యజమానులను ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదు? వారు అధికార పార్టీకి సన్నిహితులు కాబట్టే వదిలేశారా? అసలు బంగాల్లో పరిపాలన ఉందా?" అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో అవినీతి మచ్చున్న మంత్రులకు టికెట్లు ఇవ్వొద్దని సవాల్ విసిరారు. టీఎంసీ బెదిరింపులకు మతువా నమశూద్ర వర్గాలు భయపడొద్దని షా ధైర్యం చెప్పారు. వారి ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని భరోసా ఇచ్చారు. బంగాల్లో 'దేశభక్తుల ప్రభుత్వాన్ని' స్థాపించడానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# అమెరికాలో మళ్లీ షట్ డౌన్

● బిల్లులకు ఆమోదం తెలపని కాంగ్రెస్ ● మూడొంతుల విభాగాలు ప్రభావితమైన తీరు ● వేతనం లేని సెలవుల్లోకి లక్షల మంది ఉద్యోగులు ● సోమవారం ఎగువసభలో సమావేశం తిరిగి ప్రారంభం




వాషింగ్టన్ : అమెరికాలో మరోసారి షట్డౌన్ మొదలైంది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువులోపు కాంగ్రెస్ ఆమోదించలేదు. దీంతో ప్రభుత్వం పాక్షికంగా షడ్ డౌన్ అయింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు ముగియడంతో ఫెడరల్ ప్రభుత్వంలో మూడొంతుల విభాగాలు ప్రభావితమయ్యాయి. ఒక వేళ వచ్చే సోమవారం బడ్జెట్ ఆమోదానికి సభ చర్యలు తీసుకుంటే రోజుల వ్యవధిలోనే ప్రభుత్వ విభాగాలకు నిధుల కేటాయింపు పునరుద్ధరణ జరుగుతుంది. ప్రజాసేవలు, కాంట్రాక్టర్లు, ఫెడరల్ ఉద్యోగుల జీతాలకు సంబంధించి అంతరాయాలు పరిష్కారమవుతాయి. ఒకవేళ అది జరగకపోతే లక్షల మంది ఉద్యోగులు వేతనం లేని సెలవుల్లోకి వెళ్లనున్నారు. లేదా చట్టసభ సభ్యులు చర్యలు తీసుకునే వరకు జీతాల్లేకుండానే పనిచేయాల్సి ఉంటుంది.

అయితే సెప్టెంబర్ వరకు చాలా ఫెడరల్ ఏజెన్సీలకు జీతాలు ఇచ్చేందుకు ఐదు పెండింగ్ బిల్లులకు మార్గం సుగమం చేసే చట్టాన్ని శుక్రవారం సెనేట్ ఆమోదించింది. విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, రక్షణ సంబంధిత ఏజెన్సీలు ఈ జాబితాలో ఉన్నాయి. డిపార్ట్మెంట్ ఆఫ్ హోంల్యాండ్కు రెండు వారాల స్టాప్గ్యాప్ను ఆమోదించింది. సోమవారం ఎగువసభలో సమావేశం తిరిగి ప్రారంభం కానుండటంతో త్వరగా చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెమొక్రాట్లను కోరారు. అయితే ఈ షట్డౌన్ పాక్షికమేనని చట్టసభ సభ్యులు చెబుతున్నారు. వచ్చేవారం ఈ నిధుల బిల్లుపై మరోసారి చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు.

నిరసకారుల మృతిపై సెనెట్లో డెమొక్రాట్లు ఆగ్రహం : తాజా ప్రభుత్వ షట్డౌన్కు డొనాల్డ్ ట్రంప్ అవలంబిస్తున్న కఠిన వలస వ్యతిరేక విధానాలే కారణం. హోమ్ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్మెంట్కు నిధుల కేటాయింపుపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. మాస్ డిపోర్టేషన్ క్యాంపెయిన్లో భాగంగా దేశవ్యాప్తంగా మోహరించిన ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు, వలసవాదులను ఎక్కడికక్కడ తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం మిన్నియా పోలిస్లో నిరసనలు చేస్తున్న అలెక్స్ ప్రెట్టి, రెనీ గుడ్ అనే ఇద్దరు అమెరికన్ పౌరులు పోలీసుల కాల్పుల్లో మృతిచెందారు. ఈ ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డెమొక్రాట్లు, డీహెచ్ఎస్కు నిధులు ఇచ్చే బిల్లు అంగీకరించడం లేదు. తాము మద్దతు ఇవ్వాలంటే డీహెచ్ఎస్లో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఏజెంట్లు ముఖాలకు మాస్కు ధరించవద్దని, వారికి బాడీ కెమెరాలు తప్పనిసరి చేయాలని కోరుతున్నారు. వారంట్ లేకుండా బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు, అరెస్టులు చేయకూడదు. ఫెడరల్ ఏజెంట్లకు రాష్ట్ర పోలీసుల మాదిరిగా యూస్-ఆఫ్-ఫోర్స్, యూనిఫార్మ్ కోడ్ ఆఫ్ కండక్ట్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలి. హింసాత్మక ఘటనలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలని డెమొక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు.

గతేడాదిలో 43రోజులు షట్ డౌన్ : ట్రంప్ హయాంలో కొన్ని నెలల క్రితం అమెరికా చరిత్రలోనే సుదీర్ఘమైన షట్డౌన్ తలెత్తింది. లక్షలమంది ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. గతేడాది అక్టోబర్ 1న మొదలైన అమెరికా ప్రభుత్వం 43 రోజులు పాటు కొనసాగింది. అమెరికాలో చాలా ప్రభుత్వ విభాగాలకు నిధుల కేటాయింపు జరగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందకపోవడంతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొన్నారు. దాదాపు 7.5 లక్షల మంది ఉద్యోగులపై ప్రభావం పడింది. వారందరికీ నవంబర్ నుంచే జీతాలు అందజేయనున్నట్లు తెలుస్తోంది. వేలాది విమాన సర్వీసులు రద్దవడంతో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకున్న ఘటనలు షట్డౌన్ కారణంగా జరిగాయి. అమెరికాలో షట్డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం.

1981 నుంచి యూఎస్ ప్రభుత్వం 16 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా, నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

# ముడి చమురు రాజకీయం

## రష్యాకు భారత్ దూరం వెనెజువెలాకు చేరువ!

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత్ భారీ డిస్కౌంట్లకు రష్యా ముడి చమురును కొనుగోలు చేస్తూ వస్తోంది. అయితే, డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రష్యా నుంచి ఆయిల్ కొనే దేశాలపై గతేడాది మార్చిలో భారీగా సుంకాలు విధించింది. దీనివల్ల భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడటంతో, న్యూఢిల్లీ ఇప్పుడు తన చమురు దిగుమతుల వ్యూహాన్ని మార్చుకుంటోంది.గత జనవరిలో రోజుకు 12 లక్షల బారెళ్లుగా ఉన్న రష్యా చమురు దిగుమతులు, ఫిబ్రవరి నాటికి 10 లక్షలకు, మార్చి నాటికి 8 లక్షల బారెళ్లకు పడిపోయే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. భవిష్యత్తులో దీనిని 5 లక్షల బారెళ్లకు పరిమితం చేసి, అమెరికాతో మెరుగైన వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలని భారత్ భావిస్తోంది. ఈ లోటును పూడ్చుకోవడానికి భారత్ ఇప్పటికే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల నుంచి కొనుగోళ్లు పెంచింది.వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు బంధించిన తర్వాత, అక్కడ ఏర్పడిన కొత్త పరిస్థితుల నేపథ్యంలో వాషింగ్టన్ తన వైఖరిని మార్చుకుంది. భారత్ తిరిగి వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేసుకోవచ్చని అమెరికా సంకేతాలిచ్చింది. దీనివల్ల అటు రష్యా ఆదాయం తగ్గడంతో పాటు, భారత్కు చమురు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూసినట్లవుతుందని అమెరికా ప్లాన్. భారత పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి కూడా చమురు వనరులను వైవిధ్యపరుస్తున్నట్లు పేర్కొనడం ఈ మార్పును ధృవీకరిస్తోంది.

# సునేత్రకు మూడు శాఖలు..



ముంబై: మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్య మంత్రిగా దివంగత అజిత్ పవార్ భార్య, ఎన్సీపీ రాజ్యసభ సభ్యురాలు సునేత్రా పవార్ శనివారంనాడు పగ్గాలు చేపట్టారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. అజిత్ పవార్ మరణంతో ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా సునేత్ర శనివారం ఉదయం ఎన్నికయ్యారు. ఆ వెంటనే సాయంత్రం 5 గంటలకు రాజ్భవన్లో ఉప ముఖ్య మంత్రిగా ఆమె ప్రమాణస్వీకారం చేశారు. 'మహా యుతి' సర్కార్లో అజిత్ పవార్ నిర్వహించిన మూడు శాఖలను ఆమెకు కేటాయించారు.

మహాత్మునికి సీఎం చంద్రబాబు ఘన నివాళి ఎక్సైజ్ శాఖ, క్రీడలు-యువజన సంక్షేమం, మైనారిటీల అభివృద్ధి శాఖలను సునేత్రకు ఫడ్నవిస్ ప్రభుత్వం కేటాయించింది. అయితే అజిత్ పవార్ చేతిలోని మరో కీలకమైన ఆర్థిక శాఖను మాత్రం కేటాయించలేదు. మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన చేతిలోనే ఉంచుకున్నారు. దీంతో ఆయనే స్వయంగా ఈసారి బడ్జెట్ను అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఆ తర్వాతే ఎన్సీపీకి ఆర్థిక శాఖను కేటాయించడం కానీ, దానికి బదులుగా మరో శాఖను కానీ కేటాయించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

పవార్ను కలిసిన అజిత్ తనయుడు : మరోవైపు, సునేత్ర పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసే విషయం తనకు తెలియదని, వార్తలు చూసిన తర్వాతే ఆ విషయం తనకు తెలిసిందని ఎన్సీపీ ఎస్పీ చీఫ్ శరద్ పవార్ శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.అజిత్ పవార్ మరణంతో ఎన్సీపీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా సునేత్ర శనివారం ఉదయం ఎన్నికయ్యారు. ఆ వెంటనే సాయంత్రం 5 గంటలకు రాజ్భవన్లో ఉప ముఖ్య మంత్రిగా ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ఎన్సీపీ-ఎన్సీపీఎస్పీ విలీనాన్ని అజిత్ పవార్ కోరుకున్నట్టు కూడా తెలిపారు. దురదృష్టవశాత్తూ విమాన ప్రమాదంతో ఆ చర్చలు ఆగిపోయాయన్నారు. కాగా, శరద్ పవార్ వ్యాఖ్యలు చేసిన కొద్ది సేపటికే ఆయనను అజిత్ పవార్ తనయుడు పార్థ్ పవార్, ఎన్సీపీ(ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ కలుసుకున్నారు. తాజా పరిణామాలను ఆయనకు వివరించారు.




ఏప్రిల్ 30 నాటికి అయోధ్య

# రామమందిర నిర్మాణం పూర్తి!

● రూ.1900కోట్ల వ్యయం చేస్తున్నట్టు వెల్లడించిన కమిటీ చైర్మన్ ● గడువు ముగిసే నాటికి పనులు, బిల్లుల చెల్లింపునకు ఆదేశాలు ● ఆలయానికి మూడేళ్లు వారంటీ ఇచ్చిన నిర్మాణ సంస్థలు ఎల్డిటీ, టాటా కన్సల్టెన్సీ



అయోధ్య: అయోధ్యలోని రామమందిర నిర్మాణ పనులన్నీ ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి పూర్తి కానున్నాయని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. కాగా, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం రూ.1,900 కోట్లు అవుతుందని అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ జరిగిన రెండు రోజుల రామమందిర నిర్మాణ కమిటీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన ఈ విషయాలు వెల్లడించారు.నిర్మాణ పనులు చేపడుతున్న లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్డటీ), టాటా కన్సల్టెన్సీ సంస్థలు ఏప్రిల్ 30 నాటికి పనులు మొత్తం పూర్తి చేసి, అక్కడి నుంచి నిష్క్రమిస్తాయని మిశ్రా తెలిపారు. అదే తేదీ నాటికి పేపర్వర్క్, బిల్లుల చెల్లింపులు కూడా ముగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

ఇప్పటికే సంస్థలకు రూ.1,600 కోట్లు చెల్లింపులు"ఎల్ అండ్ టీ, టాటా కన్సల్టెన్సీ సంస్థలు తాము చేపట్టిన పనులకు మూడు సంవత్సరాల వారంటీని ఇచ్చాయి. ఆలయ నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఈ రెండు సంస్థలకు సంబంధించిన ఒక బృందం ఆలయ ప్రాంగణంలోనే ఉంటుంది" అని మిశ్రా తెలియజేశారు. ఏప్రిల్ 30 తర్వాత ఎల్ అండ్ టీ, టాటా కన్సల్టెన్సీ, స్టేట్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్లతో ఉన్న ఒప్పందాలన్నీ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధీనంలోకి వస్తాయని ఆయన వివరించారు. ఆలయ నిర్మాణ ఖర్చుల వివరాలను వెల్లడిస్తూ, రామమందిర ప్రాజెక్టు మొత్తం వ్యయం సుమారు రూ.1,900 కోట్లు కాగా, అందులో జీఎస్టీతో కలిపి దాదాపు రూ.1,600 కోట్లు ఇప్పటికే చెల్లించినట్లు మిశ్రా తెలిపారు. ఈ సమావేశంలో నిర్మాణ పురోగతిని సమీక్షించడంతో పాటు, పనుల పూర్తికి తుది గడువు, బాధ్యతల బదిలీపై కూడా చర్చించినట్లు అధికారులు వెల్లడించారు.

# అన్నింటికీ భారత్ ఓకే చెప్పదు

● అమెరికా రిటైర్డ్ కల్నల్ కీలక వ్యాఖ్యలు
● భారత్ అమెరికా వాణిజ్య చర్చలపై స్పందించిన
● రక్షణ రంగ నిపుణుడు డగ్లాస్ మక్ గ్రెగర్
● సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశమూ చర్చలు జరపబోదన్న డగ్లాస్



న్యూఢిల్లీ : గత కొంతకాలంగా భారత్ అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చల గురించి అమెరికా రిటైర్డ్ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లాస్ మక్గ్రెగర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందాల కోసం అమెరికా చెప్పే ప్రతిదానికి భారత్ తలాడించదని వ్యాఖ్యానించారు. ఎందుకంటే సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశమూ ఇతర దేశాలతో చర్చలు జరపబోదని ఆయన పేర్కొన్నారు. రష్యాతో-భారత్ అధికంగా చమురు దిగుమతి చేసుకుంటోందన్న కారణంతో భారత్పై 50 శాతం సుంకాలు విధించడం ఆయన మూర్ఖపు మనస్తత్వాన్ని తెలియజేస్తోందని విమర్శించారు.ఈ సందర్భంగా విలేకరులతో సమావేశమైన డగ్లాస్, అమెరికాతో భారత్ సంబంధాల గురించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా భారత్-రష్యాలు మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయొద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని డగ్లాస్ పేర్కొన్నారు. అగ్రరాజ్యం ఎప్పుడూ ప్రపంచదేశాలు తనతోనే ఉండాలని, లేదా తనకు వ్యతిరేకంగా ఉండాలనే సిద్ధాంతాన్ని పాటిస్తుందన్నారు. మలేసియా వంటి దేశాలు యూఎస్తో వాణిజ్య ఒప్పందం కోసం తమ ప్రధాన విధానాల విషయంలో రాజీపడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అదే విధంగా, గ్రీన్లాండ్తో వ్యాపారం చేసే ఐరోపా దేశాల పైనా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలా ప్రపంచ దేశాలపై బెదిరింపులకు దిగుతూ, ఇష్టం వచ్చినట్లు టారిఫ్లు విధిస్తే అమెరికాకే నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

భారత్- ఈయూ డీల్ నన్ను నిరాశపరిచింది!

ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితం భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య జరిగిన డీల్ తమను నిరాశపరిచిందని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ఉక్రెయిన్లో ఇంకా యుద్ధం కొనసాగుతున్నప్పటికీ ఈయూ వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిందంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ స్కాట్ బెసెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. వాళ్లకు ఏది ఉత్తమమైందో వారు అది చేయాలి, కానీ యూరోపియన్లు నన్ను నిరాశపరిచారని పేర్కొన్నారు. గతేడాది భారత దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించింది. అయితే, తమలాగే భారత్పై అదనపు సుంకాలు విధించేందుకు అప్పుడు ఈయూ విముఖత వ్యక్తం చేసిందన్నారు. సొంత వాణిజ్య ఒప్పందం కోసం ముందుకువెళ్లాలనే ఉద్దేశంతోనే వారు ఆ పని చేసేందుకు ఇష్టపడలేదని బెసెంట్ అన్నారు. ఐరోపా, ఉక్రెయిన్ ప్రజల కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు.రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు భారత్కు వెళ్తుందని దాన్ని శుద్ధి చేసి, భారత్ చమురు ఉత్పత్తులు తయారుచేస్తుందని బెసెంట్ తెలిపారు. అయితే, యూరోపియన్లు ఇప్పుడు వాటిని కొనుగోలు చేయడం ప్రారంభించారని, దీంతో రష్యా యుద్ధానికి వారు పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నారని బెసెంట్ ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్పై బెసెంట్ గతంలో కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేయడం గమనార్హం.

ఈయూ, భారత్ డీల్- భారత్కే ఎక్కువ అనుకూలం!

అంతకుముందు, భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ కూడా స్పందించారు. ఈ ఒప్పందం భారత్కే ఎక్కువ అనుకూలంగా ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- ఈయూ ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలు తాను పరిశీలించానని, అందులో భారత్దే పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఈయూ మార్కెట్లో భారత ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వదేశీ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తుచేసుకున్నారు. అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్లు విధిస్తుండటంతో, పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈయూ, భారత్తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్రీయం తెలంగాణ

# కేసీఆర్ హయాంలో అవినీతి ఇంతంతకాదయా

## బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపణ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు భారీగా అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. వారి అకౌంట్‌లు నింపుకోవాలని చూశారే తప్ప.. పేదల సంక్షేమానికి కృషి చేయలేదని ధ్వజమెత్తారు. రెండుసార్లు మాయమాటలు చెప్పి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వారి స్వలాభం కోసం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని ఎద్దేవా చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ సాయి ప్రభాత్ నగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**పేదలందరికీ ఇళ్లు..**

తెలంగాణ వ్యాప్తంగా ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో 32 డివిజన్లను మొత్తం తామే కైవసం చేసుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల దీవెనలతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కోసం పని చేస్తున్నామని వివరించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో ఇళ్లు ఇచ్చామని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇస్తామని భరోసా కల్పించారు.

**అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవారి కష్టం తెలిసిన పెద్ద కొడుకుగా ఇక్కడి వారికి అన్ని సౌకర్యాలూ కల్పిస్తానని చెప్పుకొచ్చారు. గడిచిన రెండేళ్లలో ఏదులాపురం 5, 6 డివిజన్లలో రూ.19 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. ఎఫ్‌సీఐ గోడౌన్‌ను ఇక్కడ నుంచి తరలిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# యూనియన్ బడ్జెట్ 2026లో తెలంగాణకు నిధులు కేటాయించాలి

## కేంద్ర ఆర్థిక మంత్రికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రానికి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు యూనియన్ బడ్జెట్--2026లో తగిన నిధులు కేటాయించాలని భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ, 2014లో తెలంగాణ రాష్ట్రం అవతరించిన సమయంలో ఆర్థికంగా బలమైన స్థితిలో ఉండేదని, అయితే 2014--2023 మధ్యకాలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన అవాస్తవ విధానాలు, అసమతుల్య ప్రాజెక్ట్ కేటాయింపుల వల్ల రాష్ట్రం తీవ్ర అప్పుల భారంలోకి వెళ్లిందన్నారు.2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత మంత్రిత్వ శాఖలతో నిరంతరంగా సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదాలు, బడ్జెట్ మంజూరు లేకపోవడం వల్ల ప్రస్తుతం 12 విభాగాలకు సంబంధించిన సుమారు 47 కీలక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని ఎంపీ చామల తెలిపారు. వాటిలో ముఖ్యంగా రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 రేడియల్ రోడ్లు, కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులు ఉన్నాయని పేర్కొన్నారు. పరిశ్రమల రంగంలో ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0లో తెలంగాణను చేర్చడం, లిలికాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ (పీఎం మిత్ర)లిలికు తుది ఆమోదం, ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వంటి ప్రతిపాదనలు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు.ఇంధన రంగానికి సంబంధించి గ్రావీ-ఖుఖావీ పథకాల పునరుద్ధరణ, విద్యుత్ ప్రసరణ ప్రాజెక్టులకు ఆమోదం, సింగరేణి కోల్ బ్లాక్‌ల అంశాలపై కేంద్రం తక్షణమే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా పట్టణ మౌలిక వసతులు, మురుగు మరియు డ్రైనేజీ ప్రాజెక్టులు, గోదావరి--మూసీ రివర్ లింక్ వంటి నీటి ప్రాజెక్టులు, జవహర్ నవోదయ మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, హైదరాబాద్‌లో ఐఐఎం స్థాపన పథకాల కింద గృహాల మంజూరు అంశాలపై కూడా కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు.ఫెడరల్ వ్యవస్థ ఆత్మను గౌరవిస్తూ, తెలంగాణ రాష్ట్రానికి న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని యూనియన్ బడ్జెట్--2026లో తెలంగాణకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సీఎం రేవంత్‌వి కక్ష సాధింపు చర్యలు

- తెలంగాణ తేవడమే కేసీఆర్ నేరమా?'
- బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాజకీయ నేతలకు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ నెంబర్లు ఇచ్చి ట్యాప్ చేయమని ఏ ముఖ్యమంత్రి కూడా చెప్పరు. రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించడం కోసం ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రెండేళ్ల నుంచి బీఆర్ఎస్‌పై వేధింపులు కొనసాగుతున్నాయి. తెలంగాణలో సమస్యలను పక్క దారి పట్టించి.. అలీబాబా 40దొంగలు తరహాలో కాంగ్రెస్ నాయకులు అనేక కుంభకోణాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదు. 1875లోనే ట్యాపింగ్‌పై చట్టం వచ్చింది. ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరు. ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసం సిట్ వేశారు. విచారణ జరుగుతున్న క్రమంలో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకి లీకులు ఇస్తున్నారు. కాంగ్రెస్ కుట్రల నుండి కేసీఆర్ తెలంగాణ తేవడమే నేరమా?. రేవంత్ రెడ్డి కక్షతోనే కేసీఆర్‌కి నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు సమ్మక్క సారలమ్మ జాతరకి రమ్మని ఎర్రవెల్లికి వెళ్ళి ఆహ్వానిస్తారు. కానీ, పోలీస్ అధికారులు నంది నగర్ ఇంటి వెళ్లి నోటీసులు ఇస్తారు. ఇది దుర్మార్గమైన చర్య. ప్రతీకార వాంఛతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీష్ రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కి నోటీస్ ఇచ్చారు. కేసీఆర్‌కి మాత్రం హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు శిక్ష వేయడం ఖాయం అని ఘాటు విమర్శలు చేశారు.

# ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికే రాజీనామా చేస్తా

## తెలంగాణ ఐపీఎస్ అసోషియేషన్‌కు పాడి కౌశిక్‌రెడ్డి సవాల్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ ఐపీఎస్ అసోసియేషన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. తనపై తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. కరీంనగర్ సీపీపై తాను మతమార్పిడి ఆరోపణలు చేయకపోయినా చేసినట్లు ఆరోపిస్తున్నారని విమర్శించారు. తాను ఆ ఆరోపణలు చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికే రాజీనామా చేస్తా అని తెలిపారు. 'కరీంనగర్ సీపీపై నేను మతమార్పిడి ఆరోపణలు నేను చేయలేదు. నేను ఆ మాట అన్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. తప్పుడు ఆరోపణలు చేసినందుకు ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాకు క్షమాపణ చెప్పాలి. లేదంటే ప్రివిలేజ్ మోషన్ వేస్తా' అని పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు.

# ఐ విజన్ యూత్ పార్లమెంట్ -2025

- గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లో నిర్వహణ
- హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః పాఠశాల విద్యార్థుల కోసం రూపొందించిన సృజనాత్మక, వినూత్న పౌర విద్యా కార్యక్రమం ఐవిజన్ యూత్ పార్లమెంట్--2025 గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లోని బంజారా హిల్స్, బీజేఆర్ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, పాల్గొన్న విద్యార్థులను భవిష్యత్ నాయకులు, రాయబారులు అని అభివర్ణించారు. పార్లమెంట్ మరియు రాష్ట్ర శాసనసభలు దేశం మరియు రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థలని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అనుభవాత్మక విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు రూపొందించిన వైట్ పేపర్ను ఆయన భవిష్యత్తు కోసం ప్రస్తుత తరగతి ఆశలు ప్రతిబింబించే ఆకాంక్ష పత్రంగా అభివర్ణించారు. ఈ వైట్ పేపర్‌లో సమకాలీన పరిపాలన, అభివృద్ధి అంశాలు ప్రతిబింబించాయని, బాలికల విశేష భాగస్వామ్యం ప్రశంసనీయం అని అన్నారు. మహిళా సాధికారత భారతదేశంలో నిశ్శబ్దమైన విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పుగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయాల నాణ్యతను మెరుగుపరచడానికి యువత పాల్గొనడం అత్యవసరమని అన్నారు. విద్యార్థి రాజకీయాల నుండి ప్రజా జీవితానికి తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, చదువుకున్న, అవగాహన కలిగిన యువత ప్రజాస్వామ్య సంస్థలతో అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్, మాక్ అసెంబ్లీ, మోడల్ యునైటెడ్ నేషన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు శాసనసభల పనితీరు, ప్రజా విధానం, పరిపాలనపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తాయని, బాధ్యతాయుతమైన భవిష్యత్ నాయకత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

- కాంగ్రెస్ బిఆర్ఎస్ వైఖరి ఒకటే
- మున్సిపాలిటీలలో గత ప్రభుత్వం చేపట్టిన విధంగానే కాంగ్రెస్ చేస్తోంది
- కాంగ్రెస్ హయాలో దొంగతనాలు డ్రగ్స్ మాఫియా యధావిధిగా కొనసాగుతోంది
- మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలపై రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు దిశా నిర్దేశం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో 116 మున్సిపాలిటీస్ మరియు 6 మున్సిపల్ కార్పొరేషన్స్‌లో, 2996 వార్డ్స్, డివిజన్లలో భారతీయ జనతా పార్టీ వందశాతం అన్ని స్థానాల్లో పోటీకి నామినేషన్లు సమర్పించారు. అందుకు సంబంధించి అభ్యర్థులకు బీ-ఫారమ్ పంపించడం జరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడారు. గత ఎన్నికల్లో (ఎంపీ, ఎమ్మెల్సీ, సర్పంచ్) తెలంగాణ ప్రజలు బిజెపి పట్ల చూపిన విశ్వాసాన్ని గమనించి, ప్రతి స్థానంలో పోటీ చేస్తున్నాం. మా అభ్యర్థులు అన్ని బ్యాలెట్ పేపర్స్‌లో బిజెపి సింబల్‌తో పోటీలో నిలుస్తారు. బీఆర్ఎస్ తో పార్టీలు కాంగ్రెస్ పార్టీలు ఒకే దారిలో వెళ్ళి, గతంలో చేసిన స్కామ్స్‌ను కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీస్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన లే అవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా లక్షలాది ప్రజలను బాధపడే పరిస్థితిలో పెట్టిందన్నారు. చిన్న ప్లాట్ కోసం 1,000 రూపాయలు, పెద్ద ప్లాట్ కోసం 10,000 రూపాయలు ఫీజు వసూలు చేశారు. దాదాపు 25.67 లక్షల అప్లికేషన్లు వచ్చినప్పటికీ, ప్రభుత్వానికి మొత్తం 250 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. కానీ, ప్రజలకు అందిన లాభం కేవలం 10% మాత్రమే అని అన్నారు. ఫీజులు వసూలు చేసినప్పటికీ, న్యాయపరమైన సమస్యలు బకాయిల కారణంగా స్కీమ్ నిలిపివేయబడిందన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 20% మాత్రమే ఫీజులు ప్రభుత్వానికి సమర్పించబడేలా చేసిందన్నారు. ఇప్పటికీ ల్యాండ్ రెగ్యులేషన్ అమలు కాలేదు, ఫలితంగా లక్షలాది ప్రజలు అన్యాయంగా ఎదురుచూస్తున్నారు. ఈ 15 రోజుల్లో రెగ్యులేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రజలకు న్యాయం చేయాలని, ఫీజులు వసూలు అయినప్పటికీ అమలు కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రూపాయల ఫీజుతో పేద ప్రజలను లక్ష్యంగా తీసుకొని, లే అవుట్ రెగ్యులేషన్ స్కీమ్ ద్వారా మోసం చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. గతంలో చేసిన లూటీ పద్దతినే కొనసాగిస్తున్నాయన్నారు. అప్లికేషన్లు పెండింగ్ కు సంబంధించి 20 లక్షల పైగా ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు ఇంకా డిస్పోజ్ కాలేదు. హెచ్ఎండీఏలో 3.6 లక్షల అప్లికేషన్లలో కేవలం 8000కి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, పెద్ద అంబర్ పేట వంటి ప్రాంతాల్లో అప్లికేషన్లతో పోల్చితే, ప్రొసీడింగ్స్ ఇచ్చిన సంఖ్య చాలా తక్కువ. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. తెలంగాణ మొత్తం మున్సిపాలిటీస్‌లో పరిపాలన సరిగ్గా లేదన్నారు. ఫైరింగ్, రేప్స్, డ్రగ్స్, దొంగతనాలు వంటి సంఘటనలు ప్రతి రోజూ చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రజలకు, చిన్న అర్బన్ మరియు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు సరియైన రీతిలో అందడం లేదన్నారు. మున్సిపాలిటీస్ కేంద్ర ప్రభుత్వ నిధులు మరియు పథకాలపై ఆధారపడి నడుస్తున్నాయి, కరెంటు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో విఫలమై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మొత్తం మున్సిపాలిటీస్‌లో పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఫైరింగ్, రేప్స్, డ్రగ్స్, దొంగతనాలు వంటి సంఘటనలు ప్రతి రోజూ చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రజలకు, చిన్న అర్బన్ మరియు గ్రామీణ ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు సరైన రీతిలో అందడం లేదన్నారు. మున్సిపాలిటీలు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులు, పథకాలపై మాత్రమే ఆధారపడి నడుస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, సీనియర్ నాయకులు ఆంటోని, తదితరులు పాల్గొన్నారు.

# పాండిచ్చేరి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అక్కడ ప్రచారం నిర్వహించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పుదుచ్చేరి రాష్ట్ర క్యాపిటల్ సిటీ పాండిచ్చేరికి చేరుకున్నారు. పాండిచ్చేరి విమానాశ్రయంలో పిసిసి అధ్యక్షుడు ప్రస్తుత ఎంపీ వైద్య లింగం, మాజీ మంత్రి కందస్వామి, సీఎల్పీ నేత స్వామినాథం ఘన స్వాగతం పలికారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొత్తం 23 నియోజకవర్గాల్లో పాదయాత్ర జరుగుతుంది. ఈ పాదయాత్ర ప్రస్తుతం శనివారానికి 21వ నియోజకవర్గమైన ఏం బులం కు చేరుకుంది. శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం పాదయాత్రలో పాల్గొని అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టివేత

## రూ.9.5 కోట్ల విలువైన 27 కిలోల గంజాయి సీజ్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. రూ.9.5 కోట్ల విలువైన 27 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల బ్యాగులో గుర్తించారు. ఏడుగురిని డీఆర్ఐ అధికారులు అరెస్ట్ చేశారు. కాగా, నిన్న శంషాబాద్ విమానాశ్రయంలో విదేశీ గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్న సంగతి తెలిసిందే. బ్యాంకాక్ నుంచి వచ్చిన నలుగురు ప్రయాణికుల వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వీరి నుంచి గంజాయి తీసుకునేందుకు వచ్చిన మరో ముగ్గురి అరెస్టు చేశారు. హైడ్రోపోనిక్ గంజాయి అనేది మట్టి లేకుండా ప్రత్యేక ప్రయోగశాలల్లో పెంచే గంజాయి రకం. ద్రవరూప పోషకాలు నేరుగా మొక్కల వేళ్లకు అందిస్తారు. కృత్రిమ ఉష్ణోగ్రత, వెలుతురు నియంత్రణతో మొక్కలు వేగంగా పెరుగుతాయి. ఇది సాధారణ గంజాయితో పోలిస్తే మత్తు శాతం ఎక్కువగా ఉంటుంది. ఇందులో ఉండే (టెట్రాహైడ్రోకెన్నబినోల్) శాతం ఎక్కువగా ఉండటంతో, ఇది కొకైన్‌తో సమానమైన మత్తు కలిగిస్తుంది.హైడ్రోపోనిక్ గంజాయి విదేశాల నుంచి.. ప్రధానంగా థాయ్‌లాండ్ నుంచి అక్రమంగా భారత్‌కు రవాణా అవుతుంటుంది.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి

## నివాళులు అర్పించిన మంత్రి పొన్నం

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రజా యుద్ధ నౌక ,ప్రముఖ విప్లవ కవి గాయకుడు గద్దర్ గారి 78 వ జయంతి సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారికి ఘన నివాళులు అర్పించారు.గద్దర్ తన పాటల ద్వారా పీడిత ప్రజల హక్కుల కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు పోరాడారని తన విప్లవాత్మక గళంతో ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పర్చారని గుర్తు చేసుకున్నారు. గద్దర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన ఆలోచనలు, ఆయన పాటలు, ఆయన ఆశయాలు ఇప్పటికీ మన మధ్య సజీవంగానే ఉన్నాయని , సామాజిక న్యాయం కోసం, సమానత్వం కోసం, మానవ గౌరవం కోసం సాగే ప్రతి పోరాటంలో గద్దర్ గారి ఆత్మ కనిపిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గద్దర్ గారి ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం కవులు ,కళాకారులకు గద్దర్ పేరిట అవార్డులు ఇచ్చి సత్కరిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# భక్తులకు రవాణా ఏర్పాట్లు భేష్

- గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ కృషి
- రవాణా శాఖ మంత్రి పొన్నం

తెలంగాణ బ్యూరోప్రతినిధిః మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు లక్షలాదిగా అమ్మవార్లను దర్శనం చేసుకొని తిరిగి గమ్యస్థానాలకు వెళ్తున్న భక్తులకు ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను తరలించడానికి ఆర్టీసీ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని ,ఆర్టీసీ ఎండీ నుండి అధికారులు కింది స్థాయి సిబంది సైతం క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.మేడారంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడం ఆర్టీసీ బస్ స్టేషన్ లో అధిక రద్దీ కారణంగా క్యూలైన్ లలో ప్రయాణికులు ఇబ్బందులపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి సీతక్క తో పాటు డీజీపీ,ఆర్టీసీ ఎండీ ,జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీ తో మాట్లాడారు.. ప్రస్తుతం మేడారంలో ఉన్న పరిస్తితి పై అడిగి తెలుసుకున్నారు.మేడారం లో అమ్మవారి దర్శనం చేసుకొని వెళ్తున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులను మేడారం తీసుకొస్తున్న బస్సులు కొద్దిసేపు ట్రాఫిక్ లో ఇరుక్కుపోవడం వల్ల మేడారం బస్ స్టేషన్ లో గమ్యస్థానాలకు వెళ్ళే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయని వెంటనే క్లియర్ చేస్తున్నారని ప్రత్యేక బస్సులు ఎప్పటికప్పుడు నడిపిస్తున్నామని పేర్కొన్నారు.పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ చేస్తూ వాహనాల వేగాన్ని పెంచాలని సూచించారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

# కోఠి ఎస్‌బీఐ వద్ద కాల్పుల కలకలం

- రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లిన దుండగులు
- నిందితుల కోసం 5 బృందాలతో గాలింపు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ నగరంలో కాల్పుల ఘటన శనివారం నాడు కలకలం రేపింది. కోఠి బ్యాంక్ స్ట్రీట్లో ఎస్ బీ ఐ ప్రధాన కార్యాలయం వద్ద ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం ఏడు గంటలకు ఏటీఎంలో డబ్బులను జమ చేసేందుకు రిషద్ అనే ఓ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలోనే అతడిని దుండగులు వెంబడించి కాల్పులకు పాల్పడ్డారు. రిషద్ వద్ద ఉన్న రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనలో బాధితుడు రిషద్ కాలికి బుల్లెట్ గాయమైంది. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బైక్పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి డబ్బును ఎత్తుకెళ్లినట్లుగా వెల్లడించారు. బాధితుడు రిషద్ను నాంపల్లిలోని వస్త్ర వ్యాపారిగా గుర్తించారు.

**నిందితుల కోసం 5 బృందాలతో గాలింపు :** ఘటనా స్థలంలో లభించిన సీసీటీవీ ఫుటేజీలను సుల్తాన్బజార్ పోలీసులు పరిశీలించారు. ఘటనా స్థలంలో లభించిన రెండు బుల్లెట్ షెల్స్ను స్వాధీనం చేసుకున్నారు. కోఠిలోని కాల్పుల ఘటనతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఇప్పటికే ప్రాథమిక వివరాలను సేకరించినట్లుగా వెల్లడించారు.

డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ "ఉదయం 6.630 నుంచి ఏడు గంటల మధ్య ఈ ఘటన జరిగినట్లుగా మాకు సమాచారం అందింది. కాల్పులు జరిగిన వెంటనే అప్రమత్తమయ్యాం. నిందితుల కోసం ఐదు బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నాం. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ విధంగా జరగడం దురదృష్టకరం. నిందితులు తప్పించుకోలేరు" అని అన్నారు.

**పోలీసులను దారిమళ్లించేందుకు యత్నం :** కాల్పుల వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. దొంగలను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఘటన జరిగిన అనంతరం పోలీసులను దారి మళ్లించేందుకు దుండగులు కోఠి నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్లోకి వెళ్లినట్లు నటించి తిరిగి బయటకు వచ్చి ఆటో ఎక్కి సికింద్రాబాద్ వెళ్లినట్లుగా తెలిసింది. పోలీసులు ఆ ఆటోడ్రైవర్ను విచారించారు. నిందితులు తనకు రూ.60 ఇచ్చారని ఆటో డ్రైవర్ తెలిపాడు. వారి మాటల ఆధారంగా దిల్లీకి చెందిన వారిగా డ్రైవర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు పాల్పడే ముందు దుండగులు బస్టాప్లో ఫోన్లో మాట్లాడారు. ఆ నెట్వర్క్ ఆధారంగా గాలింపు వేగవంతం చేశారు.

# స్టేటస్ కోను ధిక్కరించి భూమికి పేరు పెట్టే యత్నం

- హైకోర్టు ఆదేశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అవహేళన
- బీఆర్ఎస్ పార్టీ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట్ పరిధిలోని సై నెం.563/1లో ఉన్న తనకు చెందిన 7 ఎకరాల భూమిపై గౌరవనీయ హైకోర్టు స్పష్టమైన స్టేటస్ క్వో ఉత్తర్వులు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని వాటిని ఉల్లంఘిస్తూ అక్రమ చర్యలకు పాల్పడుతోందని భూమి యజమాని, వాది అయిన ఏడ్ల సుధాకర్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఈ భూమి ఓఎస్ నెం.15 యొక్క 2025లో దావా షెడ్యూల్ భూమిగా ఉందని, అలాగే సిఎంఎ 175 శీట 2025, సిఎంఎ 2060 యొక్క 2025 కేసుల్లో కోర్టు ధిక్కార వ్యవహారాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తాను చట్టబద్ధమైన యజమానిగా స్వాధీనంలో ఉన్నప్పటికీ, 12-06-2025న హైకోర్టు జారీ చేసిన స్టేటస్ క్వో మధ్యంతర ఉత్తర్వులను విస్మరించి, హైడ్రా సంస్థ కృత్రిమ చెరువు తవ్వకాలు చేపట్టి దానికి "బతుకమ్మకుంట" అని పేరు పెట్టిందన్నారు. ఈ వ్యవహారంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై హైకోర్టులో కంటెంప్ట్ కేసు కూడా నమోదై, ఆయన స్వయంగా కోర్టుకు హాజరై బేషరతుగా క్షమాపణలు చెప్పిన విషయం ప్రజలకు తెలిసిందేనని గుర్తు చేశారు. ఈ విషయం పూర్తిగా సబ్-జుడీస్లో ఉండగానే, తాజాగా 29-01-2026న జరిగిన జిహెచ్ఎంసీ 11వ జనరల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆ భూమికి "వి. హనుమంతరావు బతుకమ్మకుంట" అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ చర్యలపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తన సివిల్ దావాలో జిహెచ్ఎంసి ఇప్పటివరకు యాజమాన్య హక్కులపై ఎలాంటి కౌంటర్ దాఖలు చేయలేదని, హైకోర్టులో అప్పీల్ కూడా వేయలేదని, అలాంటప్పుడు స్టేటస్ క్వో ఉత్తర్వులు ఉన్న భూమిని స్టాండింగ్ కమిటీ అజెండాలో ఎలా చేర్చారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక హైడ్రా సంస్థ కృత్రిమ చెరువు, పార్క్ అభివృద్ధి పేరుతో అక్రమంగా జోక్యం చేసుకుంటూ, కోర్టు ధిక్కార కేసులు ఎదుర్కొంటున్న సమయంలో జిహెచ్ఎంసి ఈ భూమికి పేరు పెట్టే అధికారం ఎలా తీసుకుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే న్యాయవ్యవస్థ ఆదేశాలను ఉల్లంఘిస్తూ, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ప్రైవేట్ ఆస్తులను లాక్కొనే ప్రయత్నం చేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. 2014 అంబర్‌పేట్ అసెంబ్లీ ఎన్నికల్లో తన వెనుక నాలుగో స్థానంలో నిలిచి ఓడిపోయిన వి. హనుమంతరావు రాజకీయ ప్రతీకారంతోనే ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఈ అనాగరిక పాలనను తీవ్రంగా ఖండిస్తున్నామని, చివరికి న్యాయం గౌరవనీయ హైకోర్టు ద్వారానే లభిస్తుందనే పూర్తి విశ్వాసం ఉందని ఏడ్ల సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# బీసీలకు బీఫామ్‌లు ఇవ్వకపోతే మూడు పార్టీలకు మూడినట్టే

- మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు ఏ రాజకీయ పార్టీ ఎన్ని టికెట్లు ఇస్తుందో స్పష్టంగా ప్రకటించాలి
- బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించని పార్టీలు బీసీ ద్రోహులు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్ లు, కార్పొరేటర్లుగా కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి లు మూడు పార్టీలు బీసీలకు బీఫామ్ ఇవ్వకపోతే ఆ పార్టీలకు ముడినట్టేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేడు తీవ్రంగా హెచ్చరించారు. శనివారం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో లోని ఆర్ట్స్ కాలేజీ వద్ద బీసీ సామాజిక వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కాంపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా మున్సిపల్ ఎన్నికలకు వెళ్తుంటే ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్ష టిఆర్ఎస్ , బిజెపి పార్టీలు కూడా ఎన్నికలకు సై అంటున్నాయని, పార్టీల పరంగానైనా బీసీలకు జనాభా దామరస్ ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పిస్తామని ఏ పార్టీ కూడా ప్రకటించకపోవడం చాలా సిగ్గుచేటు అన్నారు. జనరల్ స్థానాలలో ఇప్పటికే నామినేషన్ వేసిన బీసీలకు బీఫాం లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులవి మాత్రమే కావని జనరల్ స్థానాలలో బీసీలకు అవకాశం కల్పిస్తేనే జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా దక్కుతుందని ఆయన తెలిపారు. బీసీలను రాజకీయంగా అణిచి వేయడానికి అగ్రకుల రాజకీయ పార్టీలు సర్వేల పేరుతో బీఫామ్ లు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నాయని, సర్వేల పేరుతో బీసీలకు టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తే కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పిస్తామని ప్రధాన రాజకీయ పార్టీలు స్పష్టమైన తమ విధాన నిర్ణయాన్ని ప్రకటించాలని, లేనిపక్షంలో బీసీ ద్రోహుల పార్టీలుగా చరిత్రలో మిగిలిపోతారని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

ఈ సందర్భంగా బీసీ సామాజిక వేదిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓయు ప్రొఫెసర్లు కొండా నాగేశ్వర్, చలమల్ల వెంకటేశ్వర్లు డాక్టర్ పరంధాములు బీసీ విద్యార్థి సంఘాల నాయకులు డాక్టర్ వట్టికుటి రామారావుగౌడ్, డాకర్ సాంబశివగౌడ్, నిజ్జన రమేష్ ముదిరాజ్, జాజుల లింగంగౌడ్, స్వామిగౌడ్,నాగేశ్వరరావు, ఆర్ ఎల్.మూర్తి, సైదులు యాదవ్, దునుకు వేలాద్రి, డాక్టర్ జీవన్ మరియు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.




**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఆ తర్వాత ప్రసంగిస్తారు. అదే సమయంలో రాజ్యసభలో కూడా బడ్జెట్‌ని ప్రవేశపెడతారు. నిర్మలా సీతారామన్‌కి ఇది వరుసగా తొమ్మిదవ బడ్జెట్. ఆమె ఈ సంవత్సరం.. ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై అనేక అంచనాలు సామాన్యులలో ఉన్నాయి. కొత్త సంక్షేమంతో పాటు తమ జీవితాలకు ఈ బడ్జెట్ భరోసా కల్పిస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. అటు వాణిజ్యవ్యాపార వర్గాలు సైతం తమకు భారీ రాయితీ లు, ప్రోత్సాహకాలు ఉంటాయని భావిస్తుంటే , మధ్యతరగతి జనం మాత్రం తమకు భారీ ఊరట అందే ఆస్కారం ఉందని భావిస్తోంది. దేశం యావత్తు ఈ సారి బడ్జెట్ లో నిర్మలమ్మ చేయనున్న ప్రకటనలపై ఆసక్తిగా చూస్తోందన్నది**

*ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ జరుగుతుందని ప్రభుత్వ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఆదివారం ఎక్కువ మంది ఇంట్లో ఉంటారు కాబట్టి, బడ్జెట్‌ను వీక్షించి, పథకాలు, ప్రభావంపై అవగాహన పెంచుకుంటారని వారి అభిప్రాయం. గతంలోనూ ఫిబ్రవరి 1న బడ్జెట్ వచ్చింది; 2025లో ఆ రోజు శనివారం వచ్చింది. ఒక వర్గం ప్రనతినిధులు అందిస్తున్న వివరాల ప్రకారం, ఆ రోజు ఎక్కువ మంది ఇంట్లో ఉంటారు కాబట్టి, వారు తమ కోసం ఏమిటో, అది వారి జేబులపై ఎలా ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికి ఎక్కువ మంది ప్రజలు వీక్షిస్తారు. మిగిలిన రోజుల్లో కార్యాలయాలకు, పనులకు వెళ్లే తొందర ఉంటుంది, అని అని తెలుస్తోంది.*

**ద్రౌపది ముర్ము ప్రసంగంతో**

బడ్జెట్ సమావేశాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమై, ఆర్థిక సర్వేతో కొనసాగుతాయి. రాష్ట్రపతి భాగస్వామ్యంతో ఇది పనిదినాల వారాంతంగా మారనుంది. తుది తేదీలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయం వెలువడాల్సి ఉంది. బడ్జెట్‌కు ముందు జరిగే సంప్రదింపులు కొనసాగుతున్నాయి. రాబోయే బడ్జెట్‌లో తయారీ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇది దేశ ఆర్థిక పురోగతికి కీలకం కానుందని అంచనా. సమ్మిళిత బడ్జెట్ కోసం ప్రభుత్వం పౌరుల నుండి సలహాలను ఆహ్వానించింది. మై గోవ్ చొరవ కింద, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఆలోచనలను పంచుకోవాలని సోషల్ మీడియా ద్వారా కోరింది. కాగా, గత సమావేశంలో, ప్రధాని నరేంద్ర మోడీ ఎన్‌డిఎ ఎంపీలను తమ నియోజకవర్గాల నుండి బడ్జెట్ సూచనలు సేకరించి అందజేయాలని కోరారు. బలమైన భారత్ నిర్మాణం లక్ష్యంగా ఈ సూచనలు దోహదపడతాయని ఆయన ఉద్ఘాటించారు.




**పన్ను ప్రోత్సాహకాల పునరుద్ధరణ :**

తయారీ రంగాన్ని బలోపేతం చేసేందుకు గతంలో ఉన్న తక్కువ పన్ను రేటు విధానాన్ని మళ్లీ తీసుకురావాలని 34 శాతం మంది కోరుతుండగా, దాదాపు 50 శాతం మంది నిర్దిష్ట రంగాల వారీగా ప్రత్యేక పన్ను ప్రోత్సాహకాలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

**కొత్త ఐటీ చట్టం – సరళీకరణ**

కొత్త చట్టం దిశగా అడుగులు పడుతున్నా కొన్ని అంశాల్లో మరింత స్పష్టత, సరళీకరణ అవసరమని సర్వే నొక్కి చెప్పింది. అందులో.. టీడీఎస్/టీసీఎస్ నిబంధనల అమలులో సరళత. క్యాపిటల్ గెయిన్స్ పన్ను విధానంలో మార్పులు. లిటిగేషన్ (న్యాయపరమైన వివాదాలు), అసెస్‌మెంట్ ప్రక్రియలో వేగం అవసరమనే అభిప్రాయాలున్నాయి.

**అంచనాలు, డిమాండ్లు**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు (ఫిబ్రవరి 1, 2026 –ఆదివారం) ఉదయం 11 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇది ఆమెకు 9వ బడ్జెట్. ఆదివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లు ఆ రోజు పనిచేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌ను పెంచడానికి కీలక పథకాలకు కేటాయింపులను రెండంకెల వృద్ధి దిశగా పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**స్టాండర్డ్ డిడక్షన్**

మధ్యతరగతి, వేతన జీవులకు ఊరటనిచ్చేలా బడ్జెట్‌లో స్టాండర్డ్ డిడక్షన్ప రిమితిని గణనీయంగా పెంచాలని 73 శాతం మంది కోరుతున్నారు.

**జీఎస్టీ, ఇతర సంస్కరణలు**

జీఎస్టీ 'ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'లో ఉన్న లోపాల వల్ల క్రెడిట్ నోట్ల మిస్‌మ్యాచ్‌లు పెరుగుతున్నాయని, వీటిని సరిదిద్దాలని 82 శాతం మంది కోరుతున్నారు. ప్రస్తుత డిస్ప్యూట్ రిజల్యూషన్ ప్యానెల్ వివాదాలను వేగంగా పరిష్కరించడంలో విఫలమవుతోందని సగం మంది ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ల కోసం దీర్ఘకాలిక నిబంధనలు కావాలని 51 శాతం మంది కోరారు.

**యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్..**

బడ్జెట్ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ ఫైనాన్స్ బిల్లు మొదలైన వాటితో సహా అన్ని కేంద్ర బడ్జెట్ పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీని కోసం పార్లమెంటు సభ్యులు (లు), సాధారణ ప్రజలు డిజిటల్‌గా అందుబాటులో ఉండే రీతిలో బడ్జెట్ పత్రాలను సులభంగా యాక్సెస్ చేయవచ్చు.

**చరిత్ర సృష్టించనున్న నిర్మలా సీతారామన్..**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న వరుసగా తొమ్మిదవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి కొత్త చరిత్ర లిఖించబోతున్నారు. మొత్తంగా అత్యధిక బడ్జెట్స్ ప్రవేశపెట్టిన మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్(10 బడ్జెట్‌ల) రికార్డుకు సీతారామన్ చేరువ అవుతారు. 1959-1964లో ఆర్థిక మంత్రిగా దేశాయ్ మొత్తం 6 బడ్జెట్‌లను, 1967-1969 మధ్య 4 బడ్జెట్‌లను సమర్పించారు.

**.వారాంతాలలో**

వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్త విషయమేమీ కాదు. 2025లోనూ శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతంలో.. అరుణ్ జైట్లీ ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు 2015లో శనివారం, 2016లో ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2020లో కోవిడ్ సమయంలో.. అలాగే 2012 మే 13వ తేదీన 60వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పార్లమెంట్ సమావేశమైంది కూడా. దీంతో ఈసారి కూడా ఆదివారమే బడ్జెట్ ప్రవేశపెట్టే అస్కారం లేకపోలేదు.

**ఫిబ్రవరి 1నే ఎందుకంటే.**

1999 వరకు, కేంద్ర బడ్జెట్‌ను సాంప్రదాయకంగా ఫిబ్రవరి చివరి పని దినాన సాయంత్రం 5 గంటలకు ప్రకటించేవారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని మార్చింది. అప్పుడు ఆర్థిక మంత్రిగా ఉన్న యశ్వంత్ సిన్హా ఉదయం 11 గంటలకు బడ్జెని ప్రవేశపెట్టి.. కొత్త చరిత్ర ప్రారంభించారు. 2017 ఏడాదికి ముందు బడ్జెట్ ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టబడేది. అయితే.. బడ్జెట్ ప్రవేశపెట్టాక మొదటి త్రైమాసిక ఖర్చుల కోసం 'వోట్ ఆన్ అకౌంట్' ఆమోదం తీసుకోవాల్సి వచ్చేది. తర్వాత విభాగాల వారీగా డిమాండ్లను పరిశీలించి పూర్తి బడ్జెట్ ఆమోదించబడేది. ఈ ఆలస్యాన్ని నివారించేందుకు 2017లో అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీంతో ఏప్రిల్ 1న కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ముందు పార్లమెంట్ బడ్జెట్‌ను ఆమోదించే అవకాశం లభించింది.

**భాషకూ ప్రాధాన్యం**

బడ్జెట్ పరిణామంలో భాష కూడా పాత్ర పోషించింది. 1955 వరకు, కేంద్ర బడ్జెట్‌ను ఆంగ్లంలో మాత్రమే సమర్పించేవారు. ఆ సంవత్సరం, కాంగ్రెస్ ప్రభుత్వం హిందీ, ఆంగ్లంలో పత్రాలను ముద్రించాలని నిర్ణయించింది, తద్వారా వాటిని ఎక్కువ మంది ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చింది.

**వెంకటేశ్వర దాస్, సూర్య కల్చరల్ రిపోర్టర్,**
**విశాఖపట్నం - 99892 65111**

## రంగాల వారీగా అంచనాలు

**స్టార్టప్ & డీప్-టెక్ :**
కేవలం నిధులు ఇవ్వడమే కాకుండా, కొత్త టెక్నాలజీలను దేశీయంగా వినియోగించుకునేలా ) విధానాలు ఉండాలని స్టార్టప్ రంగం కోరుతోంది.

**బ్యాంకింగ్ & ఎన్బీఎఫ్సీ :**
సంస్కరణ: ఎన్బీఎఫ్సీల కోసం కనీస రుణ పరిమితిని 20 లక్షల నుంచి 1 లక్షకు తగ్గించాలని కోరుతున్నారు. దీనివల్ల చిన్న రుణాల రికవరీ సులభమవుతుంది.
రిటైల్ క్రెడిట్ & ఎంఎస్ఎంఈలకు రుణ పరపతి పెంచే చర్యలు అవసరమని నిపుణులు చెబుతున్నారు.

**ఆటోమొబైల్ & తయారీ రంగం:**
జీఎస్టీ హేతుబద్ధీకరణ తర్వాత, ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (వ్యాపార నిర్వహణ సులభతరం) పై దృష్టి పెట్టాలని, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించాలని జేకే టైర్ వంటి సంస్థలు కోరుతున్నాయి.

**విద్య & నైపుణ్యం :**
విద్యార్థుల నమోదు సంఖ్య కంటే, అభ్యసన ఫలితాల పై బడ్జెట్ దృష్టి సారించాలని, ఉపాధ్యాయ శిక్షణకు నిధులు పెంచాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**వైద్యం & బీమా :**
మెడికల్ టూరిజం: మెడికల్ వీసా ప్రక్రియను సరళతరం చేయాలని వాదం హెల్త్ కోరుతోంది.
**బీమా:** మధ్యతరగతి ప్రజలకు బీమా అందుబాటులోకి రావాలంటే పన్ను మినహాయింపులు ఇవ్వాలని, తక్కువ విలువ గల పాలసీలపై స్టాంప్ డ్యూటీ తొలగించాలని బీమా రంగం కోరుతోంది.

**పాడి & ఆహార శుద్ధి :**
ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్ & పశుగ్రాసంపై జీఎస్టీని తగ్గించాలని, మౌలిక సదుపాయాల కోసం రాయితీలు ఇవ్వాలని మిల్క్ మిస్ట్ వంటి సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి.

**రియల్ ఎస్టేట్ :**
పెరుగుతున్న వృద్ధుల జనాభాను దృష్టిలో ఉంచుకుని సీనియర్ లివింగ్ (వృద్ధాశ్రమాలు/నివాసాలు) ను ప్రత్యేక విభాగంగా గుర్తించి, డెవలపర్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరుతున్నారు.

**పునరుత్పాదక ఇంధనం**
బయో గ్యాస్ & కంప్రెస్డ్ బయో గ్యాస్రం గాలకు ఇచ్చే ప్రోత్సాహకాలను () కనీసం 6 కోట్లకు పెంచాలని ఇండియన్ బయోగ్యాస్ అసోసియేషన్ కోరుతోంది.

**రక్షణ రంగం :**
కేవలం సామర్థ్యాన్ని పెంచుకోవడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేలా & తయారీ వ్యయాన్ని తగ్గించేలా దీర్ఘకాలిక విధానాలు ఉండాలని డిఫెన్స్ స్టార్టప్‌లు కోరుతున్నాయి.
వ్యాపార వర్గాలు పన్ను ఉపశమనాన్ని ఆశిస్తుండగా, సామాన్యులు ఆరోగ్య సంరక్షణ & బీమా చౌకగా లభించాలని కోరుకుంటున్నారు. నిర్మలా సీతారామన్ వికసిత్ భారత్ లక్ష్యంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ఏపీకి వరాల జల్లు

కేంద్ర బడ్జెట్ లో ఏపీకి వరాలు ఉండనున్నాయని తెలుస్తోంది. రాజధాని నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టులు, ప్రాంతీయ అసమానతల తొలగింపు నుంచి పరిశ్రమల అభివృద్ధి వరకుప్రతి రంగంలోనూ రాష్ట్రానికి భారీ పెట్టుబడులు అవసరమవుతున్నాయి. అభివృద్ధి వేగం పెంచాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం తప్పనిసరి అనే స్థాయికి పరిస్థితి చేరుకుంది. ఈ నేపథ్యంలో 202627 కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అవసరాలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన డిమాండ్లతో కేంద్రాన్ని ఆశ్రయించింది.

**రాజధాని అమరావతికి నిధులు. :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిమాండ్ అమరావతి రాజధాని నిర్మాణమే. ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిన రూ.15 వేల కోట్లకు అదనంగా రెండో విడత గ్రాంట్లు కేటాయించి రాజధాని నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరింది. పరిపాలనా కేంద్రంగా అమరావతి పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటే రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆర్థిక శాఖ వివరించింది.

**పోలవరం నల్లమల సాగర్ లింక్ :** సాగునీటి రంగంలో కీలకమైన పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం అందించాలని రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నదుల



అనుసంధాన ప్రాజెక్టులకు కేంద్రం రూ.40 వేల కోట్ల వరకు నిధులు కేటాయించిన నేపథ్యంలో, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు కూడా మద్దతు ఇవ్వాలని కోరింది. ఈ ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాలు తీరతాయని వివరించింది.

**కేంద్ర పన్నుల వాటా పెంచాలని. :** ఏప్రిల్ 1 నుంచి 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి రానున్న నేపథ్యంలో, రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటాను పెంచాలని కేంద్రాన్ని కోరింది. ప్రత్యేకంగా ఆర్థికంగావెనుకబడిన రాష్ట్రాలకు ఎక్కువ వాటా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేసింది.

**సాస్కి సాక్షిగా. :** రాష్ట్రాల్లో మూలధన పెట్టుబడులకు సహాయంగా అమలులో ఉన్న పథకాన్ని కొనసాగిస్తూ, 202627లో కేటాయింపులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించింది. మౌలిక సదు-పాయాల అభివృద్ధికి ఈ పథకం ఎంతో ఉపయోగకరమని కేంద్రానికి వివరించింది.

**రాయలసీమలో పూర్వోదయా. :** పూర్వోదయ పథకాన్ని విద్య, వైద్యం, వ్యవసాయం, జీవనోపాధి రంగాలపై కేంద్రీకరించాలని సూచించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా విధాన మార్పులు చేసుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఇవ్వాలని కోరింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 46(2), 46(3) ప్రకారం రాయలసీమకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. మూడు సంవత్సరాల్లో రూ.41 వేల కోట్ల వ్యయంతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికను కేంద్రం ముందు ఉంచింది. ఈ ప్రణాళికతో రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని వివరించింది.

**విశాఖ ఎకనామిక్ జోన్ కోసం :** విశాఖ ఆర్థిక ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధికి 202627లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్రం కోరింది. ప్రభుత్వప్రైవేట్ పెట్టుబడుల సమన్వయంతో 2032 నాటికి ఈ ప్రాంత జీడీపీని 125 బిలియన్లకు పెంచే లక్ష్యంతో ఈ ప్రతిపాదన రూపొందించామని ఆర్థిక శాఖ తెలిపింది. మొత్తంగా చూస్తే రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అనుకూల నిర్ణయాలు తీసుకుంటేనే రాష్ట్ర అభివృద్ధి గాడిలో పడుతుందనే స్పష్టమైన సందేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. తాము పంపిన ప్రతిపాదనలని నెరవేర్చుకునే దిశగా రాష్ట్ర లాబీయింగ్ కూడా చేసింది

# 5 మ్యాచ్‌లు, 46 పరుగులు..

**సొంత గ్రౌండ్‌లోనూ అట్టర్ ఫ్లాప్.. టీ20 ప్రపంచకప్ నుంచి శాంసన్ ఔట్..?**



భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా నేడు చివరి మ్యాచ్ తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్ సంజు సామ్సన్‌కు ప్రత్యేకమైనది. ఎందుకంటే, ఇది అతని సొంత మైదానంలో మొదటి అంతర్జాతీయ మ్యాచ్. కేరళ అభిమానులు తమ హీరోని చూడటానికి ఉత్సాహంగా వచ్చారు. కానీ సంజు ఆ సందర్భాన్ని చిరస్మరణీయంగా మార్చలేకపోయాడు. అయితే అతను అవుట్ అయిన తర్వాత, స్టేడియంలో అందరి హృదయాలను గెలుచుకున్న ఒక దృశ్యం ఆవిష్కృతమైంది.

**సంజు ఔట్ అయినప్పుడు చప్పట్లు ఎందుకు వచ్చాయంటే?** ఇన్నింగ్స్ ప్రారంభించిన సంజు సామ్సన్ 6 బంతుల్లో 6 పరుగులు చేసి, కేవలం ఒక ఫోర్ మాత్రమే కొట్టి ఔటయ్యాడు. అతను పెవిలియన్ నుంచి బయటకు వెళ్లగానే స్టేడియం నిశ్శబ్దంగా మారింది. కానీ అభిమానులు స్టాండింగ్ ఒవేషన్ తో అతనికి చప్పట్లు కొట్టారు. అభిమానులు తమ స్థానిక కుర్రాడిని ఉత్సాహపరిచారు. అతను అందరి హృదయాలను గెలుచుకున్నాడు. అయితే, ఈ ప్రదర్శన సంజు స్థిరమైన పేలవమైన ఫామ్‌ను మరింత హైలైట్ చేసింది.

**వరుసగా 5 మ్యాచ్‌ల్లో పరాజయం..** ఈ సిరీస్ అంతటా సంజు ప్రదర్శన చాలా నిరాశపరిచింది. అతను 5 ఇన్నింగ్స్‌లలో కేవలం 46 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో 10 పరుగులు, రెండవ మ్యాచ్‌లో 6 పరుగులు, మూడవ మ్యాచ్‌లో మొదటి బంతికే అవుట్, నాల్గవ మ్యాచ్‌లో 24 పరుగులు, ఐదవ మ్యాచ్‌లో మరో 6 పరుగులు. ఈ రికార్డు ఐదు మ్యాచ్‌ల 20 సిరీస్‌లో ఒక భారత ఓపెనర్ చేసిన అత్యల్ప స్కోరు రికార్డుగా మారింది. గతంలో సంజు ఈ రికార్డును కలిగి ఉన్నాడు. 2025లో ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల 20 సిరీస్‌లో సంజు కేవలం 51 పరుగులు మాత్రమే చేశాడు.

సంజు వరుసగా ఐదు పరాజయాలు టీం ఇండియాకు పెద్ద ఆందోళనగా మారాయి. 2026 టీ20 ప్రపంచ కప్ సమీపిస్తోంది. ఓపెనింగ్ స్లాట్‌లో స్థిరత్వం అవసరం. జట్టు యాజమాన్యం అతనికి నిరంతరం అవకాశాలు ఇస్తూనే ఉంది. కానీ, అతను భారీ స్కోర్లు చేయకపోవడం ప్రశ్నలను లేవనెత్తింది. ఇషాన్ కిషన్ మాత్రం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇది సంజు స్థానంపై చర్చను తీవ్రతరం చేస్తుంది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ మరో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తన మార్కును చూపించాడు..

## 2007 విక్టరీ నుంచి 2024 గెలుపు వరకు

# టీ20 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియా జర్నీ

**టీ20 వరల్డ్ కప్ ప్రయాణంలో రెండు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్- ధోనీ కెప్టెన్సీలో మొదటి కప్పు గెలిచిన టీమ్ఇండియా- 17 ఏళ్ల తర్వాత రోహిత్ సారథ్యంలో మళ్లీ చరిత్ర సృష్టించిన భారత్**

క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్‌కు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తక్కువ టైమ్‌లో ఎక్కువ ఎంటర్టైన్మెంట్ ఇచ్చే ఈ మెగా టోర్నీలో టీమిండియా ప్రస్థానం చాలా డిఫరెంట్ గా సాగింది. కొన్నిసార్లు ఆకాశమంత ఎత్తులో ఉంటే.. ఇంకొన్ని సార్లు ఊహించని ఓటములతో కిందకు పడిపోయింది. పరుగుల వరద పారించినా.. వికెట్లు కూల్చినా మనోళ్ల తర్వాతే ఎవరైనా అనిపించినా ఐసీసీ మొదటి టీ20 ట్రోఫీ గెలిచిన తరువాత మాత్రం మళ్ళీ చాలా టైమ్ పట్టింది. 2007లో ధోనీ సేన సృష్టించిన వండర్ నుంచి 2024లో రోహిత్ శర్మ కళ్లలో నీళ్లు తెప్పించిన విక్టరీ వరకు అసలు టీమ్ఇండియా ప్రయాణం ఎలా సాగింది అనే వివరాల్లోకి పరిశీలిద్దాం.

**2007లో యువ భారత్ సృష్టించిన సంచలనం**

2007లో సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగిన మొదటి టీ20 వరల్డ్ కప్ ఒక మర్చిపోలేని జ్ఞాపకం. సచిన్, రాహుల్, గంగూలీ శకం ముగింపు తరువాత సీనియర్ ఆటగాళ్లు లేకుండా, ఎంఎస్ ధోనీ సారథ్యంలో యువ జట్టు బరిలోకి దిగింది. అంచనాలు ఏమాత్రం లేని స్థితి నుంచి అద్భుత ప్రదర్శనతో ఫైనల్ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్ట. చివరి ఓవర్‌లో శ్రీశాంత్ పట్టిన ఆ క్యాచ్ భారత్‌ను మొదటిసారి టీ20 విశ్వవిజేతగా నిలబెట్టింది. ఈ విజయమే భారత్‌లో ఐపీఎల్ వంటి భారీ లీగ్ రావడానికి, టీ20 ఫార్మాట్ ప్రాచుర్యం పొందడానికి పునాది వేసింది.

**2009, 2010 ఊహించని అపజయం**

మొదటి టీ20 వరల్డ్ కప్ విజయం తరువాత టీమ్ఇండియాకు పెద్దగా కలిసి రాలేదు. వరుసగా సీనియర్లు ఫామ్ కోల్పోవడం కూడా జరిగింది. 2009లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్ఇండియా, సెమీస్ చేరడంలో విఫలమైంది. అలాగే 2010లో వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టోర్నీలో కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ఈ రెండు టోర్నీల్లోనూ అంచనాలు భారీగా ఉన్నా, ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు.

**2014 ఫైనల్ వరకు వెళ్లి!**

2012లో శ్రీలంక వేదికగా జరిగిన టోర్నీలో భారత్ సెమీఫైనల్ చేరుతుందనుకున్నా, కేవలం కొద్ది తేడాతో ఆ అవకాశాన్ని మిస్ చేసుకుంది. ఇక 2014లో భారత్ తన ప్రతాపం చూపించింది. అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ టైటిల్ పోరులో శ్రీలంక చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలై రన్నరప్‌గా మిగిలిపోయింది. ఈ ఓటమి అప్పట్లో టీమ్ఇండియా ఫ్యాన్స్‌ను చాలా బాధించింది. అప్పటికే వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్, ఈ కప్పు కూడా గెలుస్తుందని అందరూ ఆశించారు. కానీ అనుకున్నట్లు జరగలేదు.



**2016, 2021, స్వదేశంలో సెమీస్ గండం, దుబాయ్‌లో షాక్**

2016లో ఆతిథ్యమిచ్చిన భారత్ వరల్డ్ కప్‌లో ఫేవరెట్ జట్టుగా బరిలోకి దిగింది. అయితే సెమీఫైనల్‌లో వెస్ట్ ఇండీస్ మన కలలను చిదిమేసింది. ముంబైలో జరిగిన ఆ పోరులో విండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచి భారత్‌ను టోర్నీ నుంచి పంపించేసింది. ఆ తర్వాత కరోనా వల్ల విరామం రావడంతో 2021లో దుబాయ్‌లో టోర్నీ జరిగింది. ఈ ఎడిషన్ భారత్‌కు ఒక పీడకల లాంటిది. కనీసం సెమీస్ కూడా చేరకుండానే గ్రూప్ స్టేజ్‌లోనే భారత్ వెనుదిరగాల్సి వచ్చింది. అలాగే సూపర్ 12లో పాకిస్థాన్ చేతిలో మొదటిసారి వరల్డ్ కప్‌లో ఓడిపోవడం ఫ్యాన్స్‌కు అస్సలు మింగుడు పడలేదు.

**2022 ఇంగ్లాండ్ చేతిలో ఘోర పరాభవం**

ఆస్ట్రేలియా వేదికగా జరిగిన 2022 వరల్డ్ కప్‌లో భారత్ సెమీఫైనల్ వరకు బాగానే ఆడింది. కానీ అడిలైడ్ ఓవల్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీస్‌లో టీమ్ఇండియా దారుణంగా విఫలమైంది. పది వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసిన ఇంగ్లాండ్, ఫైనల్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఘోర ఓటమి తర్వాత టీమ్ఇండియా టీ20 టీమ్ లో భారీ మార్పులు మొదలయ్యాయి. సీనియర్లను పక్కన పెట్టి కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వాలనే ఆలోచన ఇక్కడి నుండే మొదలైంది. కెప్టెన్ గా రోహిత్ శర్మపై విమర్శలు వచ్చినా, ఆయన మళ్ళీ టీమ్ ను పునర్మించే పనిలో పడ్డారు.

**17 ఏళ్ల నిరీక్షణ తర్వాత మళ్లీ విశ్వవిజేతగా భారత్**

చివరికి 2024లో టీమ్ఇండియా మళ్ళీ తన విశ్వరూపం చూపించింది. అమెరికా, వెస్ట్ ఇండీస్ వేదికగా జరిగిన టోర్నీలో భారత్ అజేయంగా నిలిచింది. 17 ఏళ్ల టీ20 వరల్డ్ కప్ ఆశను నెరవేస్తూ ఫైనల్‌లో సౌత్ ఆఫ్రికాపై ఏడు పరుగుల స్వల్ప తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించింది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ అందుకున్న ఈ విజయం క్రికెట్ చరిత్రలో నిలిచిపోతుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఈ కప్పు వారికి ఒక గొప్ప వీడ్కోలుగా మారింది. ప్రస్తుతం టీమ్ఇండియా గర్వంగా డిఫెండింగ్ ఛాంపియన్‌గా 2026 వరల్డ్ కప్ వైపు అడుగులు వేస్తోంది.

**2026 వరల్డ్ కప్- యువ భారత్ ముందున్న అసలైన సవాలు**

రాబోయే 2026 టీ20 వరల్డ్ కప్ భారత్‌కు ఎంతో కీలకం. ఎందుకంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్ ప్లేయర్లు లేకుండా భారత్ ఎదుర్కోబోతున్న మొదటి మెగా టోర్నీ ఇది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమ్ఇండియా దాదాపు కొత్త రూపం సంతరించుకుంది. అభిషేక్ శర్మ, సంజా శాంసన్ తిలక్ వర్మ, రింకూ సింగ్ వంటి యువ బ్యాటర్లు జట్టులో కీలక పాత్ర పోషించనున్నారు. శివమ్ ధూభే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ వంటి ఆల్‌రౌండర్లతో పాటు బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నారు. సీనియర్లు లేని లోటును ఈ యువ రక్తం ఎలా భర్తీ చేస్తుందో చూడాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ధోనీ, రోహిత్ సరసన సూర్య

**టీ20 వరల్డ్ కప్‌లో నాలుగో కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్**



క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్ అంటేనే ఒక రేంజ్ క్రేజ్ ఉంటుంది. అందులోనూ వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలో టీమ్ ఇండియాను నడిపించడం అంటే అది ఒక అరుదైన గౌరవం. ఇప్పటివరకు మన జట్టును ముగ్గురు దిగ్గజ కెప్టెన్లు మాత్రమే ఈ టోర్నీలో లీడ్ చేశారు. ఇప్పుడు ఆ జాబితాలోకి మన మిస్టర్ 360 ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ అడుగుపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 7న ముంబై వేదికగా అమెరికాతో జరిగే మ్యాచ్‌తో ఈ కొత్త ప్రయాణం మొదలవ్వబోతోంది. అసలు సూర్య చేరబోతున్న ఆ స్పెషల్ క్లబ్ ఏంటి? గత కెప్టెన్ల రికార్డులు ఎలా ఉన్నాయి? ఈసారి సూర్య ముందున్న రికార్డులు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**సూర్యకుమార్ యాదవ్- ఆ నలుగురిలో ఒకడు!**

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరపున కెప్టెన్సీ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పటివరకు తలా ధోనీ, కింగ్ కోహ్లీ, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు ఈ ముగ్గురి సరసన సూర్యకుమార్ యాదవ్ పేరు చేరబోతోంది. ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగే పోరులో టాస్ వేయగానే.. భారత్‌ను వరల్డ్ కప్‌లో నడిపించిన నాలుగో కెప్టెన్‌గా సూర్య చరిత్ర సృష్టిస్తారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న జట్టుకు నాయకత్వం వహించడం సూర్యకు ఒక పెద్ద సవాలే అని చెప్పవచ్చు.

**ధోనీ నుంచి రోహిత్ వరకు- గత కెప్టెన్ల ప్రస్థానం**

టీ20 వరల్డ్ కప్ లో భారత్ ప్రయాణాన్ని చూస్తే, ఎంఎస్ ధోనీ ఏకంగా ఐదు ఎడిషన్లలో (2007, 2009, 2012, 2014, 2016) జట్టును నడిపించారు. ఆయన సారథ్యంలోనే 2007లో భారత్ మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ 2021లో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నా, దురదృష్టవశాత్తు భారత్ సెమీస్ చేరలేకపోయింది. ఇక రోహిత్ శర్మ 2022లో సెమీస్ వరకు తీసుకెళ్లి, 2024లో అద్భుతమైన విక్టరీతో భారత్‌కు రెండోసారి కప్పు అందించారు. ఇప్పుడు ఈ లెజెండరీ కెప్టెన్ల వారసత్వాన్ని సూర్య ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది.

**సూర్య ముందున్న గోల్డెన్ ఛాన్స్**

ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ముందు ఒక అరుదైన అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఈసారి కప్పు గెలిస్తే.. ధోనీ, రోహిత్ తర్వాత టైటిల్ గెలిచిన మూడో భారత కెప్టెన్‌గా సూర్య నిలుస్తారు. విరాట్ కోహ్లీకి సాధ్యం కాని ఈ ఘనతను సూర్య సాధిస్తాడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉండటం, అలాగే 2024 విక్టరీ తర్వాత టీమ్ ఫుల్ ఫామ్‌లో ఉండటం సూర్యకు కలిసొచ్చే అంశాలు. బ్యాటర్‌గా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సూర్య, ఇప్పుడు లీడర్‌గా తన సత్తా ఏంటో చూపించాలనుకుంటున్నారు.

**భారత్ సృష్టించబోయే సరికొత్త రికార్డులు**

2026 వరల్డ్ కప్ గనుక భారత్ గెలిస్తే, క్రికెట్ చరిత్రలో ఎన్నో ఫస్ట్ టైమ్ రికార్డులు మన పేరిట నమోదవుతాయి. మూడు టీ20 వరల్డ్ కప్‌లు గెలిచిన మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టిస్తుంది. అంతేకాదు, వరుసగా రెండు ఎడిషన్లు గెలిచిన తొలి టీమ్ గా కూడా నిలుస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఇప్పటివరకు ఏ ఆతిథ్య దేశం కూడా టీ20 వరల్డ్ కప్ గెలవలేదు. ఈసారి సూర్య సేన గెలిస్తే, హోమ్ గ్రౌండ్‌లో కప్పు గెలిచిన మొదటి దేశంగా భారత్ రికార్డ్ క్రియేట్ చేస్తుంది.

**2024 ఫైనల్ హీరో- ఇప్పుడు కెప్టెన్**

2024 వరల్డ్ కప్ ఫైనల్ అనగానే మనందరికీ సూర్యకుమార్ యాదవ్ పట్టిన ఆ అద్భుతమైన క్యాచ్ గుర్తుకొస్తుంది. సౌత్ ఆఫ్రికా చేతుల్లోకి వెళ్లిన మ్యాచ్‌ను ఆ ఒక్క క్యాచ్‌తో సూర్య భారత్ వైపు తిప్పేశారు. అప్పుడు ప్లేయర్‌గా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించిన సూర్య, ఇప్పుడు నాయకుడిగా ఆ కప్పును కాపాడుకోవాలని చూస్తున్నారు. తన బ్యాటింగ్ స్కిల్స్‌తో పాటు కెప్టెన్సీ వ్యూహాలతో టీమ్ ఇండియాను వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలబెట్టాలని సూర్య పట్టుదలతో ఉన్నారు. మార్చి 8న జరిగే ఫైనల్‌లో సూర్య ఆ ట్రోఫీని ఎత్తుతాడా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సీనియర్లు లేని లోటును సూర్య తన నాయకత్వంతో భర్తీ చేస్తూ భారత్‌కు మూడోసారి ప్రపంచకప్ అందిస్తాడో లేదో చూడాలి.

# టి 20కి వరల్డ్ కప్ హోదా ఇవ్వొద్దు

**50 ఓవర్ల వన్డే ప్రపంచ కప్ నిజమైన ప్రపంచ కప్**

**టీ20 ప్రపంచ కప్ పేరు మార్చాలని కూడా మంజ్రేకర్ సూచన**



భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ 50 ఓవర్ల వన్డే ప్రపంచ కప్ నిజమైన ప్రపంచ కప్ అని, టీ20 ప్రపంచ కప్ కు అదే హోదా ఉండకూడదని అన్నారు. టీ20 ప్రపంచ కప్ పేరు మార్చాలని కూడా మంజ్రేకర్ సూచించారు. దీనిని వరల్డ్ టీ20 అని పిలవాలని ఆయన సూచించారు. టెస్ట్ క్రికెట్, టీ20 క్రికెట్ మధ్య ఇరుక్కుపోయి వన్డే క్రికెట్ నెమ్మదిగా తన ప్రాముఖ్యతను కోల్పోతున్న సమయంలో మంజ్రేకర్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. "నా దృష్టిలో క్రికెట్ ప్రపంచ కప్ ఎప్పుడూ 50 ఓవర్ల ప్రపంచ కప్ గానే ఉంటుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే టి 20 వెర్షన్‌కు, ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే ప్రపంచ కప్ లాంటి హోదా ఉండకూడదు. నేను దానిని వరల్డ్ టి 20 అని పిలుస్తాను" అని మంజ్రేకర్ అన్నారు. ఈ నెల ప్రారంభంలో, భారత మాజీ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ కూడా 2027 ప్రపంచ కప్ తర్వాత వన్డే ఫార్మాట్ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నానని, ఇది విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలకు చివరి ప్రపంచ కప్ కావచ్చునని అన్నారు. 20 యుగంలో కూడా టెస్ట్ క్రికెట్ తన స్థానాన్ని కొనసాగిస్తుందని తాను నమ్ముతున్నానని అశ్విన్ అన్నాడు. కానీ అభిమానులు రెండింటినీ పణంగా పెట్టి ఎక్కువ వన్డే క్రికెట్ చూడాలనుకుంటున్నారో లేదో తనకు తెలియదు. "ప్రేక్షకులు ఏమి చూడాలనుకుంటున్నారో కూడా మనం తెలుసుకోవాలి. టెస్ట్ క్రికెట్‌కు ఇప్పటికీ స్థానం ఉందని నేను అనుకుంటున్నాను, కానీ వన్డే క్రికెట్ కు ఆదరణ తగ్గుతుందని నేను అనుకుంటున్నాను" అని అశ్విన్ అన్నాడు. రోహిత్, విరాట్ విజయ్ హజారే ట్రోఫీలో తిరిగి వచ్చారు. ప్రేక్షకులు చూడటం ప్రారంభించారు. ఆట ఎల్లప్పుడూ ఏ వ్యక్తి కంటే గొప్పదని మాకు తెలుసు, కానీ ఆటను సందర్భోచితంగా ఉంచడానికి ఈ ఆటగాళ్ళు చాలా అవసరం అని అశ్విన్ అన్నాడు.

# సూర్య స్టైల్‌లో రోహిత్ శర్మ ఛాయలు



కెప్టెన్సీ విషయంలో సూర్యకుమార్ యాదవ్‌కు రావాల్సినంత క్రెడిట్ రావడం లేదని.. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా సూర్య స్టైల్‌లో రోహిత్ శర్మ ఛాయలు ఉన్నాయని అతడు అన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డ్ ఉంది. టీ20 ఫార్మాట్లో కెప్టెన్‌గా అతడికి విజయాల శాతం 84. ఇది చాలా ఎక్కువ. కానీ మనం సూర్యకుమార్‌కు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వడం లేదు. అలాగే సూర్యకుమార్ యాదవ్ బౌలర్ల కెప్టెన్. అతడిలో రోహిత్ శర్మ ఛాయలున్నాయి. అతడు బౌలర్లపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తాడు. జట్టు కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటాడు' అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్ సానుకూల దృక్పథంతో ముందుకుసాగాలి. కెప్టెన్‌గా అతడు కచ్చితంగా వరల్డ్‌కప్ ఆడతాడు. కానీ బ్యాటర్‌గా సూర్య పరుగులు రాబట్టాల్సి ఉంది. అది అతడికి ఎంతో కీలకం' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ రికార్డ్ అద్భుతంగా ఉన్నప్పటికీ, అతడు కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ముఖ్యంగా 2025లో అతడు తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. 21 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 218 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

# తిరువనంతపురంలో ఇషాన్ విధ్వంసం..

**టీ20 కెరీర్లో తొలి సెంచరీ నమోదు**



తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం సాక్షిగా టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. కేవలం 42 బంతుల్లోనే శతక్కొట్టి తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేశాడు. కివీస్ బౌలర్లను ఒక ఆట ఆడుకున్న ఇషాన్, గాలిలో సిక్సర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించాడు.

టీ20 వరల్డ్ కప్ 2026కు ముందు జరుగుతున్న ఆఖరి పోరులో టీమిండియా బ్యాటర్లు తమ విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తన బ్యాట్‌తో చరిత్ర సృష్టించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే లోకల్ స్టార్ సంజు శాంసన్ (6) వికెట్ కోల్పోవడం షాక్ ఇచ్చింది. అయితే, ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ మాత్రం ఏమాత్రం తడబడకుండా కివీస్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. ఈ క్రమంలో కేవలం 42 బంతుల్లోనే 10 సిక్సర్లు, 6 ఫోర్లతో అద్భుతమైన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భారీ షాట్‌కు ప్రయత్నించి అవుట్ అయినప్పటికీ, అప్పటికే భారత్‌కు ఒక భారీ స్కోరును అందించాడు.

మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం తన 360 డిగ్రీల బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 26 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సూర్య, ఓవరాల్‌గా 30 బంతుల్లో 63 పరుగులు (4 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసి అవుట్ అయ్యాడు. ఇషాన్, సూర్య కలిసి మూడో వికెట్‌కు కేవలం 57 బంతుల్లోనే 137 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగంగా 3000 పరుగుల మైలురాయిని దాటిన ఘనతను కూడా సొంతం చేసుకున్నాడు.

వీరిద్దరి విధ్వంసంతో భారత జట్టు 17.3 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. కివీస్ స్పిన్నర్ ఈష్ సోధిని టార్గెట్ చేసిన ఇషాన్, ఒకే ఓవర్‌లో ఏకంగా 29 పరుగులు రాబట్టడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మ (30) మెరుపులు కూడా జట్టుకు మంచి ఊపునిచ్చాయి. ప్రస్తుతం క్రీజులో హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ ఉండటంతో టీమిండియా 250 పైచిలుకు స్కోరు సాధించే దిశగా దూసుకుపోతోంది. వరల్డ్ కప్‌కు ముందు ఇషాన్ కిషన్ ఇలాంటి మాస్ ఇన్నింగ్స్ ఆడటం జట్టు సెలెక్టర్లకు తీపి కబురు లాంటిదే.

# సినిమా

## కమల్ హాసన్ సమర్పించిన
# "లీడ్ ఆన్ గాంధీ"



జనవరి 30, 2026 అమరవీరుల దినోత్సవం నాడు, కమల్ హాసన్, గోపాల కృష్ణ గాంధీ సందేశాలతో రూపొందిన "లీడ్ ఆన్ గాంధీ" అనే పవర్ ఫుల్ డాక్యుమెంటరీ విడుదలైంది. భారతదేశ నైతికత, ప్రజాస్వామ్య విలువల నుంచి పుట్టిన గొంతులు ఇందులో ఇంటెన్స్ గా వినిపిస్తాయి. ఈ డాక్యుమెంటరీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని హతమార్చిన బుల్లెట్ ప్రయాణాన్ని ఇటలీ గనుల నుంచి, న్యూఢిల్లీ బిర్లా హౌస్ వరకు చూపించిన తీరు ఆలోచన రేకెత్తించేలా వుంది. ఒకే ఒక బుల్లెట్ కథ ద్వారా, హింస ఎలా దేశాలు, సరిహద్దులు దాటుతుందో, శాంతి ఆలోచనలు మాత్రం ఎంత కష్టంగా ప్రయాణిస్తాయో ఈ ఫిల్మ్ స్పష్టంగా చూపిస్తుంది. ఇది కేవలం చరిత్రాత్మక డాక్యుమెంటరీ కాదు, 1948 జనవరి 30న మనం ఏమి కోల్పోయామో ఆలోచింపజేసే ఫిల్మ్. నేటి ప్రపంచంలో విభజన, అసహనం సాధారణమవుతున్న సమయంలో అహింసను బలహీనతగా చూసినప్పుడు ఏమవుతుంది? గాంధీ చూపిన నైతిక ధైర్యాన్ని సమాజం మరిచితే పరిణామాలు ఏంటి? అనే అవసరమైన ప్రశ్నలని ఈ ఫిల్మ్ సంధిస్తోంది. కమల్ హాసన్ దృష్టికోణం ద్వారా, ఈ చిత్రం గాంధీజీ హత్యను నేటి కాలంతో అనుసంధానిస్తూ, కోపం-ప్రతీకారాలకన్నా ప్రేమ, సత్యం, ఆత్మనియంత్రణకు ఎక్కువ ధైర్యం అవసరమని గుర్తు చేస్తుంది.

## అమరావతికి ఆహ్వానం
# టీజర్ విడుదల



శివ కంఠమనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా అమరావతికి ఆహ్వానం. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించారు. హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ ను ప్రఖ్యాత నిర్మాత – నటులు మురళీ మోహన్ రిలీజ్ చేశారు. అమరావతికి ఆహ్వానం సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. మురళీ మోహన్ మాట్లాడుతూ – అమరావతికి ఆహ్వానం సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది. ఈ నిర్మాతలు గతంలో కూడా చిన్న బడ్జెట్ లో మంచి చిత్రాలు చేశారు. మా గురువు దాసరి చెప్పినట్లు చిన్న చిత్రాలే ఇండస్ట్రీకి ప్రాణం. కొత్త దర్శకుడైనా జీవీకే ప్రతిభావంతంగా సినిమాను చక్కగా తెరకెక్కించారు. టీజర్ తోనే భయం కలిగించారు. ఈ చిత్ర నిర్మాతలు వెంకటేశ్వరరావు, శంకర్ రావుతో నాకు చాలాకాలంగా స్నేహం ఉంది. వాళ్లు మా రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారు. గతంలో తెలుగు సినిమా అంటే తెలుగు వారికి మాత్రమే పరిమితమయ్యేది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందడం సంతోషంగా ఉంది అన్నారు. ప్రొడ్యూసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ – మాకు సినిమా ఇండస్ట్రీతో 30 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. సినిమాలు చేయాలంటే డబ్బులు కావాలని రియల్ ఎస్టేట్ మార్గాన్ని ఎంచుకున్నాం. అప్పుడే మురళీమోహన్ గారితో పరిచయం ఏర్పడింది. ఆయన రాష్ట్ర రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కు ప్రెసిడెంట్ గా పనిచేశారు. రియల్ ఎస్టేట్ లో సంపాదనతో చిన్న బడ్జెట్ లో సినిమాలు చేద్దామని ముందుకొచ్చాం. మా సంస్థలో అమరావతికి ఆహ్వానంష ఆరవ సినిమా. మేము నిర్మించిన గత చిత్రాలన్నీ థియేట్రికల్ గానే రిలీజ్ చేశాం. భోజ్ పూరిలో ఒక సినిమా చేసి అక్కడ విడుదల చేశాం. హారర్ జానర్ లో అందరికీ నచ్చేలా మా సినిమాను నిర్మించాం. ఫిబ్రవరి 13న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం.

## 'ఫంకీ' నుంచి రెండవ గీతం
# 'రట్టాటటావ్'



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కథానాయకుడు మాస్ కా దాస్ విశ్వక్ సేన్, హాస్య చిత్రాలకు చిరునామాగా మారిన దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం ఫంకీ. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగు పెట్టనున్న ఫంకీ చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు, మొదటి గీతం 'ధీరే ధీరే'కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రట్టాటటావ్' విడుదలైంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ లోని ఆర్కే సినీప్లెక్స్ లో ఈ గీతా విష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మెలోడీ పాట 'ధీరే ధీరే'తో శ్రోతల మనసు దోచుకున్న సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో, ఇప్పుడు 'రట్టాటటావ్' రూపంలో ఉత్సాహభరితమైన గీతాన్ని అందించారు. మాస్ బీట్స్ తో ఆయన స్వరపరిచిన ఈ పాట ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఆ ఉత్సాహభరితమైన సంగీతానికి తగ్గట్టుగానే రట్టాటటావ్ పిల్ల రట్టాటటావ్.. నీకు దండం ఎట్టుకుంట పిల్ల రట్టాటటావ్ అంటూ దేవ్ పవార్ అందించిన సాహిత్యం అందరికీ చేరువ అయ్యేలా ఎంతో అందంగా, సరదాగా ఉంది. గాయకుడు రామ్ మిరియాల తన గాత్రంతో ఈ పాటకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.

# ఫిబ్రవరి 14న కపుల్ ఫ్రెండ్లీ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా కపుల్ ఫ్రెండ్లీ. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ధీరజ్ మొగిలినేని కపుల్ ఫ్రెండ్లీ సినిమాను కూడా గ్రాండ్ గా తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు.

## ఫ్యామిలీ అంతా కలసి ఎంజాయ్ చేసే సినిమా
# సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని



వింటేజ్ బ్లాక్ బస్టర్ కపుల్ హీరో శివాజీ, హీరోయిన్ లయ జంటగా నటిస్తున్న చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వం వహించారు. 90 వెబ్ సిరీస్ లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్ తో పాటు అలీ, ధనరాజ్, రఘుబాబు, 30 ఇయర్స్ పృథ్వీ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 12న డైరెక్ట్ ఈటీవి విన్ ఓటీటీ వేదికగా ఈ క్రైమ్ కామెడీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ డేట్ ? సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో శివాజీ మాట్లాడుతూ.. ఈ సినిమా కథ విన్న వెంటనే నచ్చింది. ఈటీవీ విన్ వాళ్ళకి పంపించాను. ఈ ప్రాజెక్టు నాకు అప్పచెప్పారు. ఈటీవీతో నాకు ఎంతో మంచి అనుబంధంగా ఉంది. నేను మళ్ళీ మీ ముందు కనిపించడానికి కారణం బాపినీడి గారు. ఆయన ప్రోత్సాహంతోనే 90 వెబ్ సిరీస్ చేశాను. నేను చాలా కష్టాల్లో ఉన్నప్పుడు ఈటీవీ నాకు మళ్ళీ అవకాశం ఇచ్చింది. అది నేను ఎప్పటికీ మర్చిపోలేను. సుధీర్ కొత్త దర్శకుడు అయినప్పటికీ కథను చాలా అద్భుతంగా చెప్పా.డు తను చెప్పిన కథను అద్భుతంగా తీస్తాడని నమ్మకం కూడా ఉంది. సుధీర్ కి నచ్చిన టీం తోనే ఈ సినిమా చేసాం. ఈ సాంగ్ 20 సంవత్సరాలు క్రితం విన్నది. వాళ్ళ దగ్గర రైట్స్ తీసుకుని కంపోజిషన్ చేయడం జరిగింది. ఈ సినిమాకి ప్రతి టెక్నీషియన్ చాలా పాషన్ తో పనిచేశారు. ప్రిన్స్ బెస్ట్ యాక్టర్. ఈ సినిమా ద్వారా తను ఇంకో రకమైన షేడ్ లో చూస్తారా. అలాగే రఘుబాబు గారు ఆలీ గారు పృథ్వి గారు చమ్మక్ చంద్ర చాలామంది మంచి ఆర్టిస్టులు ఉన్నారు. లయ గురించి ఎంత చెప్పినా తక్కువే.

# ఇంటెన్స్ లవ్ స్టోరీ స్కై



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక నిర్మిస్తున్న సినిమా స్కై. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. స్కై సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. స్కై సినిమా ప్రీ రిలీజ్ ను ప్రముఖ దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ – ఈ ఈవెంట్ కు వచ్చే ముందు స్కై సినిమా కంటెంట్, సాంగ్స్ చూశాను. ఆ కంటెంట్ చూస్తుంటే ఈ మూవీలో ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీ చూడబోతున్నామని తెలుస్తోంది. సాంగ్స్ చాలా బాగున్నాయి. రసూల్ ఎల్లోర్ విజువల్స్ బ్యూటిఫుల్ గా ఉన్నాయి. ఈ సినిమాకు పెట్టిన క్యాప్షన్ తోనే మూవీ ఎస్సెన్స్ తెలుస్తోంది. స్కై సినిమా మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నాఅన్నారు. ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ – మా మూవీ ప్రెస్ మీట్ కు వచ్చిన మధుర శ్రీధర్ కి థ్యాంక్స్. స్కై సినిమాను మేమంతా ఎంతో కష్టపడి ప్రొడ్యూస్ చేశాం. టీమ్ అందరూ ప్యాషనేట్ గా వర్క్ చేశారు. హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఉన్న ఒక కొత్త ప్రేమ కథను మా మూవీలో మీరంతా చూడబోతున్నారు. ఫిబ్రవరి 6న సినిమాను రిలీజ్ చేస్తున్నాం అన్నారు.

# మెగాస్టార్ మెచ్చిన హీరో నవీన్



సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న చిత్రం అనగనగా ఒక రాజు. స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, సంచలన విజయాన్ని అందుకుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించారు. భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అనగనగా ఒక రాజు చిత్రం.. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని సంక్రాంతి విన్నర్ గా నిలిచింది.ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ.. టైమ్ బాగుంటే హీరో అవుతారు అంటుంటారు. కానీ టైమింగ్ బాగుండి హీరో అయినవాడు నవీన్ పొలిశెట్టి. ఏడాది క్రితం నవీన్ కి పెద్ద యాక్సిడెంట్ అయ్యి, తీవ్ర గాయాలయ్యాయి. అప్పుడు కూడా నాతో మాట్లాడుతూ.. నాకు మంచి రచయితలు కావాలి, బ్లాక్ బస్టర్ సినిమా తీయాలి అంటున్నాడు. సినిమా అంటే అంత తపన తనకు. తన టీంతో కలిసి మంచి కథను రాసుకొని, ఇలాంటి విజయం సాధించడం అంటే మామూలు విషయం కాదు. సినిమా చూస్తున్నప్పుడు నాకేం అనిపించిందంటే.. ఒక్క ఫ్రేమ్ లో కూడా నవీన్ ఎనర్జీ వదల్లేదు. ఆ ఎనర్జీ వెనుక తన కష్టం, కసి ఉన్నాయి. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతాడు. ఇటీవల నేను చిరంజీవి గారిని కలిసినప్పుడు ఆయన నవీన్ గురించి మాట్లాడారు. నవీన్ నటించిన అనగనగా ఒక రాజు సినిమా బాగుంది అంట కదా, ఎంత ఎనర్జీ ఉంటుంది ఆ అబ్బాయికి, ఈ కొత్త తరంలో నాకు బాగా నచ్చిన హీరో నవీన్ అని చెప్పారు. చిరంజీవి గారు తన సినిమా సక్సెస్ లో ఉండి కూడా నవీన్ సినిమా సక్సెస్ ని ఎంజాయ్ చేశారు. నవీన్ చిరంజీవి గారి మెప్పు పొందాడు. దర్శకుడు మారికి, చిన్మయికి, చిత్ర బృందం అందరికీ నా శుభాకాంక్షలు అన్నారు.

## పల్లె పాత్రల్లో అదరగొట్టే
# పల్లెభామలు

తెలుగు తెరపై హీరోయిన్లు అంటే కేవలం గ్లామర్ తారలే కాదు, మట్టి వాసన ఉన్న పాత్రల్లోనూ ప్రాణం పోయగలరని మన ముద్దుగుమ్మలు నిరూపించారు. ఫిదాలో సాయి పల్లవి తెగువ, రంగస్థలంలో సమంత మాస్ మేనరిజమ్స్ ప్రేక్షకులను ఇప్పటికీ మంత్రముగ్ధులను చేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అదే బాటలో జాతిరత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా భగవంతుడు సినిమా కోసం పక్కా పల్లెటూరి పిల్లలా మారిపోయి అందరికీ షాక్ ఇచ్చింది. తన హైట్, మోడ్రన్ ఇమేజ్‌ను పక్కన పెట్టి ఆమె చేస్తున్న ఈ సరికొత్త ప్రయోగం ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మరి పల్లెటూరి అమ్మాయి పాత్రల్లో ఒదిగిన భామల పైన ఓ లుక్ వేద్దాం..



**భానుమతిగా సాయి పల్లవి**
**రామలక్ష్మిగా సమంత**
**మిర్చిలో అనుష్క**
**చందమామలో కాజల్**
**భగవంతుడులో ఫరియా**



గ్లామర్ కన్నా.. పల్లెటూరి పరిమళం మిన్న : తెలుగు సినిమాల్లో హీరోయిన్ అంటే అల్ట్రా మోడ్రన్ లేదా రిచ్‌గా ఉండాలనే రూల్ ఏమీ లేదు. కొన్నిసార్లు పచ్చని పొలాల మధ్య, లంగా ఓణి కట్టిన అమాయకత్వం కూడా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది.

ఫిదాలో సాయి పల్లవి భానుమతిగా చూపించిన తెలంగాణ పల్లెటూరి తెగువ, రంగస్థలంలో రామలక్ష్మిగా సమంత పండించిన మాస్ పల్లెటూరి హావభావాలు ప్రేక్షకులకు ఇప్పటికీ గుర్తే. దేవర మూవీలో జాన్వీ కపూర్ మొదటిసారి తెలుగు మూవీ చేస్తూ గ్లామర్ కన్నా పల్లెటూరు మిన్న అన్నట్టు ఫుల్ మూవీ అంతా అదే పాత్రలో కొనసాగింది. ఇక అప్పట్లో వచ్చిన చందమామలో కాజల్, మిర్చిలో అనుష్క, కరెంట్ తీగలో రకుల్, అ ఆలో అనుపమ.. ఇలా ప్రతి ఒక్కరూ తమ గ్లామర్ ఇమేజ్‌ని పక్కన పెట్టి మట్టి వాసన కలిగిన పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఈ పాత్రలే వారి కెరీర్‌కు మైలురాళ్లుగా నిలిచాయి. చిట్టి

ఇక పల్లెటూరి గుమ్మ: జాతి రత్నాలు సినిమాతో చిట్టిగా అందరి మనసు దోచుకున్న ఫరియా అబ్దుల్లా, ఇప్పుడు భగవంతుడు చిత్రంతో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. తాజాగా విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎత్తుగా ఉండే ఫరియా, పల్లెటూరి లంగా ఓణిలో ఎంతో ఒద్దికగా కనిపిస్తూనే, మరోవైపు తనదైన శైలిలో రొమాంటిక్ సీన్స్‌లో గ్లామర్ టచ్ కూడా ఇచ్చింది. సాధారణంగా పల్లెటూరి పాత్రలు అంటే కొంత రిస్క్ అని భావిస్తారు, కానీ సాయి పల్లవి, సమంతల మాదిరిగానే ఫరియా కూడా ఈ సినిమాతో తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించి సక్సెస్ బాట పడుతుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. హీరోయిన్లు పల్లెటూరి పాత్రలు చేయడం వల్ల వారిలోని నటనా సామర్థ్యం బయటపడటమే కాకుండా, మాస్ ఆడియన్స్‌కు మరింత దగ్గరయ్యే అవకాశం ఉంటుంది. భగవంతుడు సినిమాలో ఫరియా చేస్తున్న ఈ పల్లెటూరి ప్రయత్నం తప్పకుండా ఆమెకు మంచి బ్రేక్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటేనే ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం రాణించవచ్చని భావించి, ఇప్పుడు ఫరియా కూడా అదే బాటలో నడుస్తోంది. మరి ఈ పల్లెటూరి భామ బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు మేపిస్తుందో చూడాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే..





PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044